# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 133 | హైదరాబాద్ | గురువారం 13-11-2025 | పేజీలు : 12 | వెల : 1.00



11లో

ఢిల్లీ పేలుడు ఘటన...
కేంద్రంపై నిప్పులు చెరిగిన ఖర్గే

## నేటి భారతం

- నువ్వెప్పుడైతే ఎక్కువుగా ఆశపడతావో.. అప్పుడే నీ పతనం మొదలవుతుంది..
- అయాచితంగా వచ్చేది ఏదైనా సరే.. నిర్మోహమాటంగా నాకు వద్దు అని చెప్పడం ఎంతో మంచిది..
- నీకు ప్రాప్తం ఉన్నది నువ్వు ఎక్కడ ఉన్నా నిన్ను చేరుతుంది..
- నీది కానీ దానికోసం అర్రులు చాస్తే కాలం కూడా నీకు సహకరించదు..
- అందుకే నిన్ను మోసం చేసే వాళ్ళు పెరిగిపోతున్నారు.. అడుగడుగునా నీ కదలికలను గమనిస్తున్నారు..
- నిన్ను నట్టేట ముంచడానికి పథకాలు రచిస్తూ ఉంటారు..
- నువ్వు ఓట్లేసి గెలిపించుకున్న ప్రభుత్వం.. నిన్ను కాపాడే బదులు.. అక్రమార్కులకు సహకరిస్తోంది..
- అందుకే ఎవరినీ నమ్మకు.. అత్యాశకు పోకు..
- నిజాయితీగా ఉండు.. నువ్వనుకున్నది సాధించు..

– బోయినపల్లి రమణా రావు,
సీనియర్ జర్నలిస్ట్..


11లో

## భూటాన్ నుంచి నేరుగా
# ఆసుపత్రికి ప్రధాని మోదీ..

- ఎర్రకోట పేలుడు బాధితులకు పరామర్శ
- భూటాన్ పర్యటన ముగించుకుని తిరిగొచ్చిన ప్రధాని మోదీ
- ఢిల్లీలోని లోక్ నాయక్ జైప్రకాశ్ ఆసుపత్రిలో బాధితులతో మాట్లాడిన వైనం
- త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష

## తెలంగాణ కేబినెట్
# సమావేశం వాయిదా...

- మరోసారి వాయిదా పడిన తెలంగాణ కేబినెట్ సమావేశం
- ఈరోజు జరగాల్సిన భేటీ ఈ నెల 15వ తేదీకి మార్పు
- రేవంత్ రెడ్డి అధ్యక్షతన శనివారం జరగనున్న సమావేశం


11లో


11లో

## డీజీపీకి కేటీఆర్
# క్షమాపణ చెప్పాలి

- డీజీపీపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు సరికాదన్న పోలీసు అధికారుల సంఘం
- పోలీసు శాఖ నిష్పక్షపాతంగా పని చేస్తోందని వెల్లడి
- సంస్కారయుతంగా, సభ్యతతో ప్రశ్నించాలని సూచన

## అలాంటి వాహనాలపై భారీగా పెనాల్టీ వేయండి


11లో

- నిబంధనలు ఉల్లంగిస్తున్న వాహనాలపై పెనాల్టీ విధించాలన్న మంత్రి
- ఓవర్ లోడింగ్ వాహనాలు సీజ్ అయ్యేలా కఠిన చర్యలు తీసుకోవాలని సూచన
- మహిళా ఆటోలకు అనుమతులు ఇచ్చేందుకు సానుకూలంగా ఉన్నట్లు వెల్లడి

## ఢిల్లీలో కారు బాంబు పేలుడు..
# హైదరాబాద్‌లో కొనసాగుతున్న తనిఖీలు


11లో

- మూడు కమిషనరేట్ల పరిధిలో కొనసాగుతున్న హైఅలర్ట్
- డాగ్ స్క్వాడ్ బాంబు స్క్వాడ్ బృందాలతో తనిఖీలు
- ఎక్కడ ఉగ్రకుట్రలు భగ్నమైనా హైదరాబాద్‌లో వెలుగుచూస్తున్న మూలాలు

## మగువా.. మగువా..
# లోకానికి తెలుసా నీ విలువ..?




మహిళను ఆదిపరాశక్తిగా పూజించే దేశం మనది.. త్రిమూర్తులనే తన బిడ్డలుగా చేసుకున్న ఆదిశక్తి మహిమలను మనం పురాణాల్లో చదివాం.. కానీ ప్రస్తుత కాలంలో మహిళను కనీసం ఒక మనిషిగా కూడా గుర్తించలేకపోతున్నామన్నది అత్యంత శోచనీయం.. అనాధిగా స్త్రీ బలహీనురాలు, ఇంటికి మాత్రమే పరిమితం, పిల్లల్ని కనడానికి మాత్రమే పనికి వస్తుంది అనే ఒక దురాలోచన పురుష ప్రపంచంలో నాటుకుని పోవడంతో ఆడది, ఆడదిగానే మిగిలిపోయింది.. ఇప్పటికీ మహిళకు భద్రత లేకపోవడం ఎంత దృదృష్టకరం.. ఎన్ని చట్టాలు తీసుకుని వచ్చినా.. షీ టీమ్స్ లాంటి వ్యవస్థను ఏర్పాటు చేసినా పరిస్థితుల్లో మార్పు అనేది రావడం లేదు.. ఇది ఏ ప్రభుత్వమో, చట్టమో.. వ్యవస్థో తీసుకుని వచ్చే మార్పు కాదు.. మనం మారాలి.. మన ఆలోచనల్లో మార్పు రావాలి.. ఇది సత్యం.. మరీ ముఖ్యంగా అన్యాయం జరిగిన స్త్రీ పట్ల న్యాయస్థానాలు త్వరితగతిన స్పందించాలి.. నేరం చేసిన వారికి న్యాయస్థానాలు లొంగిపోతున్న సందర్భాలు అనేకం ఉన్నాయి.. ఈ పరిస్థితుల్లో మార్పు అనివార్యమని మేధావులు సూచిస్తున్నారు..

12లో

- నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో నివేదికలో విస్తుపోయే అంశాలు..
- ప్రతి పది నిమిషాల్లో ఒక మహిళపై దాడి జరుగుతోంది..
- మహిళలు మహారాణులని చెప్పకోవడం తప్ప ఇంకేమీ లేదు..

## గృహ నిర్మాణ రంగాన్ని కుక్కలు చింపిన
# విస్తరిలా తయారు చేశారు


11లో

- అన్నమయ్య జిల్లా రాయచోటిలో 'ప్రజావేదిక' కార్యక్రమం
- 2029 నాటికి పేదలందరికీ సొంతింటి కలను సాకారం చేస్తామని వెల్లడి
- ఉగాది నాటికి రాష్ట్రవ్యాప్తంగా మరో 5.9 లక్షల ఇళ్లలో గృహప్రవేశాలు
- ఇంటింటికీ సోలార్ విద్యుత్, ఇంటర్నెట్ అందిస్తామన్న ముఖ్యమంత్రి

భారత శక్తి

# ఉగ్రవాదుల అడ్డగా... ఆల్ ఫలాహ్

ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో పేలిన బాంబు మనదేశంలో ఉన్న ఉగ్రవాదుల అందర్నీ పట్టిస్తోంది. ఇప్పటికే ఈ సంఘటనలో ముగ్గురు డాక్టర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తాజాగా మరో ముగ్గురిని కూడా అదుపులోకి తీసుకున్నారు.. మంగళ వారం అదుపులోకి తీసుకున్న ముగ్గురు డాక్టర్లు హర్యానా రాష్ట్రంలోని ఫరీదాబాద్ ఆసుపత్రిలో పనిచేస్తున్నారు. ఫరీదాబాద్ ప్రాంతంలోని ఆల్ ఫలాహ్ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్నారు.పోలీసులు అరెస్ట్ చేసిన వైద్యులలో డాక్టర్ ముజామిల్ షకీల్, డాక్టర్ షాహిన్ షాహిద్, డాక్టర్ ఉమర్ మహమ్మద్ ఉన్నారు. ఇందులో ఉమర్, ముజామిల్ కాశ్మీర్ రాష్ట్రానికి చెందిన వారు. షహీన్ లక్నోకు చెందిన వ్యక్తి. వీరంతా కూడా ఫరీదాబాద్ ఆసుపత్రిలో వైద్యులుగా పనిచేస్తున్నారు. ఆల్ ఫలాహ్ విశ్వవిద్యాలయంలో పని చేస్తూ దౌజా అనే గ్రామంలో షకీల్ రెండు ఇండ్లను అద్దెకు తీసుకున్నాడు. అందులో మూడు టన్నుల పేలుడు పదార్థాలను నిల్వ చేసాడు.. పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు..జైషే మహమ్మద్ అనే ఉగ్రవాద సంస్థ వైట్ మాడ్యూల్ లో ఉగ్రవాదులను తయారు చేస్తోంది. డాక్టర్లను, విద్యార్థులను ఉగ్రవాదులుగా మార్చుతోంది. ఈ విభాగానికి డాక్టర్ షహీన నాయకత్వం వహిస్తున్నారు.. అందువల్లే ఆ యూనివర్సిటీలో పలువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కాలేజీలో చదువుతున్న చాలామంది వైద్య విద్యార్థులు ఉగ్రవాద సంస్థల కార్యకలాపాలకు ఆకర్షితులవుతున్నారని ఇంటలిజెన్స్ రిపోర్టు ఇటీవల పోలీసులకు తెలిసింది. దీంతో పోలీసులు ఈ విశ్వవిద్యాలయం పై దృష్టి సారించారు. ఫలితంగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది.. ఇంటెలిజెన్స్ వర్గాలు.. నిఘా వర్గాలు ఈ విశ్వవిద్యాలయంలో చదివిన పాత విద్యార్థుల వివరాలు కూడా సేకరించాయి. అందులో కేసులు ఉన్న వారి వివరాలు కూడా పరిశీలించి.. వారి గురించి ఆరా తీస్తున్నాయి.ఈ విశ్వవిద్యాలయం వైద్యుల ఫ్యాక్టరీ మాదిరిగా ఉండేది. ఇక్కడ చదువుకున్న వారంతా దేశ విదేశాలలో స్థిరపడ్డారు. ఈ ప్రాంతానికి విశేషమైన పేరు తీసుకొచ్చారు. కానీ కొంతకాలంగా ఈ విశ్వవిద్యాలయంలో పరిస్థితి దారుణంగా మారుతోంది.. కొంతమంది వ్యక్తులు ఇక్కడ వైద్య విద్య పేరుతో ప్రవేశం పొంది దారుణమైన కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. కొంతమంది విద్యార్థులను ఉగ్రవాద కార్యకలాపాలు చేపట్టడానికి ఎంపిక చేసుకుంటున్నారు. వారి ద్వారా దారుణమైన పనులు చేయిస్తున్నారు. చివరికి వారి ప్రాణాలను గాలిలో కలిసేలా చేస్తున్నారు. ఆత్మహుతి దళాలుగా కూడా పనిచేసేలా శిక్షణ ఇస్తున్నారు. చివరికి వారి కుటుంబాలను కూడా అన్యాయం చేస్తున్నారు.పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ పాకిస్తాన్ పై విరుచుకుపడింది. ముఖ్యంగా పాకిస్తాన్ దేశంలో ఉన్న ఉగ్రస్తావరాలపై విస్తృతంగా దాడి చేసింది.. చూస్తుండగానే పాకిస్తాన్లో ఉగ్రస్తావరాలను నేలమట్టం చేసింది. రెండవ కంటికి తెలియకుండా ఉగ్రవాదుల నివాసాలను కూడా కాలగర్భంలో కలిపేసింది. భారత్ చేసిన దాడుల వల్ల సహజంగానే పాకిస్తాన్ స్పందించింది. ఎందుకంటే పాకిస్తాన్ కు, ఉగ్రవాదులతో అవినాభావ సంబంధం ఉంది. అందువల్లే ఉగ్రవాదుల స్థావరాలు నేలమట్టమైతే పాకిస్తాన్ స్పందించింది. ఒకరకంగా శోకాలు పెట్టింది.ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్ పాకిస్తాన్ దేశాన్ని మరింత ఇబ్బందికి గురిచేసే ప్రయత్నం మొదలు పెట్టింది. ఈ క్రమంలో సింధూ నది మీద ఒక బృహత్తరమైన హైడల్ ప్రాజెక్ట్ నిర్మించాలని భావించింది. అంతేకాదు పాకిస్తాన్ దేశానికి సింధూ నది ప్రవాహాన్ని నిలిపివేసే ప్రణాళిక కూడా విజయవంతంగా అమలు చేస్తోంది. దీంతో పాకిస్తాన్ దేశంలో హాహా కారాలు వ్యక్తమవుతున్నాయి. దీనికి తోడు అక్కడి వ్యవసాయం కూడా తీవ్రంగా ప్రభావితమవుతోంది. చివరికి క్రికెట్ విషయంలో కూడా పాకిస్తాన్ దేశంతో ఆడేందుకు భారత్ ఒప్పుకోవడం లేదు. ద్వైపాక్షిక సిరీస్ లకు టీ మీడియా ఎప్పుడో దూరమైంది. ఐసీసీ నిర్వహించే మెగా టోర్నీలో మాత్రమే టీమిండియా పాకిస్తాన్ జట్టుతో తలపడుతోంది. అది కూడా తటస్థ వేదికలలో మాత్రమే ఆడుతోంది.ఢిల్లీలో ఎర్రకోట సమీపంలోని మెట్రో స్టేషన్ వద్ద కారు పేలుడుకు పాల్పడింది పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులని భారత ఇంటెలిజెన్స్ వర్గాలు మొదటి నుంచి కూడా అనుమానిస్తున్నాయి. ఇదే క్రమంలో జాతీయ మీడియాలో కూడా వార్తలు వస్తున్నాయి. ఢిల్లీ గడ్డమీద కారు పేలుడుకు కారణమైన పాకిస్తాన్ ఉగ్రవాదులకు గట్టి బుద్ధి చెప్పాలని భారత్ భావిస్తోంది. ఈ క్రమంలోనే ఆపరేషన్ సిందూర్ 2.0 చేపట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. భూటాన్ వేదికగా జరిగిన ఓ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కీలకమైన వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదులకు గట్టి సమాధానం చెబుతామని.. అటువంటివారిని ఎట్టి పరిస్థితుల్లో తాము ఉపేక్షించబోమని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ కు ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇంగ్లీష్ లో మాట్లాడారు. ఇప్పుడు కూడా ఆయన ఇంగ్లీషులోనే మాట్లాడారు. పైగా ఉగ్రవాదులను అత్యంత కఠినంగా శిక్షిస్తామని.. వారు ఎక్కడ ఉన్నా సరే బయటికి తీసుకొస్తామని హెచ్చరించారు. ఈ ప్రకారం ఢిల్లీ దాడికి పాల్పడిన ఉగ్రవాదులపై ఆపరేషన్ సిందూర్ 2.0 చేపట్టే అవకాశం ఉందని జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. మరోవైపు ఆపరేషన్ సిందూర్ 2.0 కనక మొదలైతే పాకిస్తాన్ ప్రపంచ పటంలోనే ఉండదని భారత నెటిజన్లు సోషల్ మీడియాలో అభిప్రాయపడుతున్నారు.

# వైఎస్ జగన్ బ్యాక్ స్టేప్...

విజయవాడ, నవంబర్ 12,

వైసీపీ అధినేత వైఎస్ జగన్ సీబీఐ కోర్టు ఎదుట వ్యక్తిగతంగా హాజరయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. వ్యక్తిగత మినహాయింపు కోరుతూ జగన్ సీబీఐ కోర్టులో పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నాంపల్లి సీబీఐ కోర్టు వైఎస్ జగన్ పిటిషన్ విచారించి.. కౌంటర్ దాఖలు చేయాలని సీబీఐను ఆదేశించింది. అయితే జగన్ అభ్యర్థనపై సీబీఐ అభ్యంతరం తెలపటంతో వైఎస్ జగన్ కోర్టు ఎదుట హాజరు కానున్నట్లు సమాచారం. ఆయన తరుపు న్యాయవాదులు వారం రోజులు సమయం కోరగా.. నవంబర్ 21వ తేదీ వరకూ సీబీఐ కోర్టు సమయం ఇచ్చింది.మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సీబీఐ కోర్టు ముందు వ్యక్తిగతంగా హాజరు కానున్నారు. నవంబర్ 21లోగా నాంపల్లిలోని సీబీఐ కోర్టులో వైఎస్ జగన్ వ్యక్తిగతంగా హాజరయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ మేరకు వైఎస్ జగన్ సీబీఐ కోర్టుకు తెలియజేశారు. వైఎస్ జగన్ ఇటీవల యూరప్ పర్యటనకు వెళ్లిన సంగతి తెలిసిందే. అయితే యూరప్ పర్యటన పూర్తై వచ్చిన తర్వాత నవంబర్ 14వ తేదీలోగా కోర్టు ఎదుట వ్యక్తిగతంగా హాజరు కావాలని సీబీఐ కోర్టు వైఎస్ జగన్‌ను ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే వ్యక్తిగత హాజరు మినహాయింపు ఇవ్వాలంటూ వైఎస్ జగన్ కోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన సీబీఐ కోర్టు.. కౌంటర్ దాఖలు చేయాలని సీబీఐను ఆదేశించింది. అయితే వైఎస్ జగన్ అభ్యర్థనపై సీబీఐ అభ్యంతరం తెలుపుతూ కౌంటర్ దాఖలు చేసింది.దీంతో కోర్టు ఎదుట వ్యక్తిగతంగా హాజరయ్యేందుకు వారం రోజులు సమయం ఇవ్వాలని వైఎస్ జగన్ తరుపున ఆయన న్యాయవాదులు కోర్టును కోరారు. దీంతో నవంబర్ 21 వరకు సమయం ఇస్తూ సీబీఐ కోర్టు నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో ఆలోపు వైఎస్ జగన్ నాంపల్లి సీబీఐ కోర్టులో హాజరయ్యే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు అక్టోబర్ నెలలో వైఎస్ జగన్ లండన్ పర్యటనకు వెళ్లారు. లండన్ పర్యటనకు అనుమతి ఇవ్వాలంటూ అంతకుముందే సీబీఐ కోర్టును కోరారు. ఈ వినతిని పరిశీలించిన సీబీఐ కోర్టు.. షరతులతో జగన్ లండన్ పర్యటనకు అనుమతి ఇచ్చింది. పర్యటన పూర్తైన తర్వాత నవంబర్14వ తేదీలోగా వ్యక్తిగతంగా కోర్టు ఎదుట హాజరు కావాలని స్పష్టం చేసింది.అయితే లండన్ పర్యటన నుంచి వచ్చిన అనంతరం వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు కోరుతూ జగన్ కోర్టులో పిటిషన్ వేశారు. తాను కోర్టుకు హాజరయ్యేందుకు ప్రభుత్వం ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేయాల్సి



వస్తుందని.. ఇది ప్రభుత్వ యంత్రాంగానికి భారమని పిటిషన్‌లో జగన్ పేర్కొన్నారు. వ్యక్తిగత హాజరు మినహాయింపు ఇవ్వాలని కోరారు. లేనిపక్షంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యేందుకు అనుమతి ఇవ్వాలని పిటిషన్ వేశారు.వైఎస్ జగన్ పిటిషన్ మీద విచారణ జరిపిన సీబీఐ కోర్టు.. కౌంటర్ దాఖలు చేయాలని సీబీఐను ఆదేశించింది. అయితే వైఎస్ జగన్ అభ్యర్థనపై కేంద్ర దర్యాప్తు సంస్థ అభ్యంతరాలు తెలియజేయటంతో.. వ్యక్తిగతంగా హాజరయ్యేందుకు వారం రోజులు గడువు కావాలని జగన్ తరుపు న్యాయవాదులు కోర్టును కోరారు. దీంతో నవంబర్ 21వ తేదీ వరకూ గడువు ఇస్తూ సీబీఐ న్యాయస్థానం నిర్ణయం తీసుకుంది . మరి నవంబర్ 21లోపు వైఎస్ జగన్ సీబీఐ కోర్టులో హాజరవుతారా లేదా అనేది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది.

# కంటికి కునుకు లేకుండా చేస్తున్న 22ఏ

కాకినాడ, నవంబర్ 12

ఆంధ్రప్రదేశ్‌లో 22ం సమస్య లక్షల మంది ఏపీ ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. 1977లో అమలు చేసిన ఏపీ అసైన్డ్ ల్యాండ్ చట్టం కింద పేదలు, భూమి లేని కుటుంబాలకు కేటాయించిన 35.4 లక్ష ఎకరాల భూములు ఇప్పటికీ వివాదాల్లోనే ఉన్నాయి. ఈ భూములు రిజిస్ట్రేషన్ చేయకుండా, ట్రాన్స్‌ఫర్ చేయకుండా 22ం లిస్ట్‌లో ఉంచడం వల్ల లక్షలాది మంది రైతులు, కుటుంబాలు ఆర్థిక నష్టాలు, సామాజిక అస్థిరత్వానికి గురవుతున్నారు. ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వం పరిష్కారాలు ప్రకటించినప్పటికీ, మార్చి 2025 నుంచి జూన్ 2026 వరకు విస్తరించిన ఆలస్యం ప్రజల అసంతృప్తిని పెంచుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో 22ం భూముల సమస్యలు అసైన్డ్ చట్టం అమలు తీరుతో ప్రారంభమయ్యాయి. ఈ చట్టం ప్రకారం, ాఅ/ా, ఃఅ, మైనారిటీలు, భూమిలేని పేదలకు కేటాయించిన భూములను ట్రాన్స్‌ఫర్ చేయకూడదని నిబంధనలు విధించారు. ఈ భూములు 'ప్రొటెక్టెడ్' గా ఉండాలని ఉద్దేశ్యం. కానీ భూములు పొందిన అనేక మంది వాటిని అమ్ముకోవడం, బదలాయించడం చేశారు. అలాగే రికార్డుల ఫ్రాడ్ వల్ల డాటెడ్ ల్యాండ్స్ గా మారాయి. వైఎస్ఆర్సీపీ హయాంలో ఇష్టం వచ్చినట్లుగా 22ంను అమలు చేస్తూ నిర్ణయం తీసుకోవడంతో సమస్య తీవ్రం అయింది. ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ప్రతి కాలనీ.. ప్రతి భూమిపై 22జీ అమలు చేశారు. కొన్ని చోట్ల ఆయా కాలనీల వాసుల వద్ద ప్రభుత్వం డబ్బులు తీసుకుని రిజిస్ట్రేషన్ చేసింది. అంటే..అధికారికంగా అమ్మేసింది. గుంటూరులోని నల్లకుంటగా పిలిచే లక్ష్మిరఘురామయ్య నగర్ ఒకప్పుడు పేదలకు ప్రభుత్వం చిన్న చిన్న స్థలాల రూపంలో ఇచ్చింది. తర్వాత వాటిని నామినల్ ధరకు వారికి అమ్మకపు రిజిస్ట్రేషన్ చేసింది.కానీ వైసీపీ హయాంలో ఈ కాలనీని కూడా 22జీ కిందకు తెచ్చారు. ఈ కారణంగా ప్రజలు ఆస్తి ఉన్నా..దాన్ని బదలాయించుకోలేకపోతున్నారు. అదే సమయంలో రాజకీయకక్షలు తీర్చుకోవడానికి కూడా ఈ చట్టాన్ని దుర్వినియోగం చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. అలాగే తమకు కావాల్సిన భూములకు మాత్రం ఫ్రీహోల్డ్ ఇచ్చి భూముల్ని కొట్టేసే కుట్ర చేశారన్న ఆరోపణలు రావడంతో 2024లో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వా 20 లక్షల ఎకరాల రిజిస్ట్రేషన్ ఫ్రీజ్ విధించారు. మొత్తం అవకతవకలపై విచారణ జరుపుతున్నారు. ఈ సమస్యలు రైతులు, చిన్న వ్యాపారులు, మధ్యతరగతి కుటుంబాలను బాధిస్తున్నాయి. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, గుంటూరు జిల్లాల్లో లక్షలాది అప్లికేషన్లు అఅఒం కు వచ్చాయి. ాఅ/ా కమ్యూనిటీలు ఎక్కువగా ప్రభావితమవుతున్నారు, ఎందుకంటే ఈ భూములు వారి జీవనాధారం. 2025 జూలైలో రిజిస్ట్రేషన్ ఫ్రీజ్ రెండో సంవత్సరంలోకి ప్రవేశించడంతో సమస్య పరిష్కారం కోసం ఎదురు చూస్తూ అలసిపోతున్నారు. ప్రస్తుత రెవెన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్ జనవరి 2025లో 22ం బ్యాన్ లిఫ్ట్ చేస్తామని ప్రకటించారు. డిస్ట్రిక్ట్ కలెక్టర్లకు మూడు రోజుల్లో రిపోర్ట్ సమర్పించమని ఆదేశాలు ఇచ్చారు. మార్చి 25, 2025న మంత్రి "ప్రైవేట్ ల్యాండ్స్‌ను 22ం లిస్ట్ నుంచి తొలగించమని" కలెక్టర్లకు సూచించారు. యాక్ట్‌లో అప్పీల్ అథారిటీని ఆర్డీఎలకు మార్చి, డిస్ప్యూట్ రిసాల్వ్ చేయడానికి వేగం తీసుకురావాలని చెప్పారు. తర్వాత డిస్ట్రిక్ట్-లెవల్ అసైన్‌మెంట్ కమిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సెప్టెంబర్ 16, 2025లో మార్చి నుంచి మూడు నెలల్లో పరిష్కరిస్తామని ప్రామిస్ చేశారు. కానీ ఇప్పటికీ పరిష్కారం కాలేదు. భూ సమస్యల పరిష్కారం అంత తేలిక కాదు. కానీ పరిష్కారం అసాధ్యం వైసీపీ హయాంలో జరిగిన అవకతవకల ఇన్వేస్టిగేషన్ కు అధిక సమయం పడుతోందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ల్యాండ్ రీ-సర్వేలు, డిస్ట్రిక్ట్ కమిటీల ఏర్పాటు ? జనవరి 20, 2025 నుంచి రీ-సర్వే ప్రారంభించారు, కానీ పూర్తి అమలుకు 4-6 నెలలు పడుతుందని అంటున్నారు. కానీ ఎప్పటికప్పుడు త్వరలో అంటున్నారు కానీ.., పరిష్కారం దిశగా ఆలోచనలు చేయడం లేదు. ఉనీఓ రికమెండేషన్లు, డిజిటల్ రికార్డులు భూ-రక్ష వంటివి ద్వారా త్వరిత పరిష్కారం సాధ్యమేనని ప్రభుత్వానికి చిత్తశుద్ధే ఉండాలని అంటున్నారు. మరి ప్రభుత్వం ఆలకిస్తుందా ? ప్రభుత్వాలే సృష్టించిన పేదల కష్టాలు తీరుస్తుందా?

# నాలుగున్నర గంటల్లో తిరుపతి

విజయవాడ, నవంబర్ 12,

ఆంధ్రప్రదేశ్‌కు రైల్వేశాఖ శుభవార్త అందించింది. ఏపీలో మరో వందే భారత్ రైలు అందుబాటులోకి రానుంది. ఈ నెలాఖరు నుంచి విజయవాడ బెంగళూరు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు అందుబాటులోకి రానుంది. దీనికి సంబంధించి ఇప్పటికే షెడ్యూల్, రూట్ మ్యాప్ ఖరారు చేశారు. ఈ రైలు వారంలో మంగళవారం మినహా మిగిలిన ఆరు రోజులు ప్రయాణికులకు అందుబాటులో ఉంటుంది. అలాగే ఈ రైలు అందుబాటులోకి వస్తే విజయవాడ నుంచి తిరుపతికి కేవలం నాలుగున్నర గంటల్లో చేరుకోవచ్చని రైల్వే అధికారులు చెప్తున్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి త్వరలోనే మరో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు రానుంది. రైల్వే శాఖఏపీకి మరో వందే భారత్ రైలును మంజూరు చేసింది. ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న విజయవాడ?బెంగళూరు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు నవంబర్ నెలాఖరుకు పట్టాలు ఎక్కనుంది. విజయవాడ బెంగళూరు వందే భారత్ రైలుకు సంబంధించిన.. రూట్ మ్యాప్, షెడ్యూల్ రైల్వేశాఖ తాజాగా ఖరారు చేసింది. విజయవాడ - బెంగళూరు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు.. మంగళవారం మినహా వారంలో అన్ని రోజులూ అందుబాటులో ఉంటుంది. ఈ వందేభారత్ రైలు ద్వారావిజయవాడ నుంచి బెంగళూరుకు 9 గంటల్లోపేచేరుకోవచ్చు.



విజయవాడ బెంగళూరు వందే భారత్ రైలుకు తెనాలి, ఒంగోలు, నెల్లూరు రైల్వేస్టేషన్, తిరుపతి, చిత్తూరు, కాట్పాడి, కృష్ణరాజపురం రైల్వేస్టేషన్‌లలో హాల్ట్ సౌకర్యం కల్పించారు.మరోవైపు విజయవాడ బెంగళూరు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలులో మొత్తం 8 బోగీలు ఉంటాయి. 7 ఏసీ చైర్‌కార్ బోగీలు ఉంటే.. ఒకటి ఎగ్జిక్యూటివ్ చైర్ కార్ బోగీ ఉంటుంది. విజయవాడ బెంగళూరు వందేభారత్ రైలు 20711 నంబరుతో అందుబాటులో ఉంటుంది. ఈ రైలు ప్రతి రోజూ ఉదయం 5 గంటల 15 నిమిషాలకు విజయవాడలోబయలుదేరుతుంది. మధ్యాహ్నం 2 గంటల 15 నిమిషాలకు బెంగళూరు రైల్వేస్టేషన్ చేరుకుంటుంది. 20712 నంబరుతో బెంగళూరు విజయవాడ వందేభారత్ రైలు సేవలు అందుబాటులో ఉంటాయి. బెంగళూరు విజయవాడ వందేభారత్ రైలు.. బెంగళూరులో మధ్యాహ్నం 2 గంటల 45 నిమిషాలకు బయల్దేరుతుంది. రాత్రి 11.45 గంటలకు విజయవాడ రైల్వేస్టేషన్ చేరుకుంటుంది.మరోవైపు విజయవాడ బెంగళూరు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు అందుబాటులోకి వస్తే తిరుపతికి వెళ్లేవారికి సౌకర్యంగా ఉంటుంది. ముఖ్యంగా విజయవాడ వైపు నుంచి తిరుపతి వెళ్లేవారికి ఈ రైలు అత్యంత ఉపయోగకరంగా ఉంటుంది. విజయవాడ బెంగళూరు వందేభారత్ రైలు అందుబాటులోకి వస్తే.. కేవలం నాలుగున్నర గంటల్లోనే విజయవాడ నుంచి తిరుపతికి చేరుకోవచ్చు. అయితే ముందే చెప్పుకున్నట్లుగా ఈ రైలు మంగళవారం మినహా వారంలో మిగతా అన్ని రోజులూ అందుబాటులో ఉంటుంది. విజయవాడలో ఉదయం 5.15 గంటలకు బయలుదేరితే.. ఉదయం 9.45గంటల సమయానికి తిరుపతి రైల్వేస్టేషన్ చేరుకోవచ్చు.ఇక బెంగళూరు విజయవాడ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు.. సాయంత్రం 6.55గంటల సమయానికి తిరుపతి రైల్వేస్టేషన్‌కు చేరుకుంటుంది. రాత్రి 11 గంటల 45 నిమిషాలకు విజయవాడ రైల్వేస్టేషన్ చేరుకోవచ్చు.మరోవైపు విజయవాడ నుంచి బెంగళూరు వెళ్లేందుకు ఇప్పటి వరకూ కొండవీడు ఎక్స్‌ప్రెస్ రైలు మాత్రమే ప్రయాణికులకు అందుబాటులో ఉంది. ఈ రైలు వారంలో కేవలం మూడు రోజులు మాత్రమే నడుస్తోంది. ఈ నేపథ్యంలో విజయవాడ బెంగళూరు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు అందుబాటులోకి వస్తే.. ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# టీడీపీలో ఆ ఎమ్మెల్యేలపై చర్యలే....

విజయవాడ, నవంబర్ 12

ప్రత్యర్థులే కాదు.. సొంత వారి చర్యలపై దృష్టి పెట్టి ఉండాలంటారు పెద్దలు. ఎందుకంటే తమ వెంటే ఉండి తప్పులు చేసిన వారు ఉంటారు. అటువంటి వారితో చెడ్డ పేరు రావడం ఖాయం. ఇప్పుడు ఈ విషయంలో ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ జాగ్రత్తలు పడుతున్నారు. వరుసగా వారు చేస్తున్న ప్రకటనలు ఇప్పుడు కూటమిలో వస్తున్న మార్పులను తెలియజేస్తోంది. రానున్న కాలంలో సంక్లిష్ట పరిస్థితులు ఎదురవుతాయని గ్రహించి ముందుగానే వారు ఇప్పుడు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. పనిచేయని ఎమ్మెల్యేలను క్లాస్ పీకుతున్నారు. సొంత చరిష్మాతో గెలిచాం అనుకుంటున్న ఎమ్మెల్యేలు బయటకు వెళ్ళిపోవచ్చు అని చంద్రబాబు సూచించారు. తొలిసారి ఎన్నికైన ఎమ్మెల్యేలు చాలామంది వ్యవహార శైలి బాగాలేదని.. అటువంటివారు పనితీరు మార్చుకోవాలని లోకేష్ హెచ్చరించారు. ప్రజలు ఎంతో నమ్మకంతో అవకాశం ఇస్తే.. వారి నమ్మకాన్ని వమ్ము చేసుకోకూడదని పవన్ కళ్యాణ్ గట్టిగానే ఎమ్మెల్యేలకు హెచ్చరికలు పంపారు. తద్వారా మున్ముందు గట్టి మార్పులే ఉంటాయని సంకేతాలు పంపారు.చంద్రబాబుతో పాటు పవన్ రెక్కల కష్టంపై కూటమి అధికారంలోకి వచ్చింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై వ్యతిరేకత తోడు వీరి కృషి ఉంది. ఆపై లోకేష్ పట్టుదల కూడా ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో కూటమి ఎమ్మెల్యేల పనితీరుతో చెడ్డ పేరు వస్తుందని నేరుగా గ్రహించారు. ముఖ్యంగా టిడిపిలో పరిస్థితి చేయి దాటుతుందన్న అనుమానాలు ఉన్నాయి. 1995లో పార్టీ బాధ్యతలు తీసుకున్నారు చంద్రబాబు. చాలామంది తటస్థులను సైతం రాజకీయాల్లోకి తీసుకొచ్చి అవకాశాలు కల్పించారు. దాని ద్వారా ఆయనకు రాజకీయ ప్రయోజనం దక్కిందే కానీ.. ఇప్పటిలా ఇబ్బందులు ఎదురు కాలేదు. కూటమి ప్రభంజనంలో వైసీపీ బలమైన నియోజకవర్గాలను సైతం చాలామంది అలవోకగా గెలవగలిగారు. అయితే అటువంటి వారు తమ సొంత చరిష్మాతో గెలిచామని భావిస్తున్నారు. వారితోనే ఇప్పుడు ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయి. టిడిపి ఎమ్మెల్యేల పనితీరు ప్రభావం కూటమిపై పడుతోంది. చంద్రబాబులో అదే కలవరం.మూడు దశాబ్దాలుగా పార్టీ బాధ్యతలు చూస్తున్నారు చంద్రబాబు. అధికారంలో ఉన్నారు. విపక్షంలో సైతం కొనసాగారు. కానీ ఈసారి విచిత్రంగా కొత్తవారు గెలిచారు. అటువంటి వారి నుంచి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎలా బయటపడాలో కూడా చంద్రబాబుకు తెలియడం లేదు. కొలికపూడి శ్రీనివాసరావు, బొజ్జల సుధీర్ రెడ్డి, రెడ్డప్ప గారి మాధవి, కావ్య కృష్ణారెడ్డి, జయ చంద్రారెడ్డి వంటి వారితో ఎప్పటికప్పుడు ఇబ్బందులు వస్తూ వచ్చాయి. ఇలానే వదిలేస్తే తెలుగుదేశం పార్టీతో పాటు కూటమికి ఇబ్బందులు ఎదురవుతాయి. అందుకే చంద్రబాబు ఎలా గాడిలో పెట్టాలన్న ఆలోచనతో ఉన్నారు. అయితే వివాదాస్పద ఎమ్మెల్యేల చుట్టూ ఇప్పుడు టిడిపి అనుకూల మీడియా వాచ్ ఉంటుంది. ఆపై నిఘా వర్గాలు కూడా ఉంటాయి. అటువంటి ఎమ్మెల్యేలను వదులుకోవాలంటే.. వారిపై ఒక రకమైన ముద్ర వేసి విడిచి పెడతారు. రాజకీయాల్లో రాణించలేని పరిస్థితి ఉంటుంది.

# కోటలో కోటరీ...

కడప నవంబర్ 12

వైసీపీ అధినేత వైఎస్ జగన్ కోటరీ నుంచి బయటకు రాలేదని పిస్తుంది. కేవలం పదకొండు సీట్లకే పరిమితమయినప్పటికీ జగన్ మాత్రం అధికారంలో ఉన్నప్పుడు వ్యవహరించిన తీరునే అవలంబిస్తున్నారన్న అభిప్రాయం కలుగుతుంది. అధికారంలో ఉన్నప్పుడు ఏం చేసినా చెల్లుబాటు అవుతుంది. ఏ నిర్ణయం తీసుకున్నా తప్పుని సరి పరిస్థితుల్లో అమాత్యుల నుంచి నేతల వరకూ తలూపి ఉండవచ్చు. పార్లమెంటు నియోజకవర్గాలకు సంబంధించి కోఆర్డినేటర్ల నియామకం నుంచి నియోజకవర్గాల్లో నేతల మధ్య విభేదాల వరకూ ఏ మాత్రం పరిష్కారానికి జగన్ చొరవ చూపలేదు.అది కూడా వైసీపీ ఓటమికి ఒక కారణమని చెప్పక తప్పదు. కేవలం కోటరీ నేతల నివేదికలపైనే ఆధారపడి పార్టీని నడిపారు. ఒక రకంగా పార్టీని అసలు పూర్తిగా పట్టించుకోలేదు. తాను ప్రభుత్వంలో ఉన్న ఐదేళ్ల పాటు మళ్లీ అధికారంలోకి తనవల్లే రావాలని అనేక సంక్షేమ పథకాలతో ముందుకు వెళ్లారు. కానీ ఆ ప్రయోగం బూమ్ రాంగ్ అయింది. అధికారం కోల్పోయిన తర్వాత ఆయనలో మార్పు వస్తుందని భావించిన నేతలకు నిరాశే ఎదురవుతుంది. ఎందుకంటే రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర జిల్లాల్లో నేతలకు, ద్వితీయ శ్రేణి నేతలకు మధ్య గ్యాప్ ఇంకా కొనసాగుతుంది. వాటిని పరిష్కరించేందుకు మాత్రం జగన్ చొరవ చూపడం లేదు. కనీసం జిల్లాల వారీగా సమావేశాలను ఏర్పాటు చేసి ముఖ్య నేతలను పక్కన పెట్టి ద్వితీయ శ్రేణి నేతల అభిప్రాయాలను తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదుఇప్పటికీ కర్నూలు, అనంతపురం, చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, కృష్ణా, గుంటూరు, పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి, అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో కొందరి ఆధిపత్యమే పార్టీలో నడుస్తుంది. పార్టీకేంద్ర కార్యాలయంలోనూ కోటరీ పెత్తనం ఇంకా కనిపిస్తుంది. ఇప్పటికీ జగన్ వాస్తవ పరిస్థితిని తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదన్న అభిప్రాయం వినిపిస్తుంది. దీంతో నేతలు కూడా జగన్ బెంగళూరు నుంచి తాడేపల్లికి వచ్చినప్పటికీ నేతలు వచ్చి కలిసే ప్రయత్నం కూడా చేయడంలేదు. వచ్చినా కోటరీ అడ్డుకుంటుందని భావించి వారు తమ నియోజకవర్గాల్లో మౌనంగా ఉన్నారు. ఇప్పటికైనా జగన్ సరైన నిర్ణయం తీసుకోకుంటే పార్టీ ఎదుగుదల అనేది జరగదన్నది సుస్పష్టం.

====================

# టీడీపీలో కొత్త నీరు.. పాతనీరు

నెల్లూరు, నవంబర్ 12

తెలుగుదేశం పార్టీకి అంతకు ముందు లేని సమస్య ఇప్పుడు రావడానికి ప్రధాన కారణం ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలేనన్న విశ్లేషణలు వినపడుతున్నాయి. గత ఎన్నికల్లో కొన్ని నియోజకవర్గాల్లో ఇతర పార్టీలకు చెందిన నేతలకు టిక్కెట్లను ఇచ్చి తెలుగుదేశం పార్టీ నాయకత్వం బరిలోకి దింపింది. ముఖ్యంగా వైసీపీ నుంచి వచ్చిన నేతలు ఎక్కువ మందికి టిక్కెట్లు ఇచ్చిన వారిలో ఉన్నారు. అయితే వారికి, కొన్నేళ్లుగా తెలుగుదేశం పార్టీలో కొనసాగుతున్న వారికి మధ్య గ్యాప్ పెరిగింది. ఇతర పార్టీల నుంచి వచ్చి ఎమ్మెల్యేలుగా గెలిచిన వారు స్థానిక టీడీపీ నేతలను దగ్గరకు తీసుకోవడం లేదు. తమకు తాము ప్రత్యేకంగా ఒక టీం ను ఏర్పాటు చేసుకుని ముందుకు వెళుతున్నారు. అంటే పాత టీడీపీ నేతలపై వారికి నమ్మకం లేకనే ఈ మధ్య అనేక వివాదాలకు కారణమయింది. తంబళ్లపల్లి నకిలీ మద్యంకేసు దగ్గర నుంచి కావలి నియోజకవర్గం రగడ వరకూ అదే సమస్య. ఎందుకు ఇతర పార్టీల నేతలను పార్టీలోకి చేర్చుకోవాలి? నాలుగు దశాబ్దాల చరిత్ర ఉన్న టీడీపీకి పోటీ చేసే నేతలు లేరా? అన్న ప్రశ్న తెలుగు తమ్ముళ్లలో వ్యక్తమవుతుంది. కేవలం ఆర్థికంగానూ, సామాజికపరంగానూ లెక్కలు వేసుకుని ఇతర పార్టీల నేతలకు గాలం వేసి మరీ పార్టీ కండువాలు కప్పేసి వారికే బీఫారాలు ఇస్తే ఇక తాము దశాబ్దాలుగా పడిన కష్టాలకు ప్రతిఫలిం ఏముంటుందని కొందరు నేతలు ఆఫ్ ది రికార్డుగా ప్రశ్నిస్తున్నారు. గెలిచిన తర్వాత తమను చులకన చేసి చూడటం, తమను వేగులుగా భావించి దగ్గరకు రానివ్వకపోవడం వంటి వాటిపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని నెల్లూరు జిల్లాకు చెందిన కొందరు టీడీపీ నేతలు నేరుగా నారా లోకేశ్ కు ఫిర్యాదు చేశారు. . కావలి టీడీపీ నేత సుబ్బనాయుడు మృతి తర్వాత జరిగిన ఘటనలు చూస్తే ఇదే అర్థమవుతుంది. సుబ్బనాయుడు మృతి పట్ల నెల్లూరు జిల్లాలోని నేతలు సీరియస్ గా స్పందించాల్సిన సమయంలో వారు మౌనంగా ఉండటంతో పాటు ఆయన అంత్యక్రియలకు పార్లమెంటు సభ్యుడు, చాలా మంది ఎమ్మెల్యేలు డుమ్మాకొట్టడం కూడా పార్టీ పరిస్థితికి అద్దం పడుతుంది. అయితే ఇటీవల కావలి నియోజకవర్గంలో పర్యటించిన లోకేశ్ దగదర్తి వెళ్లి సుబ్బనాయుడు కుటుంబాన్ని పరామర్శించారు. కావలి టీడీపీలో తలెత్తిన విభేదాలను పరిష్కరించాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి బాధ్యతను అప్పగించారు. అయితే వేమిరెడ్డికి, కావ్య కృష్ణారెడ్డికి కూడా పొసగదని అంటున్నారు. ఈ నేపథ్యంలో నెల్లూరులోని అనేక నియోజకవర్గాల్లో ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతల డామినేషన్ పెరిగిపోవడంతో టీడీపీ ఒరిజనల్ నేతలు ఇబ్బందులు పడుతున్నారు. మరి దీనికి పార్టీ నాయకత్వం ఏ రకమైన పరిష్కారం చూపుతుందన్నది చూడాలి.

### కడపలో బై పోల్..?

# జగన్ మాస్టర్ ప్లాన్

కడప, నవంబర్ 12,

రాజీనామా చేస్తారా? పులివెందుల శాసనసభ సభ్యత్వాన్ని వదులుకుంటారా? ప్రతిపక్ష హోదా ఇవ్వనందుకు నిరసనగా ఈ చర్యకు దిగుతారా? తద్వారా ఉప ఎన్నికల్లో గెలిచి కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందని నిరూపిస్తారా? ఇప్పుడు పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ నడుస్తోంది. తెలంగాణలో జగన్మోహన్ రెడ్డికి కెసిఆర్ ఆత్మీయ మిత్రుడు. ఇప్పుడు ఆయన పార్టీ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గట్టిగానే తలపడుతోంది. అధికార కాంగ్రెస్ పార్టీతో నువ్వా నేనా అన్నట్టు ఫైట్ చేస్తోంది. సగం పార్లమెంట్ సగం పార్లమెంట్ స్థానాల్లో డిపాజిట్లు కోల్పోయింది కేసీఆర్ పార్టీ. అటువంటి పార్టీకి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు టానిక్ లా పనిచేసాయి. అందుకే ఏపీలో బలపడాలనుకుంటున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సైతం అటువంటి ఉప ఎన్నికను కోరుకుంటుంది.వాస్తవానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉప ఎన్నికల తోనే రాజకీయ ప్రయోజనం పొందింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ఏర్పాటు చేసినప్పుడు జగన్మోహన్ రెడ్డికి అండగా దాదాపు 15 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాజీనామాలు చేశారు. అప్పట్లో కేంద్రంతో పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. అయినా సరే ఉప ఎన్నికల్లో సత్తా చాటింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. 2024 వరకు ఆ పార్టీకి తిరుగులేని పునాదులు వేసి ఆ ఉప ఎన్నికలు. ఇప్పుడు కూడా అటువంటి ఆలోచన చేస్తే తప్పకుండా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్లస్ అవుతుందని సలహాదారులు సూచిస్తున్నారు. కానీ అంత సాహసం జగన్మోహన్ రెడ్డి చేస్తారా? అన్నది అనుమానమే. టిడిపి హయాంలో జరిగిన నంద్యాల ఉప ఎన్నిక.. వైసిపి హయాంలో జరిగిన ఉప ఎన్నికలు గురించి జగన్మోహన్ రెడ్డికి తెలియంది కాదు. అధికార పార్టీని ఢీకొట్టి వెళ్లాలంటే అంత ఈజీ కాదు. పైగా కేంద్రం సంపూర్ణ సహకారం ఉంది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి 11 స్థానాలు వచ్చాయి. అయితే అందులో రిజర్వ్ స్థానాలే అధికం. ఇప్పటికిప్పుడు ఉప ఎన్నికలు జరగాలంటే.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గట్టి పోటీ ఇచ్చి గెలవాలంటే రెండే నియోజకవర్గాలు ఉన్నాయి. అందులో ఒకటి జగన్ ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందుల, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుంగనూరు నియోజకవర్గాలు ఉన్నాయి. అయితే ప్రభుత్వ వైఫల్యాలను రెఫరండంగా తీసుకొని జగన్మోహన్ రెడ్డి పులివెందుల శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేయవచ్చు. ప్రతిపక్ష నేత హోదా ఇవ్వలేదని కారణం చూపవచ్చు. అయితే అంతటి సాహసం జగన్ చేస్తారా? అన్నది అనుమానమే. మొన్నటికి మొన్న పులివెందుల జడ్పిటిసి స్థానంలో కనీసం డిపాజిట్లు రాలేదు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి. అధికార జులంతో టిడిపి గెలిచిందని చెబుతున్న.. జడ్పీటీసీ కే ఈ స్థాయిలో ఉంటే.. ఎమ్మెల్యేకు ఎలాంటి అధికార ప్రయోగం ఉంటుందో జగన్మోహన్ రెడ్డికి తెలియంది కాదు. అందుకే ఆయన పులివెందుల శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేసే సాహసం చేయరని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి 11 స్థానాలు వచ్చాయి. ఎవరితో ఒకరికి రాజీనామా చేయించి ఉప ఎన్నికలు తెస్తే.. ఎలా ఉంటుందో నన్న ఆలోచన లేకపోలేదు. అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం పట్ల ప్రజల్లో సానుకూలత ఉంది. సంతృప్తి కొనసాగుతోంది. ఇటువంటి సమయంలో ఆ సాహసం చేస్తే తప్పకుండా ఇబ్బంది కరం అవుతుందని జగన్ సన్నిహితులు చెబుతున్నారు. దీంతో జగన్మోహన్ రెడ్డి సైతం ఏ నిర్ణయం తీసుకోలేకపోతున్నారు. అయితే పులివెందులలో బలంగా ఉన్నామని వైసిపి భావిస్తోంది. అందుకే అక్కడే రాజీనామా చేసి ఎన్నికలకు వెళితే బాగుంటుందన్న అభిప్రాయం వైసీపీలోనే వినిపిస్తోంది. మరి జగన్మోహన్ రెడ్డి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి.

# కొండా సురేఖ యూటర్న్

హైదరాబాద్, నవంబర్ 12, (



టాలీవుడ్ స్టార్ హీరో అక్కినేని నాగార్జున కుటుంబంపై తెలంగాణ మంత్రి కొండా సురేఖ గత ఏడాది చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. పరువు నష్టం దావా, కోర్టుకు వరకు విషయం వెళ్లింది. ఈ విషయంపై మంత్రి కొండా సురేఖ వెనక్కి తగ్గారు. గతంలో తాను చేసిన వ్యాఖ్యల్ని ఉపసంహరించుకున్నట్లు తెలిపారు. కింగ్ నాగార్జునకు, ఆయన కుటుంబంపై తాను చేసిన వ్యాఖ్యలకు చింతిస్తున్నానని, నాగార్జున కుటుంబాన్ని తక్కువ చేయాలనేది తన ఉద్దేశం కాదన్నారు. నాగార్జునను, ఆయన కుటుంబాన్ని బాధ పెట్టాలనేది తన ఉద్దేశం కాదని క్లారిటీ ఇచ్చారు మంత్రి కొండా సురేఖ. ఆయన కుటుంబాన్ని అప్రతిష్టపాలు చేయాలని తనకు ఏమాత్రం లేదన్నారు. గతంలో తాను అనాలోచితంగా చేసిన వ్యాఖ్యలు మిమ్మల్ని బాధించి ఉంటే, అందుకు తాను చింతిస్తున్నానంటూ విచారణం వ్యక్తం చేశారు. తాను నాగార్జున కుటుంబంపై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు.గత ఏడాది అక్టోబర్ నెలలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను టార్గెట్ చేసుకుని మంత్రి కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ హయాంలో అప్పటి మంత్రి కేటీఆర్ ఎంతో మంది టాలీవుడ్ హీరోయిన్ల జీవితాలతో ఆడుకున్నారని ఆరోపించారు. కొందరు హీరోయిన్లకు డ్రగ్స్ సైతం కేటీఆర్ అలవాటు చేశారని వ్యాఖ్యానించారు. నాగచైతన్య, సమంత విడాకులకు కేటీఆర్ కారణమన్నారు. ఫోన్ ట్యాపింగ్స్ చేసి, వారి సీక్రెట్స్, వ్యక్తిగత విషయాలు తెలుసుకుని బ్లాక్ మెయిల్ చేశారని ఆరోపించారు. అందువల్లే సినీ జంట విడాకులు తీసుకుందని కొండా సురేఖ సంచలనానికి తెరలేపారు. కొందరు హీరోయిన్లు చిన్న వయసులో పెళ్లి చేసుకోగా, కొందరు హీరోయిన్లు తెలుగు సినీ పరిశ్రమను వదిలి వెళ్లడానికి కూడా కేటీఆర్ కారణమని కొండా సురేఖ చేసిన వ్యాఖ్యల తీవ్ర దుమారాన్ని రేపాయి. రాజకీయంగా ఆరోపణలు చేసే సమయంలో సాటి మహిళ అని చూడకుండా సమంతపై అలాంటి వ్యాఖ్యలు చేయడం ఏంటని సినీ ఇండస్ట్రీ కొండా సురేఖను తప్పుపట్టింది. చిరంజీవి సహా పలువురు సెలబ్రిటీలు నాగార్జున కుటుంబంపై, సమంతపై కొండా సురేఖ వ్యాఖ్యల్ని తీవ్రంగా ఖండించారు. అయితే కొండా సురేఖ సమంతకు మాత్రంసారీ చెప్పారు. తన ఉద్దేశం ఆమెను బాధపెట్టడం కాదన్నారు. తమ కుటుంబ గౌరవాన్ని, ప్రతిష్టను దెబ్బతీసేలా తీవ్ర వ్యాఖ్యలు చేశారంటూ నాగార్జున నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కొండా సురేఖపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని చట్టం అందరికీ సమానమేనన్నారు. రాజకీయాల కోసం కొందరి వ్యక్తిగత జీవితాలను టార్గెట్ చేసుకోవడం సరికాదని కొండా సురేఖకు హితవు పలికారు. కేసు విచారణలో భాగంగా నాగార్జున, అమల, నాగ చైతన్య విచారణకు హాజరై తమ వాదన వినిపించారు.తనపై చేసిన వ్యాఖ్యలకు కొండా సురేఖ క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. అనంతరం కొండా సురేఖపై పరువునష్టం దావా వేశారు. సంబంధం లేని విషయాల్లో కొండా సురేఖ తనపై అడ్డగోలు వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. తన గౌరవానికి భంగం కలిగించాలనే లక్ష్యంతోనే, ఏ ఆధారాలు లేకుండా ఇలాంటి వ్యాఖ్యలు చేశారని లీగల్ నోటీసుల్లో కేటీఆర్ పేర్కొన్నారు. కేటీఆర్ సైతం విచారణకు హాజరయ్యారు. మహిళను కించపరిచారని, తన గౌరవానికి భంగం వాటిల్లేలా వ్యాఖ్యలు చేశారని కోర్టుకు తెలిపారు.

# రెండేళ్ల నుంచి దాడుల కోసం ప్రయత్నం

న్యూఢిల్లీ, నవంబర్ 12

ఫరీదాబాద్ ఉగ్ర మాడ్యూల్‌లో భాగంగా అరెస్ట్ అయిన డాక్టర్ షహీన్.. పోలీసుల విచారణలో సంచలన నిజాలు బయటపెట్టింది. పాకిస్థాన్‌కు చెందిన జైషే మహమ్మద్ (ఏవఓ) సంస్థ కోసం దాదాపు రెండేళ్లుగా డాక్టర్ ముజమ్మిల్, ఆదిల్‌తో కలిసి దేశవ్యాప్తంగా బహుళ ఉగ్ర దాడులకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆమె అంగీకరించింది. మాస్టర్‌మైండ్ ఉమర్ సూచనలతోనే ఈ మాడ్యూల్ నడిచినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా జైషే చీఫ్ మసూద్ అజార్ సోదరి సాదియా అజార్‌తో షాహీన్‌కు గల కీలక లింక్ కూడా ఉన్నట్లు సమాచారం.

: దేశంలో ఉగ్రవాద కుట్రలకు పాల్పడేందుకు డాక్టర్లు, నిపుణులతో ఏర్పడిన 'వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్' వెనుక ఉన్న లోతైన కుట్రలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఫరీదాబాద్ ఉగ్ర మాడ్యూల్‌లో భాగస్వామి అయిన డాక్టర్ షహీన్‌ను అధికారులు విచారించగా.. ఆమె విస్తుపోయే విషయాలను వెల్లడించింది. దేశవ్యాప్తంగా కుట్రల కోసం తాము రెండేళ్లుగా కష్టపడుతున్నట్లు వివరించిందిడాక్టర్ షహీన్ విచారణలో వెల్లడించిన ప్రకారం.. పాకిస్థాన్‌కు చెందిన ఉగ్ర సంస్థ జైషే మహమ్మద్ కోసం దాదాపు రెండేళ్ల నుంచి దేశవ్యాప్తంగా పలుచోట్ల ఉగ్ర దాడులు జరిపేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మాడ్యూల్‌లో కీలక వ్యక్తి అయిన ఉమర్.. ప్రతిసారీ బహుళ ఉగ్ర దాడులు చేయడం గురించి ఉద్వేగభరితంగా మాట్లాడేవాడని షాహిన్ తెలిపినట్లు సమాచారం.డాక్టర్ షహీన్.. డాక్టర్ ముజమ్మిల్, ఆదిల్‌తో కలిసి రెండేళ్లుగా అమ్మోనియం నైట్రేట్ వంటి ప్రమాదకరమైన పేలుడు పదార్థాలను సేకరిస్తున్నట్లు అంగీకరించింది. ఈ సేకరించిన పేలుడు పదార్థాలను ఉపయోగించేందుకు జైషే సంస్థ కోసం దేశవ్యాప్తంగా దాడులు చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు ఆమె బయటపెట్టింది. ఈ మాడ్యూల్‌తో తన సోదరుడు పర్వేజ్ సయీద్‌కు కూడా భాగస్వామ్యం ఉందని షహీన్ పేర్కొనడంతో.. జమ్మూ కాశ్మీర్ పోలీసులు వెంటనే మంగళవారం అతడిని కూడా అదుపులోకి తీసుకున్నారు. అయినప్పటికీ పర్వేజ్ వద్ద ఎలాంటి పేలుడు పదార్థాలు లభించకపోవడంతో.. అరెస్ట్ అవుతాననే భయంతో వాటిని దాచి ఉంచొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. ఈ క్రమంలోనే దర్యాప్తు అధికారులు గురుగ్రామ్‌కు చెందిన అమ్మోనియం నైట్రేట్ సరఫరాదారుడిని గుర్తించినట్లు సమాచారం. త్వరలోనే అతడిని కూడా అరెస్టు చేస్తామని అధికార వర్గాలు తెలిపాయి.మరోవైపు డాక్టర్ షహీన్‌ను అధికారులు తదుపరి విచారణ కోసం శ్రీనగర్‌కు తరలించారు. ఈ అరెస్ట్ వెనుక జైషే మహమ్మద్ విస్తృత నెట్‌వర్క్ ఉన్నట్లు అధికారులు బలమైన అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా జైషే చీఫ్ మసూద్ అజార్ సోదరి సాదియా అజార్ నేతృత్వం వహిస్తున్న జమాత్ ఉల్ మొమినాత్ అనే విభాగంలో షహీన్ కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. భారత్‌లో మహిళా విభాగాలు స్థాపించి.. వారిని ఉగ్ర కార్యకలాపాలకు నియామకాలు చేపట్టడం వంటి పనులను షాహిన్ నిర్వహిస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడి అయింది.ఇదిలాఉండగా.. ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన కారు పేలుడుకు సంబంధించి మరో కీలక విషయం బయటపడింది. పేలుడు తీవ్రతను, దాని ప్రభావాన్ని పరిశీలిస్తే.. అందులో మిలిటరీ గ్రేడ్ పేలుడు పదార్థాలు ఉపయోగించినట్లు దర్యాప్తు వర్గాలు బలంగా అనుమానిస్తున్నాయి. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు తదుపరి విచారణలో తెలుస్తాయని అధికారులు వెల్లడించారు.

# మహారాష్ట్రలో కాంగ్రెస్ ఒంటరిపోరు..

ముంబై, నవంబర్ 12

మహారాష్ట్రలో ఇండియా కూటమికి బీటలు వారుతున్నాయి! స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేయాలని నిర్ణయించుకుంది. ఈ మేరకు పార్టీ అధిష్ఠానం కూడా ఓకే చెప్పిందని ఆ రాష్ట్ర కాంగ్రెస్ నేతలు తెలిపారు. శివసేన (ఉద్ధవ్ వర్గం), ఎంఎన్ఎస్‌ల కలయికపై కాంగ్రెస్ అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఒంటరిగా పోటీ చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. అయితే కాంగ్రెస్ నిర్ణయంపై ఇండియా కూటమి పార్టీలు విమర్శలు గుప్పిస్తున్నాయి.స్థానిక సంస్థల ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో మహారాష్ట్రలో ఇండియా కూటమికి బీటలు వారుతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు కాంగ్రెస్ తమ వ్యూహాలను మార్చుకుంటున్నట్లు సమాచారం. తాజాగా కాంగ్రెస్ నేత విజయ్ వాడెట్టివార్ కీలక వ్యాఖ్యలు చేశారు. త్వరలో జరగబోయే లోకల్ బాడీ ఎన్నికల్లో ఒంటరిగా పోటీచేయాలని భావిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు మహారాష్ట్ర కాంగ్రెస్.. అధిష్ఠానానికి సమాచారం కూడా ఇచ్చినట్లు తెలిపారు. దానికి అధిష్ఠానం కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు వెల్లడించారు. ఇక ముంబైతో పాటు 246 మున్సిపల్ కౌన్సిల్స్, 42 నగర పంచాయతీల్లో ఒంటరిగా పోటీ చేస్తామన్నారు., ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన, రాజ్ ఠాక్రే నాయకత్వంలోని మహారాష్ట్ర నవ్ నిర్మాణ్ సేన (ఎమ్ఎన్ఎస్) మధ్య ఇటీవల సాన్నిహిత్యం పెరుగుతున్న సంగితి తెలిసిందే. దీనిపై కాంగ్రెస్ పార్టీ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఎంఎన్ఎస్.. ఇండియా కూటమిలో చేరితే.. మైనారిటీ, ఉత్తరాది రాష్ట్రాల ప్రజల ఓట్లు దూరమవుతాయని కాంగ్రెస్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే ఒంటరిగా పోటీ చేసేందుకు అడుగుల ముందుకు వేస్తున్నట్లు సమాచారం. మహారాష్ట్ర కాంగ్రెస్ తీసుకున్న ఈ నిర్ణయంపై ఇండియా కూటమి పార్టీలు విమర్శలు చేస్తున్నాయి. శివసేన (ఉద్ధవ్) పార్టీ ప్రతినిధి ఆనంద్ దూబె ఘాటుగా స్పందించారు. హర్యానా, గుజరాత్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో కాంగ్రెస్ పేలవమైన ప్రదర్శన చేసిందని గుర్తుచేశారు. ఇతర పార్టీలపై వ్యాఖ్యలు చేసేందుకు కాంగ్రెస్ ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. శివసేన (ఉద్ధవ్) కూడా ఎవరిపైనా ఆధారపడకుండా సొంతంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు.మరోవైపు, ప్రత్యర్థి కూటమిలో కుంపట్లపై.. అధికార బీజేపీ ఘాటు విమర్శలు చేసింది. మహావికాస్ అఘాడీ పూర్తిగా గందరగోళంలో పడిపోయిందని బీజేపీ ఎమ్మెల్యే ప్రవీణ్ దారేకత్ ఎద్దేవా చేశారు. ఉద్ధవ్ లాగే, రాజ్ ఠాక్రే కూడా హిందుత్వ సిద్ధాంతాలకు దూరమవుతున్నారని ఆరోపించారు. కాగా, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసేందుకు నిర్ణయించుకున్నా.. అధికార పక్షంపై కలిసికట్టుగా పోరాడాలని కూటమి పార్టీలను కోరుతోంది కాంగ్రెస్. ఈ మేరకు ఎన్డీఏ ప్రభుత్వంపై కాంగ్రెస్ నేత నానా పాటోల్ విమర్శలు గుప్పించారు. ముంబై, నవీ మంబై, థాణెల్లో అధికార పక్షం భూ కుంభకోణాలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఎన్డీఏ స్కామ్‌లను ఎండగట్టేందుకు శరద్ పవార్ కాంగ్రెస్‌లో చేరాలని కోరారు. ఇటీవల శరద్ పవార్, కాంగ్రెస్‌ను బలహీన పరుస్తున్నారని ఆరోపించిన నానా పాటోల్.. తాజాగా ఆయన్ను పార్టీలోకి ఆహ్వానించడం గమనార్హం.

====================

# టారిఫ్ లతగ్గింపు దిశగా అడుగులు

న్యూఢిల్లీ నవంబర్ 12, (న్యూస్ పల్స్)

ఇండియాతో వాణిజ్య ఒప్పందం త్వరలో కుదురుతుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. భారత వస్తువులపై టారిఫ్‌లు తగ్గిస్తామన్నారు. డొనాల్డ్ ట్రంప్ మంగళవారం అమెరికాలో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. భారతదేశంతో వాణిజ్య ఒప్పందం త్వరలో ఉంటుందని ప్రకటించారు. భారత వస్తువులపై విధించిన టారిఫ్ రేట్లను "చాలా త్వరలో" తగ్గించనున్నామని స్పష్టం చేశారు. ఇప్పుడు వారు నన్ను ప్రేమించడం లేదు. కానీ మళ్లీ మమ్మల్ని ప్రేమిస్తారు" అని ఇండియాను ఉద్దేశించి ట్రంప్ ఆసక్తికరంగా మాట్లాడారు. " న్యాయమైన ఒప్పందంపై చర్చలు జరుపుతున్నామని... అందరికీ లాభదాయకమైన ఒప్పందంపై చర్చిస్తున్నామని.. చాలా దగ్గరలో డీల్ కుదురుతుందని" ట్రంప్ చెప్పారు. భారతదేశం రష్యన్ ఆయిల్ దిగుమతులను తగ్గించడంతో అమెరికా అనుకూలంగా మారింది. "భారత్ రష్యన్ ఆయిల్ దిగుమతులను చాలా తగ్గించింది. ఇది మా ఒప్పందానికి సహాయపడుతోంది" అని ట్రంప్ వివరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో " అద్భుతమైన స్నేహం " ఉందని ట్రంప్ చెబుతున్నారు. ట్రేడ్ డీల్ 2025 చివరి నాటికి కుదిరే అవకాశం ఉందని అమెరికా వర్గాలు చెబుతున్నాయి. ట్రంప్ ప్రకటనతో భారత-అమెరికా వాణిజ్య సంబంధాలు మరింత బలపడనున్నాయని వాణిజ్య నిపుణులు అంచనా వేస్తున్నారు. ట్రంప్ రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత జనవరి 2025 నుంచి అమెరికా విదేశీ వాణిజ్య భాగస్వాములపై టారిఫ్‌లను పెంచే విధానాన్ని ప్రవేశపెట్టారు. భారతదేశంపై టారిఫ్‌లు విధించారు, ఇది భారత వస్తువుల ఎగుమతులకు సమస్యగా మారింది. ఇటీవల భారత్ రష్యన్ ఆయిల్ దిగుమతులను 30% తగ్గించడంతో, అమెరికా దానికి ప్రతిస్పందనగా టారిఫ్‌లు తగ్గించే అవకాశం ఏర్పడింది. గతంలోనే ట్రేడ్ డీల్ వైపు చాలా సార్లు చర్చలు జరిగినా.. కొన్ని అంశాల్లో స్పష్టత రాకపోవడంతో ... ఎప్పటికప్పుడు ఆగిపోతూ వచ్చింది.

# శభాష్ రేవంత్..

హైదరాబాద్, నవంబర్ 12,

ముఖ్యమంత్రి అయినంత మాత్రాన దర్బార్లో ఉండాల్సిన అవసరం లేదు. రాజమహల్ లో సకల సౌకర్యాలు అనుభవించాల్సిన పనిలేదు. ప్రజలు ఓట్లు వేస్తే గెలిచాడు కాబట్టి.. ప్రజలకు అందుబాటులో ఉంటే సరిపోతుంది. కష్టాలను, కన్నీళ్లు తుడిచి నేను ఉన్నానని భరోసా ఇస్తే ఆ నాయకుడిని పదికాలాలపాటు ప్రజలు కంటికి రెప్పలా చూసుకుంటారు.. నవీన్ పట్నాయక్, మనోహర్ పారికర్, బుద్ధదేవ్ భట్టాచార్య.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎంతోమంది.. వాస్తవానికి ముఖ్యమంత్రి పీఠం అనేది అత్యంత సవాళ్లతో కూడుకున్న స్థానం. అటువంటి స్థానానికి చాలామంది వన్నె తీసుకొచ్చారు.. తన పాలనదక్షతో.. అద్భుతమైన వ్యవహార శైలితో ఆకట్టుకున్నారు.తెలుగు రాష్ట్రాల విషయానికొస్తే కొంతమంది ముఖ్యమంత్రి గొప్ప పరిపాలన అందించి ప్రజల మన్నన పొందారు. ఇక తెలంగాణ రాష్ట్రంలో తొలి ముఖ్యమంత్రిగా పనిచేసిన ఘనతను కేసీఆర్ పొందారు. కెసిఆర్ రెండు పర్యాయాలు తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యారు. అయితే ఉద్యమ సమయంలో ఆయన ఎటువంటి ధోరణి అయితే అవలంబించారో? ముఖ్యమంత్రి అయిన తర్వాత అంతకుమించి అనే స్థాయిలో ప్రజలకు దూరంగా ఉన్నారు.



అయితే ప్రగతిభవన్ లేదా వ్యవసాయ క్షేత్రంలో ఉండేవారు. ప్రజలకు అందుబాటులో ఉండేవారు కాదు. కొన్ని సందర్భాలలో సొంత మంత్రులకు కూడా ఆయన అపాయింట్మెంట్ ఇచ్చేవారు కాదు. అప్పట్లో హోం శాఖ మంత్రి మహమూద్ ఆలిని కూడా ఆయన ఫామ్ హౌస్ గేట్ నుంచి బయటికి పంపించారు. ఇలా చెప్పుకుంటూ పోతే కేసీఆర్ పరిపాలన కాలంలో జరిగిన ఉదంతాలు చాలానే ఉన్నాయి. అందువల్లే తెలంగాణ ప్రజలు మూడోసారి కెసిఆర్ నాయకత్వాన్ని నమ్మలేదు. కెసిఆర్ ముఖ్యమంత్రి అయినప్పుడు ప్రజలకు దూరంగా ఉన్న విధానం.. ఇతర వ్యవహారాలను పరిశీలించిన ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. సాధ్యమైనంతవరకు ప్రజలకు దగ్గరగా ఉండడానికి ప్రయత్నిస్తున్నారు. హంగు ఆర్భాటాలకు పెద్దగా ప్రయారిటీ ఇవ్వడం లేదు. తాజాగా ప్రజా కవి అందెశ్రీ చనిపోతే.. ఆయన పాడెను మోశారు. అంత్యక్రియల ప్రారంభం నుంచి చివరి వరకు ఆయన అక్కడే ఉన్నారు. అంతేకాదు అందెశ్రీ భార్యను ఓదార్చి అనునయించారు. తాను అండగా ఉంటానని ఆమెకు భరోసా ధైర్యం కల్పించారు. రేవంత్ చేసిన పని చివరికి గులాబీ పార్టీ నేతలకు కూడా నచ్చింది. బిజెపి నాయకులు కూడా రేవంత్ చేసిన పని పట్ల అంతర్గతంగా చర్చించుకుంటున్నారు. పరిపాలనపరంగా.. విలేకరుల సమావేశాల్లో మాట్లాడే మాటలపరంగా రేవంత్ రెడ్డి కొంతమందికి నచ్చకపోవచ్చు. కానీ కొన్ని సందర్భాలలో ఆయన ప్రత్యర్థులకు కూడా నచ్చుతాడు. మంగళవారం చేసిన పని కూడా అటువంటిదే.

=============

# ఖాతాల్లోకి ఇందిరమ్మ ఇళ్ల డబ్బులు

మెదక్, నవంబర్ 12

ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు ప్రభుత్వం తాజాగా రూ. 202.93 కోట్లు విడుదల చేసింది. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వి.పి. గౌతమ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ వారం 18,247 మంది లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ అయింది. ఈ పథకంలో భాగంగా ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 2,33,069 ఇళ్ల నిర్మాణం ప్రారంభమైందని.. మొత్తం రూ. 2,900 కోట్ల చెల్లింపులు జరిగాయని ఆయన పేర్కొన్నారు. తమ ఇళ్ల నిర్మాణం కోసం నిధులు అందిన లబ్ధిదారులు వెంటనే బ్యాంకు ఖాతాలను తనిఖీ చేసుకుని, నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులు సూచించారు.తెలంగాణ ప్రభుత్వం పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు మరో శుభవార్త. ప్రభుత్వం తాజాగా ఈ పథకం కింద రూ. 202.93 కోట్లను విడుదల చేసింది. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా ఈ నిధులను జమ చేయడంతో.. లబ్ధిదారులు తమ ఇళ్ల నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయడానికి అవకాశం లభించింది.రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) వి.పి. గౌతమ్ ఈ నిధుల విడుదలకు సంబంధించిన పూర్తి వివరాలను తెలియజేశారు. లబ్ధిదారులకు ప్రతి సోమవారం నిధులను ఖాతాల్లో జమ చేసే విధానం కొనసాగుతుండగా.. ఈ వారం ఒక్కరోజే 18,247 మంది లబ్ధిదారులకు నగదు జమ అయినట్లు ఆయన వెల్లడించారు. ప్రభుత్వం నిధుల విడుదలలో ఆలస్యం చేయకుండా, నిర్మాణ పురోగతిని బట్టి ఎప్పటికప్పుడు చెల్లింపులు చేస్తుండటం పట్ల లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. ఇందిరమ్మ పథకంలో భాగంగా ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా ఏకంగా 2,33,069 ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో ప్రారంభమైంది. నిర్మాణ దశలను బట్టి లబ్ధిదారులకు ప్రభుత్వం అందించిన మొత్తం చెల్లింపులు ఇప్పటివరకు రూ. 2,900 కోట్లు దాటాయి. ఈ పథకం ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన సొంతింటిని నిర్మించుకునే అవకాశం లభిస్తోంది.ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని రూపొందించారు.

# ఓటింగ్ కు దూరంగా జూబ్లీ ప్రజలు

హైదరాబాద్, నవంబర్ 12,

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలు ఎలాంటి ఉద్రిక్తతలు లేకుండా ప్రశాంతంగా ముగిసినట్టు ఎన్నికల సంఘం ప్రకటించింది. ఏ బూత్‌లో కూడా రీ పోలింగ్ లేకుండా పక్కా ఏర్పాట్లతో ప్రక్రియను అధికారులు పూర్తి చేశారని వెల్లడించింది. పలు ప్రాంతాల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య కాసేపు వాగ్వాదాలు మినహా ఎక్కడా శాంతిభద్రతలకు విఘాతం లేకుండా పోలింగ్ ప్రక్రియ సాగింది. ఒకరిపై ఒకరు ఆరోపణలు మినహా ఎక్కడా శ్రుతి మించిన ఘటనలు లేవు. కొన్న బూత్‌ల వద్ద కాంగ్రెస్ నేతల అతి ఉత్సాహం కేసులకు దారి తీసింది. ఉదయం నుంచి బూత్‌ల వద్దకు చేరుకున్న ఓటర్లు తమ తీర్పును ఈవీఎంలలో నిక్షిప్తం చేశారు. 14వ తేదీ ఉదయం 8 గంటల నుంచి ఎన్నికల లెక్కింపు ప్రక్రియ జరగనుంది. మధ్యాహ్నానికి విజేతపై క్లారిటీ రానుంది. ఎప్పటి మాదిరిగానే బస్తీల్లో జనం తప్ప భవంతుల్లో ఉన్న ఓటర్లు ఓటు వేసేందుకు ముందుకు రాలేదు. అందుకే మరోసారి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో తక్కువ పోలింగ్ శాతం నమోదు అయ్యింది. సాయంత్రం పోలింగ్ పూర్తి ముగిసే సమయానికి మొత్తం 48.24 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. ఇందులో పురుషులు 47.59 శాతం మంది వచ్చి ఓట్లు వేయగా, మహిళలు 48.95 శాతం వేశారు. గతంతో పోల్చుకుంటే ఇది చాలా తక్కువ, అయితే ఇందులో ఇంకో కోణం ఏంటంటే, గత రెండు ఎన్నికలతో పోల్చుకుంటే కాస్త బెటర్ అన్నమాట.2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడ 47.58 శాతం ఓటింగ్ నమోదు అయ్యింది. అంతకు ముందు ఎన్నికలు అంటే 2018లో 45.61 శాతం ఓటింగ్ నమోదు అయ్యింది. తెలంగాణ వచ్చిన జరిగిన మొదటి అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో భారీ స్థాయిలో పోలింగ్ నమోదు అయ్యింది. 2014లో 56.85 శాతం నమోదు అయ్యింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2009లో 52.80శాతం పోలింగ్ నమోదు అయ్యింది. ఈ ఏడాది తప్ప ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో మాగంటి గోపీనాథ్ గెలుస్తూ వచ్చారు. అయితే ఆయన అకాల మరణంతో ఇక్కడ ఇప్పుడుఉపఎన్నిక అనివార్యమైంది. ఆయన తరఫున భార్య సునీత పోటీ చేస్తున్నారు. ఆయనకు పోటీగా కాంగ్రెస్ తరఫున సునీల్ యాదవ్ ఉన్నారు. దీంతో విజయం ఎవరివైపు ఉందనే ఆసక్తి నెలకొంది.

ఇక్కడ ముగ్గురు అభ్యర్థులు పోటీ పడుతున్నప్పటికీ ప్రధాన పోటీ మాత్రం కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే ఉంది. గతంలో ఇక్కడ నుంచి పోటీ చేసిన ఎంఐఎం ఈసారి పోటీలో లేదు. వారి మద్ధతు కాంగ్రెస్‌కు ఉన్నట్టు ఆ పార్టీ నేతలు



చెప్పారు. ఇప్పుడు వారి ఓట్లు ఎటు పడ్డాయో అన్న ఉత్కంఠ కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల్లో ఉంది. అందుకే కచ్చితంగా గెలుపు తమవైపు ఉందనే ధీమా ఎవరిలో లేదు. గెలుస్తున్నామని మీడియా ముందు చెబుతున్నా సన్నిహితులతో మాత్రం విజయంపై డైలమాలో ఉన్నట్టు చెప్పుకుంటున్నారు. అందుకే పోలింగ్ రోజుల ఆఖరి బ్యాలెట్ సురక్షితంగా ప్రాంతంలో ఉంచి లాక్ చేసే వరకు ఇరు పార్టీల నేతలు డేగకళ్లతో పరిస్థితులను గమనిస్తూ వచ్చారు. రోజుంతా ఇరు పార్టీల అభ్యర్థులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకున్నారు. అక్రమాలకు పాల్పడుతున్నారని కాంగ్రెస్ నేతలపై బీఆర్ఎస్ నేతలు రెండుసార్లు ఫిర్యాదులు చేశారు. ఓటర్లను ప్రలోభ పెడుతున్నారని, బీఆర్ఎస్ నేతలను బెదిరిస్తున్నారని బూత్‌ల్లోకి రానివ్వడం లేదని ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. కాంగ్రెస్ ఆగడాలు శ్రుతిమించిపోయాయని బీఆర్ఎస్ అభ్యర్థి సునీత ధర్నాకే దిగారు. మొత్తానికి ఆఖరి నిమిషం వరకు పోటాపోటీగా విజయం కోసం ఎవరి ప్రయత్నాలు వాళ్లు చేశారు.దీంతో విజయం ఎవరివైపు ఉందో అన్న ఉత్కంఠ మాత్రం 14 వరకు కొనసాగనుంది. ఒకసారి బ్యాలెట్ బాక్స్‌లు ఓపెన్ చేస్తే ఎవరి జాతకం ఏంటో తెలిపోనుంది. అంత వరకు ఎవరి ధీమా వాళ్లకు ఉంటోంది. మరోవైపు వివిధ సర్వేసంస్థలు ఈ ఎన్నికపై సర్వేలు నిర్వహించాయి. ఇందులో కొన్ని ఆయా పార్టీలకు మద్దతుగా ఉన్నందున వాటి సర్వేలను నమ్మడానికి జనం సిద్ధంగా లేదు. అందుకే 14వ తేదీ ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారు. కొన్ని ప్రాముఖ్యం ఉన్న సర్వేలు ఒకట్రెండు కాంగ్రెస్ విజయానికి అవకాశాలు ఉన్నాయని చెబుతుంటే, మరికొన్ని బీఆర్ఎస్ విజయం ఖాయమనే విధంగా అంచనాలు వేస్తున్నాయి.

# డీసీసీలకు మోక్షం జాబితా రెడీ

హైదరాబాద్, నవంబర్ 12, (

: జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్ష పదవులను ఏఐసీసీ త్వరలోనే ప్రకటించనుంది. డీసీసీ పదవుల కోసం ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఆశావహులకు ఒకటి, రెండు రోజుల్లో తీపి కబురు రానుంది. డీసీసీ పీఠాలకు సంబంధించి పార్టీ అధిష్ఠానం తుది కసరత్తు చేసినప్పటికి.. తెలంగాణలో జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక, ఇతర కారణాలతో ప్రకటన వాయిదా పడుతూ వస్తున్నది.పీసీసీ అధ్యక్షుడిగా మహేష్‌కుమార్‌గౌడ్ బాధ్యతలు తీసుకుని 14 నెలలు పూర్తయింది. అయినా పాత కమిటీలతోనే నెట్టుకొస్తున్నారు. ఇక వాయిదా వేయకుండా జిల్లా కాంగ్రెస్ రథసారథులను ప్రకటించాలనే నిర్ణయానికి కాంగ్రెస్ అధిష్ఠానం వచ్చింది. పదవుల పంపకంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ తదితరులతోనూ పార్టీ అధిష్ఠానం పలుమార్లు చర్చించింది.ఆ తర్వాతనే ఫైనల్ జాబితాను రూపొందించినట్లుగా పార్టీ వర్గా లు చెబుతున్నాయి. అయితే గతంలో జిల్లా కు చెందిన ముఖ్య నాయకులు తమ అనుచరుల కోసం పైరవీలు చేసి.. పదవిని దక్కించుకునే వారు. కానీ, పార్టీ అధిష్ఠానం మా త్రం ఆ విధానానికి చెక్ పెట్టింది. ఎవరి ప్ర మేయం లేకుండానే పార్టీ కోసం కష్టపడే వారికి పదవులు ఇవ్వాలనే నిర్ణయానికి వచ్చింది. అందుకు ఏఐసీసీనే నేరుగా రంగంలోకి దిగి గతంలోఎన్నడు లేని విధంగా పరిశీలకులను నియమించింది.ఏఐసీసీ పరిశీలకులను తమకు కేటాయించిన జిల్లాలలో పర్యటించి.. క్షేత్ర స్థాయి నుంచి అభిప్రాయలు సేకరించారు. అంతే కాకుండా డీసీసీ అధ్యక్ష పీఠం కోసం పోటీ పడే వారి నుంచి దరఖాస్తులను స్వీకరించారు. డీసీసీ పదవుల కేటాయింపులో సామాజిక న్యాయం పాటించాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, యువత, మహిళలకు 50 శాతానికి పైగా అవకాశం ఇవ్వాలని నిర్ణయంతో పాటు పార్టీలో దాదాపు ఐదేళ్లుగా పనిచేసి ఉండాలని నిబంధన కూడా పెట్టిన విషయం తెలిసిందే.వీటితో పాటు ప్రస్తుతం డీసీసీ అధ్యక్షులుగా కొనసాగుతున్న వారికి మళ్లీ అవకాశం ఇవ్వొద్దని నిర్ణయం తీసుకున్నారు. అయితే ఒకటి, రెండు చోట్ల ఎమ్మెల్యేలకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవులు అప్పగించే అవకాశాలున్నట్లుగా తెలుస్తోంది. దీంతో చాలా మంది సీనియర్లు తమ కంటే తమకే పదవి వస్తుందనే ధీమాతో ఉన్నారు. ఇక వచ్చే ఎన్నికల్లో పార్టీ పరంగా డీసీసీ అధ్యక్షులే కీలకం కానున్నారు. ఏఐసీసీ అధ్యక్షులు నేరుగా డీసీసీ అధ్యక్షులతో మాట్లాడే అవకాశం ఉంది. అంతే కాకుండా పార్టీపరంగా తీసుకునే నిర్ణయాలు, చేపట్టిన కార్యక్రమాలు, పార్టీ పరిస్థితితో పాటు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు డీసీసీ అధ్యక్షులే బీ ఫామ్‌లు ఇచ్చే అవకాశం ఉంది. దీంతో డీసీసీ అధ్యక్ష పదవి కోసం ఒక్కో జిల్లాలకు పదుల సంఖ్యలో పార్టీ పరిశీలకులకు దరఖాస్తులు చేసుకున్నారు.అయితే జిల్లాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు మాత్రం తమ, తమ అనుచరుల పేర్లను పరిశీలకులకు చెప్పి.. మద్దతుగా ఉండాలని క్షేత్రస్థాయిలోని పార్టీ నాయకులపై ఒత్తిడి తీసుకొచ్చారు. ఏఐసీసీ పరిశీలకులు వారికి కేటాయించిన జిల్లాలలో సమావేశాల తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షినటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌తో సమావేశమై..జిల్లాల పర్యటన వివరాలను వివరించారు. క్షేత్ర స్థాయిలో పార్టీ పరంగా వచ్చిన పీడ్ బ్యాక్‌ను సీఎం రేవంత్‌రెడ్డి, మీనాక్షినటరాజన్, మహేష్‌కుమార్‌గౌడ్‌కు వివరించారు. అయితే ఏఐసీసీ పరిశీలకులు ఎవరి పేర్లను పార్టీ అధిష్ఠానానికి సిఫారసు చేశారనేది ఆసక్తిగా మారింది.

# కనీసం పోటీ ఇవ్వలేకపోయిన కమలం సర్వేలు తేల్చి చెప్పిన నిజం

హైదరాబాద్, నవంబర్ 12,

లంగాణ రాష్ట్రంలో ఎంతో ఉత్కంఠ కలిగించిన జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ఉప ఎన్నికలు పూర్తయ్యాయి. గడిచిన కొద్దిరోజులుగా గులాబి, కషాయం, కాంగ్రెస్ పార్టీలు ఈ నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం చేశాయి. మూడు పార్టీల కీలక నాయకులు ఒకరి మీద ఒకరు దుమ్మెత్తి పోసుకున్నారు. గులాబీ పార్టీ అయితే సోషల్ మీడియాలో రెచ్చిపోయింది.. కాంగ్రెస్ పార్టీ మీద తీవ్రస్థాయిలో విమర్శలు చేసింది. గులాబీ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.. పలు న్యూస్ చానల్స్ కు ఇంటర్వ్యూలు కూడా ఇచ్చారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరిగే ఉప ఎన్నికలో వచ్చే ఫలితాన్ని తెలంగాణ ప్రజలు ఇచ్చే రెఫరెండం అని ఆయన పేర్కొన్నారు.సుమారు నాలుగు లక్షలకు పైచిలుకు ఓటర్లు ఉన్న జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో మంగళవారం పోలింగ్ జరిగింది.. రహమత్ నగర్ నుంచి మొదలుపెడితే బోరబండ వరకు ఎన్నికల సంఘం అత్యంత కట్టుదిట్టంగా వ్యవహరించింది.. పోలింగ్ శాతం అధికారులు అంచనా వేసినట్టుగా నమోదు కాకపోయినప్పటికీ.. మంగళవారం పొద్దుపోయే వరకు పోలింగ్ జరిగింది. కొన్ని ప్రాంతాలలో కాంగ్రెస్, గులాబీ పార్టీ నాయకుల మధ్య గొడవలు జరిగాయి. రెండు పార్టీలకు సంబంధించిన నాయకులు పరస్పరం ఎన్నికల సంఘం అధికారులకు ఫిర్యాదు చేశారు. అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

పోలింగ్ ముగిసిన తర్వాత సుప్రీంకోర్టు మార్గ దర్శకాలకు అనుగుణంగా కొన్ని సంస్థలు ఎగ్జిట్ పోల్స్ విడుదల చేశాయి.. ఇందులో మెజారిటీ సంస్థలు జూబ్లీ హిల్స్ నియోజకవర్గంలో గెలిచే అవకాశం కాంగ్రెస్ పార్టీకి ఉందని స్పష్టం చేశాంచాణక్య స్ట్రాటజీస్ అనే సంస్థ వెల్లడించిన ఎగ్జిట్ పోల్ లో కాంగ్రెస్ పార్టీకి గెలిచే అవకాశాలు 46%, గులాబీ పార్టీకి గెలిచే అవకాశం 41 శాతం, భారతీయ జనతా పార్టీకి ఆరు శాతం అవకాశం ఉందని పేర్కొంది.

పీపుల్స్ పల్స్ అనే సంస్థ కాంగ్రెస్ పార్టీకి గెలిచే అవకాశం 48%, గులాబీ పార్టీకి 41 శాతం, బిజెపికి ఆరు శాతం ఉందని తేల్చింది.స్మార్ట్ పోల్ అనే సంస్థ కాంగ్రెస్ పార్టీకి 48.2, గులాబీ పార్టీకి 42.1 శాతం , భారతీయ జనతా పార్టీకి ఆరు శాతం గెలిచే అవకాశాలు ఉన్నాయని స్పష్టం చేసింది.

# ఎన్నికలకు వ్యవసాయ కూలీలు ముందుకు సాగని పనులు

నిజామాబాద్, నవంబర్ 12,

బీహార్ రాష్ట్రంలో శాసనసభకు ఎన్నికలు జరుగుతున్నాయి.. ఇప్పటికే ఎన్నికలు పూర్తయ్యాయి. రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదు కావడంతో అన్ని రాజకీయ పార్టీలలో ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో రెండవ విడత ఎన్నికల ప్రచారంలో రాజకీయ పార్టీలు జోరుగా పాల్గొంటున్నాయి. త్వరలో రెండవ విడత ఎన్నికలు అక్కడ జరగబోతున్నాయి. నవంబర్ 14న ఫలితాలు విడుదలకానున్నాయి ఈ నేపథ్యంలో బీహార్ ఎన్నికలపై దేశవ్యాప్తంగా సర్వత్రా ఆసక్తి నెలకొంది.బీహార్ రాష్ట్రంలో ఎన్నికలు జరగబోతున్న నేపథ్యంలో ఓటు హక్కు వినియోగించుకోవడానికి ప్రజలు సొంత ప్రాంతాలకు వెళ్లిపోయారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో ఉపాధి నిమిత్తం పనులు చేస్తున్న బీహార్ ప్రజలు తమ సొంత ప్రాంతాలకు వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలోనే ఈసారి అక్కడ రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదయిందని అధికారులు చెబుతున్నారు. గతంలో ఎన్నడు లేనివిధంగా ఓటు హక్కు వినియోగించుకోవడానికి బీహార్ ప్రజలు ఉత్సాహాన్ని ప్రదర్శించడం ఆనందాన్ని కలిగిస్తోందని అధికారులు చెబుతున్నారు.. ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఎక్కడెక్కడ నుంచో సొంత ప్రాంతాలకు వచ్చారని బీహార్ ఎన్నికల అధికారులు అంటున్నారు.బీహార్ ఎన్నికలు అక్కడి రాజకీయ పార్టీలకు ఒక రకమైన పరీక్షను పెడుతుంటే.. తెలంగాణ రైతులకు మరో విధమైన ఇబ్బంది కలిగిస్తున్నాయి. వాస్తవానికి బీహార్ ఎన్నికలకు.. తెలంగాణ రైతులకు ఎటువంటి సంబంధం లేదు. అయితే బీహార్ ఎన్నికల వల్ల తెలంగాణ రైతులు ఇబ్బంది పడడానికి ఒక ప్రధానమైన కారణం ఉంది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో వరి పంట కోతకు వచ్చింది. చాలా ప్రాంతాలలో రైతులు వరి కోశారు.. ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. ఆరబెట్టిన ధాన్యాన్ని తూకం వేయడానికి కూలీలు అవసరం పడుతుంది. తెలంగాణలో ధాన్యం తూకం వేసే పనికి హమాలీలు పెద్దగా ఆసక్తి చూపించడం లేదు. అందువల్లే కొంతకాలంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలలో హమాలీలుగా బీహార్ కూలీలు పనిచేస్తున్నారు. పైగా బీహార్ ప్రజలకు కష్టపడి పనిచేసే తత్వం అధికంగా ఉంటుంది. వారు ఎంతటి ఎండనైనా సరే తట్టుకుంటారు. అందువల్లే బీహార్ కూలీలు ధాన్యం కొనుగోలు కేంద్రాలలో పనిచేస్తుంటారు. అయితే ప్రస్తుతం శాసనసభకు ఎన్నికలు జరగబోతున్న నేపథ్యంలో బీహార్ ప్రాంతానికి చెందిన హమాలీలు మొత్తం సొంత రాష్ట్రానికి వెళ్లిపోయారు.అధికారుల అంచనా ప్రకారం బీహార్ రాష్ట్రానికి చెందిన దాదాపు 18,000 మంది హమాలీలు దాన్యం కొనుగోలు కేంద్రాలు.. ధాన్యం మిల్లుల వద్ద పనిచేస్తుంటారు. ఓటు వేయడానికి వారు వెళ్లిపోవడంతో ధాన్యం లోడింగ్ అనేది సక్రమంగా సాగడం లేదు. దీంతో మిల్లుల వద్ద ధాన్యం నిలువలు పేరుకు పోతున్నాయి. దీనికి తోడు బీహార్ హమాలీలను అక్కడి రాజకీయ పార్టీలు ఓటుకు 5000 చొప్పున ఇచ్చి తీసుకెళ్లినట్టు తెలుస్తోంది. బీహార్ ఎన్నికలు ముగిసిన తర్వాత హమాలీలు ఇక్కడికి వస్తేనే ధాన్యం కొనుగోలు.. అన్లోడింగ్ వేగంగా సాగుతుందని మిల్లర్లు చెబుతున్నారు.

# పెడన మదరసాలో ముగ్గురు బాలికలు మిస్సింగ్

విజయవవాడ నవంబర్ 12,

పెడన15 వార్డులోని ఉర్దూ మదరసా నుండి మంగళవారం రాత్రి ముగ్గురు బాలికలు అదృశ్యం అయ్యారు. వారిలో బంటుమిల్లికి చెందిన మహమ్మద్ ఆస్మా. విజయవాడకు చెందిన షేక్ సబీహ. కాకినాడకు చెందిన షేక్ సమయ అదృశ్యం అయినట్టు మదర్సా సిబ్బంది పెడన పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. బాలికలు అదృశ్యంపై కేసు నమోదు చేసిన పెడన ఎస్సై జి సత్యనారాయణ దర్యాప్తు చేపట్టారు. ముగ్గురు బాలికలు కాకినాడ చేరుకునట్టు గుర్తించారు.

# జెట్టక్క వెళ్ళిపో.. లక్ష్మీదేవి రా..

అదిలాబాద్, నవంబర్ 12,

ఇంటిలో ఉన్న కీడు.. ఊర్లో ఉన్న కీడు అంతా వెళ్లిపోవాలి... జెట్టక్క వెళ్ళిపో.. జెట్టక్క వెళ్ళిపో.. లక్ష్మీదేవి రా.. లక్ష్మీదేవి రా.. ఏంటి.. వింటుంటే వింతగా అనిపిస్తుంది కదూ..! అవును ఇది నిజమే... ఇలా నిర్మల్ జిల్లాలో ఖానాపూర్ గ్రామస్తులు మొత్తం ఊరంతా చిన్న పెద్దలతో కలిసి పాత దుస్తులు వేసుకొని, పాత చీపుర్లు, చాటలతో ఒకరినొకరు కొట్టుకుంటూ ఊరి పొలిమేర్ల వరకు వెళ్ళారు.అందరూ కలిసి ఈ పాత వస్తువులతో.. జెట్టక్క వెళ్లిపో.. లక్షిదేవి రా.. అంటూ కేకలు వేస్తూ నృత్యాలు చేస్తూ.. ఊరి పొలిమేర వరకు వెళ్ళి వాటిని అక్కడే ఊరి పొలిమేరలో పడేశారు. అయితే ఇలా ఎందుకు చేస్తారంటే..? గ్రామానికి పట్టిన కీడు అంటే తెలంగాణ భాషలో కీడు ను జెట్ట చేస్తూ అంటుంటారు. అలా సంప్రదాయంగా జెట్టక్క అంటారు. అయితే గ్రామంలో ఉంటున్న అందరి ఇళ్లలోని కీడు, గ్రామం మొత్తం కీడు అంతా వెళ్ళిపోవాలి... జెట్టక్క తొలగిపోయి ఏడాదంతా ప్రజలంతా సుఖ శాంతులతో జీవిస్తారని, దీర్ఘ కాలిక సమస్యలకు తావుండదని ఈ వింత ఆచారం పలు గ్రామాల్లోనూ కొనసాగిస్తున్నారు.

================

# తాడిపత్రిలో హై టెన్షన్

తాడిపత్రి నవంబర్ 12,

తాడిపత్రిలో హై టెన్షన్ నెలకొంది. టీడీపీ, వైసీపీ పోటాపోటీగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. వైసీపీ నేత పెద్దారెడ్డి ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించేందుకు సిద్ధమవగా, పోలీసులు అడ్డుకున్నారు. మరోవైపు ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. దీంతో పెద్దారెడ్డి కార్య క్రమాన్ని పోలీసులు అడ్డుకోవడంతో టెన్షన్ వాతావరణం నెలకొంది.

# రాజేంద్రనగర్ లో దొంగల హల్ చల్

రాజేంద్రనగర్ నవంబర్ 12,

రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మరొకమారు దొంగలు రెచ్చిపోయారు.

బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్పూర్ గ్రామం ఓం నగర్ కాలనీ సాఫ్ట్వేర్ ఇంజనీర్ కిరణ్ ఇంట్లోకి చొరపడిన దొంగలు 30 తులాల బంగారం ఎత్తుకెళ్లారు. దొంగతనం జరిగిన విషయాన్ని గమనించిన కిరణ్ కుటుంబ సభ్యులు రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

=======================

# జూలూరుపాడు పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా సందర్శించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

భద్రాద్రి కొత్తగూడెం నవంబర్ 12,

జిల్లా ఎస్పీ రోహిత్ రాజు బుధవారం నాడు జూలూరుపాడు పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా సందర్శించారు. ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలపై పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలకు నిత్యం అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని అన్నారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు.అనంతరం అక్కడ ఉన్న పోలీస్ అధికారులు మరియు సిబ్బందికి పలు సూచనలు చేశారు.పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని,వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా మెలగాలని సూచించారు.అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.రోడ్డు ప్రమాదాలు,సైబర్ నేరాలపై నిత్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో లోని ప్రజలకు అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని సూచించారు.పోలీస్ స్టేషన్లో పనిచేసే అధికారులు,సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జూలూరుపాడు సీఐ శ్రీ లక్ష్మి,ఎస్సై రవి, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉద్యోగుల ఖిల్లా సరంపేట తండా

నల్గొండ, నవంబర్ 12,

నల్గొండ జిల్లా మర్రిగూడ మండలంలోని సరంపేట తండా.. చుట్టుపక్కల గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తోంది. 230 మంది ఓటర్లున్న ఈ తండాలో 190 మంది ఉద్యోగులున్నారు. వీరిలో 120 మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. వ్యవసాయంపై ఆధారపడిన ఈ తండా, చదువు విలువను గుర్తించి, తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించి, ఉద్యోగాల దిశగా ప్రోత్సహించింది. కొన్ని కుటుంబాల్లో ఇద్దరు, ముగ్గురు ఉద్యోగులు కూడా ఉన్నారు. ఇంత పెద్ద సంఖ్యలో ఉద్యోగులు ఉండటం నిజంగా విశేషం.ప్రభుత్వం ఉద్యోగం.. మాట వినిపిస్తే చాలా నిరుద్యోగులు ఆశగా చూస్తారు. నూటికి 90 మంది యువత ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా పెట్టుకుని ఆ దిశగా ఏళ్లతరబడి ప్రయత్నాలు చేస్తుంటారు. అయితే మనం ఎంత కష్టపడ్డా.. చివరకు ఎంతో కొంత అదృష్టం లేకపోతే ఉద్యోగం రావడం కల్ల. ఒకప్పుడు ఊరిలో ఒకరో, ఇద్దరో ప్రభుత్వ ఉద్యోగులు ఉండేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి మారింది. గ్రామాల్లో కూడా పదుల సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగులు కనిపిస్తున్నారు. ఒకే కుటుంబంలో ఇద్దరు, ముగ్గురు కూడా ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తున్నారు. ఈ క్రమంలో ఓ తండా గురించి ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. అక్కడ 230 మంది ఓటర్లు ఉంటే.. సుమారు 80 శాతం మంది అంటే 190 మంది ఉద్యోగులు ఉన్నారు. మరో ఆశ్చర్యకరమైన అంశం ఏంటంటే.. వీరిలో 120 మంది ప్రభుత్వ ఉద్యోగులు కావడం విశేషం. ఆ తండా వివరాలు..ఆ తండాలో 76 ఇళ్లు ఉండగా.. మొత్తం 230 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 190 మంది వరకు ఉద్యోగులున్నారు. వీరిలో 120 మంది ప్రభుత్వ ఉద్యోగులు కావడం గమనార్హం. ఇంతకు ఇది ఏ తండా అంటే.. అదే నల్గొండ జిల్లా మర్రిగూడ మండల పరిధిలోని సరంపేట తండా. ఒకప్పుడు ఈ తండాలో ఉండే వారికి జీవనాధారం వ్యవసాయమే. అయితే ఆ తల్లిదండ్రులకు చదువు విలువ బాగా తెలుసు. అందుకే ఎంత కష్టమైనా సరే.. తమ పిల్లలను బాగా చదివించాలని నిర్ణయించుకున్నారు. అందుకు తగ్గట్టుగానే.. ఈ తండా పిల్లలు కూడా తల్లిదండ్రులతో పాటు వ్యవసాయ పనులకు వెళ్తూ, చదువుకునే వారు.ఆ తర్వాత ఉన్నత విద్య కోసం మర్రిగూడ, హైదరాబాద్ వచ్చారు కొందరు. ఈక్రమంలో 1968లో తొలిసారి తండా వాసి ఒకరు ప్రభుత్వ ఉద్యోగం సాధించారు. ఆయనే మూడావత్ జగారం. అతడు సర్కార్ టీచర్ ఉద్యోగం సాధించారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని తండాలోని మిగతా వారు.. ప్రభుత్వ ఉద్యోగం సాధించే దిశగా అడుగులు వేశారు. అలా తండాలో ప్రతి ఏటా ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ప్రస్తుతం తండాలో 230 మంది ఓటర్లుంటే అందులో 120 మంది ప్రభుత్వ, 70 మంది వరకు ప్రైవేటు ఉద్యోగాలు ఉన్నారు. మిగతా వారు వ్యవసాయం, వ్యాపారాలు చేస్తున్నారు.తండాలోని కొన్ని ఇళ్లలో ఒక్కో ఇంటి నుంచి ఇద్దరు, ముగ్గురు కూడా ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులూ ఉన్నారంటే అతిశయోక్తి కాదు. కొందరు పదవీ విరమణ పొందారు. తండా వాసులు.. జిల్లా స్థాయి అధికారి నుంచి నాలుగో తరగతి ఉద్యోగి వరకు.. వివిధ హోదాల్లో పని చేస్తున్నారు. వీరంతా వేర్వేరు ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే వీరంతా ప్రతి సంవత్సరం దసరా, ఇతర పండగల సందర్భాల్లో గ్రామానికి వచ్చి అంతా కలిసి సంతోషంగా పండుగ జరుపుకుంటారు. పల్లె అంటే కేవలం వ్యవసాయం మాత్రమే గుర్తొచ్చే పరిస్థితుల్లో ఈ ఊరు కొలువుల ఖిల్లాగా మారడం నిజంగా విశేషం అంటున్నారు

# తురగ పేరుతో ...మిల్లర్ల దోపిడి

నిజామాబాద్, నవంబర్ 12,

రైస్ మిల్లర్లు రైతుల నిండా ముం చుతున్నారు. తరుగు పేరిట నిలువు నా... దోచేస్తున్నారు. ఆరుగాలం కష్టం చేసి పండించిన పంటను నానా సాకులు చెబుతూ అన్న దాతలను మోసం చేస్తున్నారు. ఉమ్మడి నిజాంబాద్ కామారెడ్డి జిల్లాలో రైస్ మిల్లలాగడాలు మితిమీరి పోతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. ధాన్యాన్ని తరలించినప్పటికీ కొనుగోలు చేసే పరిస్థితి లేక రైతులు అగచాట్లు పడుతున్నారు.రైస్ మిల్లర్ల పై విజిలెన్స్ అధికారులు దృష్టి పెట్టినట్లు తెలు స్తోంది. అధికారుల అండదండలతోటే ఈ తతంగం కొనసాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రకృతి వైపరీత్యాల కారణంగా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలంటూ ప్రభుత్వం ఆదేశించినప్పటికీ, రైస్ మిల్లర్లు రైతులను వేధించడం మాత్రం ఆపడం లేదు. ట్రేడింగ్ నాట్ ట్రేడింగ్ రైస్ మిల్లులు కామారెడ్డి జిల్లాలో కొనసాగుతున్నప్పటికీ, ట్రేడింగ్ రైస్ మిల్లులు మాత్రం ధాన్యం కొనుగోలు విషయంలో అవకతవకలకు పాల్పడుతున్నట్లు రైతులు ఆరోపిస్తు న్నారు.ధాన్యం తడిసిందని, వడ్ల రంగు మారిందని రైస్ మిల్లర్లు రైతులను ఇబ్బంది పెడుతున్నట్లు అన్నదాతల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం తరలించినప్పటికీ, వాటిని రైస్ మిల్లు లోకి ప్రవేశానికి అనుమతి ఇవ్వకుండా రోజుల తరబడి వాపోతున్నారు. బీర్కూర్, నసురుల్లాబాద్, రుద్రూర్ ప్రాంతాలకు చెందిన రైస్ మిల్లుల యాజమాన్యాలు రైతుల పట్ల మోసపూరిత వ్యాపారాన్ని కొనసాగిస్తున్నట్లు కర్షకులు కంటనీరు పెడుతున్నారు.రైస్ మిల్లర్ల ఆగడాలను అరికట్టేందుకు విజిలెన్స్ అధికారులు దృష్టి సాధించినట్లు తెలుస్తుంది. రైతులను ఇబ్బంది పెడుతున్న విషయాలను పరిగణలోకి తీసుకుని మిర్రర్లు చేస్తున్న తీరుతెనులపై ఆరా తీసినట్లు సమాచారం. ప్రభుత్వం రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేసి మి ల్లింగ్ అనంతరం పౌరసరఫరాల శాఖకు సరఫరా చేసేందుకు అనుమతులను జారీ చేసింది. కానీ మిల్లర్లు రైతుల నుంచి సేకరిస్తున్న ధాన్యాన్ని తామే స్వయంగా అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నట్లు రైతులు వాపోతున్నారు. ఈ విషయంలో పలు ఆరోపణలు రావడంతో విజిలెన్స్ అధికారులు మిల్లర్లపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు విశ్వాసనీయ వర్గాల సమాచారం ఉమ్మడి నిజాంబాద్ జిల్లాలోని రైస్ మిల్లర్లు తమ అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు మీడియాను సైతం లోబర్చుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. అక్రమాలు బయట రాకుండా మీడియాలో కథనాలు వెలువడకుండా ఉండేందుకు మీడియా ప్రతినిధులను నయానో భయానో అప్పజెప్తూ తమ దందాలు కొనసాగించుకునేం దుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయం కూడా విజిలెన్స్ అధికారుల దృష్టికి వెళ్లింది.విలేకరులను మచ్చిక చేసుకుని రైస్ మిల్లర్లు తమ వ్యాపారాలను ఏలాంటి అడ్డంకులు రాకుండా చూసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అందులో భాగంగా బీర్కూర్, నసరులబాద్, రుద్రూర్ ప్రాంతాలకు చెందిన ట్రేడింగ్ రైస్ మిల్లుల యజమానులు పై విధంగా ప్రయత్నాలు చేస్తూ, ఇటు మీడియాను, అటు అధికారులను తలా పాపం తిల పిడకడన్న చందంగా అప్పజెప్తున్నట్లు పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఈ విషయంలో జిల్లా స్థాయి అధికారులు సైతం సహకారాన్ని అందిస్తున్నట్లు విమర్శలు గుప్పుమంటున్నాయి. మిల్లర్ల యజమానులపై విజిలెన్స్ అధికారులు ఎలాంటి చర్యలకు పాల్పడతారో..వేచి చూడాల్సిందే.

# మాదకద్రవ్యాల నిర్మూలన కోసం అభ్యుదయం సైకిల్ ర్యాలీ

అనకాపల్లి నవంబర్ 12,

మాదకద్రవ్యాల నిర్మూలన కోసం విశాఖపట్నం రేంజ్ పరిధిలోని ఐదు జిల్లాలలో అభ్యుదయం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. హోం మంత్రి అనిత పాయకరావుపేటలో సైకిల్ ర్యాలీని ప్రారంభించారు.

ఈ ర్యాలీలో విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి,అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తదితరులు పాల్గొన్నారు.విశాఖపట్నం రేంజ్ పరిధిలోని అనకాపల్లి, విజయనగరం, పార్వతీపురం మన్యం మరియు శ్రీకాకుళం జిల్లాలలో మొత్తం 25 రోజుల పాటు, సుమారు 500 కిలోమీటర్ల పైగా సైకిల్ ర్యాలీ కొనసాగనుంది. మాదకద్రవ్యాల నిర్మూలన అవగాహన కోసం పాయకరావుపేటలో విద్యార్థులతో ఫ్లాష్ మాబ్ నిర్వహించారు. మాదకద్రవ్యాలు వద్దు-జీవితమే ముద్దు అంటూ విద్యార్థుల ఫ్లాష్ మాబ్ ఆకట్టుకుంది. హోం మంత్రి అనిత విద్యార్థులతో మాదకద్రవ్యాల నిర్మూలన ప్రతిజ్ఞ చేయించారు. అభ్యుదయ సైకిల్ ర్యాలీలో భాగంగా సైకిల్ తొక్కి,ర్యాలీని ప్రారంభించారు. పాయకరావుపేట గౌతమ్ థియేటర్ నుండి పాయకరావుపేట శ్రీప్రకాశ్ కాలేజ్ వరకు సైకిల్ తొక్కితూ మంత్రి ర్యాలీలో పాల్గొన్నారు.సైకిల్ ర్యాలీలో భాగంగా ఆటోలో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించారు.

హోం మంత్రి మాట్లాడుతూ మాదకద్రవ్యాల నిర్మూలన కోసం విశాఖపట్నం రేంజ్ పరిధిలోని ఐదు జిల్లాలలో సైకిల్ ర్యాలీ నిర్వహించడం సంతోషం. యువత భవిష్యత్ చాలా ముఖ్యం. ఎన్డీయే ప్రభుత్వంలో గంజాయిపై ఉక్కుపాదం మోపం. ఈగల్ అనే ఒక వ్యవస్థను ఏర్పాటు చేశాం. పాఠశాలలు,కళాశాలల్లో విద్యార్థులకు చట్టాలపై అవగహన కల్పించాలి. గంజాయి మత్తులో యువత జీవితాలను నాశనం చేసుకోకండి. ఎన్డీపీఎస్ యాక్ట్ కఠినంగా అమలు చేస్తున్నాం. మాదకద్రవ్యాలు నిర్మూలన కోసం పోలీస్ శాఖ ఎంతో కృషి చేస్తుంది. ప్రస్తుతం నిఘా పెరిగింది.కఠినతరమైన శిక్షలు,చట్టాలు ఉన్నాయని అన్నారు.

గంజాయి రవాణా చేసిన,గంజాయి సేవిస్తున్నా వెంటనే 1972 కాల్ చేయండి. తక్షణమే పోలుసులు వస్తారు,చట్టపరంగా చర్యలు తీసుకుంటారు. మన భవిష్యత్-మన చేతుల్లో ఉందని అన్నారు.

# ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై బద్వేలు లో ఆగ్రహ జ్వాలలు

## వైయస్ఆర్ సీపీ ఆధ్వర్యంలో ప్రజలు నాయకుల రోడ్డెక్కి బహిరంగ నిరసన

బద్వేలు నవంబర్ 12,

ఆంధ్రప్రదేశ్‌లో వైద్య విద్యను పేదలకు అందుబాటులోకి తీసుకురావాలనే మహత్తర లక్ష్యంతో 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ఒకే కాలంలో ఏర్పాటు చేసి చరిత్ర సృష్టించిన నాటి ప్రజా నాయకుడు వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆశయాలను తుంగలో తొక్కే ప్రయత్నం జరుగుతోందని బద్వేలు నియోజకవర్గ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజల కలల కాలేజీలను ప్రైవేటు వ్యక్తుల బినామీలకు అప్పగించి పీపీపీ విధానంలో ధారాదత్తం చేయాలనే కుట్ర చేస్తున్నదని ఆరోపిస్తూ ప్రజా ఉద్యమ రూపంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు.బద్వేలు వైయస్ఆర్ సీపీ ఇంచార్జ్ ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి నేతృత్వంలో విద్యార్థులు, యువత, మహిళలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. బద్వేలు టౌన్ ఎన్జీవో కాలనీలో దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం అక్కడి నుండి ఆర్డీవో కార్యాలయం వరకు ఉత్సాహభరితమైన నిరసన ర్యాలీగా బయలుదేరి, “ప్రైవేటీకరణ రద్దు చేయాలి!”, “ప్రజల ఆస్తిని దోచుకునే కుట్ర ఆపాలి!”, “చంద్రబాబు వంచన అంగీకరించము!” అంటూ నినాదాలతో పట్టణాన్ని మారుమ్రోగించారు.

# బకాయిలతో సహ ఇన్పుట్ సబ్సీడీ వెంటనే చెల్లించాలి

## పంట నష్టం, మార్కెటింగ్ సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం

హైదరాబాద్ నవంబర్ 12

సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో పంట నష్టం, మార్కెటింగ్ సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది.

వక్తలు మాట్లాడుతూ ఇప్పటి వరకు జరిగిన పంట నష్టానికి ఇన్పుట్ సబ్సిడిని, గత బకాయిలతో సహా వెంటనే రైతుల అకౌంటులలో వేయాలి. . ఈ ఖరీఫ్ సీజన్లో జరిగిన పంట నష్టానికి తుది జాబితాలు తయారు చేయడంలో జరిగిన లోపాలను సరి చేసి, అర్హులైన రైతులందరినీ దానిలో చేర్చి వాళ్ళకి కూడా ఇన్పుట్ సబ్సిడీ ఇవ్వాలి. దీని కోసం పారదర్శకమైన ప్రక్రియను ఏర్పాటు చేయాలని అన్నారు.

పటిష్టమైన, రైతు అనుకూలమైన పంటల బీమా పథకాన్ని వెంటనే అమలులో తేవాలి (ఈ రబీ సీజన్ నుండే). ప్రభుత్వమే కౌలు రైతులతో సహా రైతులందరినీ నమోదు చేసి వారి ప్రీమియం కట్టే విధంగా అమలు చేయాలి. పంట నష్టాన్ని అంచనా వేసి ఎన్యూమరేషన్ చేసే పద్ధతి ని పారదర్శకంగా అమలు చేయాలి. నష్టపోయిన రైతుల జాబితాలను గ్రామ స్థాయిలో ప్రకటించి, వారికి ఫిర్యాదు చేసి సరి చేసుకునే అవకాశం కల్పించాలి. కేంద్రం వెంటనే విపత్తు సహాయ నిది నుండి నిధులను పూర్తి స్థాయిలో మంజూరు చేయాలి. విపత్తు సహాయాన్ని తరి పంటలకి, వర్షాధార పంటలకి కూడా ఎకరానికి 15,000 చేయాలని అన్నారు.

# సుభాన్ బేకరీ నూతన బ్రాంచ్ ప్రారంభం

సికింద్రాబాద్ నవంబర్ 12

ఉస్మానియా బిస్కెట్లు, దమ్-కే-రోట్, ఫ్రూట్ కేక్లతో హైదరాబాదీ రుచిని తరతరాలుగా అందిస్తున్న సుభాన్ బేకరీ సింధీ కాలనీలో కూడా సేవలందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. హైదరాబాద్ రుచుల్లో అగ్రగామిగా పేరుపొందిన సుభాన్ బేకరీ ఇప్పుడు తన కొత్త కేఫ్ను సికింద్రాబాద్లో ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు. ఉస్మానియా బిస్కెట్లు, దమ్-కే-రోట్, ఫ్రూట్ కేక్లతో హైదరాబాదీ రుచిని తరతరాలుగా నిలబెట్టిన ఈ బేకరీ ఇప్పుడు ఆధునిక కేఫ్ రూపంలో కొత్త అనుభూతిని అందిస్తోందని ఈ సందర్భంగా రసూల్ బీ సాహిబా తెలిపారు. మేనేజింగ్ డైరెక్టర్ సయ్యద్ ఇర్ఫాన్ మాట్లాడుతూ.. ఇది కేవలం బేకరీ కాదు, తమ సంప్రదాయం, కస్టమర్లతో ఉన్న బంధానికి ప్రతీకని అన్నారు. నాణ్యత, విశ్వసనీయత, హైదరాబాదీ టచ్ సుభాన్ బేకరీ ఈ కొత్త బ్రాంచ్ ద్వారా సికింద్రాబాద్ ఫుడ్ లవర్స్ హృదయాలను గెలుచుకోనుందని ఆయన పేర్కొన్నారు.

# విపక్షాలపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు

విశాఖపట్నం నవంబర్ 12,

రాష్ట్రంలో ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలు కొనసాగుతున్నాయని వైసీపీ నాయకులు, విశాఖ దక్షిణ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఆరోపిం చారు.వైసిపి హయాంలో నిర్మాణం లో ఉన్న మెడికల్ కాలేజీలను ప్రైవే టుపరం చేయడానికి ప్రస్తుత ప్రభు త్వం ప్రయత్నిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు వాసుపల్లి గణే ష్ కుమార్ ఆధ్వర్యంలో విశాఖలో ఏవీఎన్ కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ మెడికల్ కాలేజీ ల ప్రైవేటీకరణ వల్ల వాటికి అనుబంధంగా ఉండే బోధన ఆసు పత్రులలో పేదలకు పూర్తిస్థాయిలో ఉచిత వైద్యం అందదని చెప్పారు. ఇంకా రోగనిర్ధరణ అలాగే ఇన్ పేషెం ట్ మెడిసిన్స్ కి చార్జ్ చేస్తారని ఆరోపించారు.ఇదిలా ఉండగా మరో వైపు రాష్ట్రం పెద్ద సంఖ్యలో మెడికల్ సీట్లు కోల్పోతుందని తెలి పారు.గత ఏడాది 750 ఎంబిబిఎస్ సీట్లు సమకూర్చాల్సి ఉన్న చంద్రబా బు ప్రభుత్వ కక్ష పూర్తి విధానాలతో 700 సీట్లు కోల్పోయామని పేర్కొన్నారు.

# రైలు నుంచి జారి పడి వ్యక్తి దుర్మరణం

ఏలూరు నవంబర్ 12,

ప్రమాదవశాత్తు ప్రయాణిస్తున్న రైలు నుండి జారిపడి వ్యక్తి మృతి చెందాడు మాల్దా జిల్లాకు చెందిన సుదీప్ బోరో (30) వివేకా ఎక్స్ప్రెస్ రైల్లో తన స్వగ్రామానికి చెంగనూరు నుండి వెళ్తున్నాడు. ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ వద్దకు రైలు చేరుకునే సరికి అతను జారీ పడ్డాడు స్టేషన్ మాస్టర్ ఇచ్చిన సమాచారంతో రైల్వే పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

# బరువు తగ్గాలనుకుంటున్నారా..? రోజు ఈ చిట్కాలు పాటించండి..!



ఊబకాయం(ఒబెసిటీ).. ఈ జనరేషన్‌లో చాలా మందిని వేధిస్తున్న సమస్య. చాలామంది కంప్యూటర్ల ముందు గంటలు గంటలు కూర్చొని పనిచేయడంతో సమస్య వేధిస్తోంది. పొట్ట చుట్టూ అనవసర కొవ్వు పేరుకుపోవడం వల్ల.. అధికంగా బరువు పెరుగుతున్నారు. దీంతో ఒబెసిటీ సమస్య వస్తోంది.. పలు సందర్భాల్లో భావోద్వేగ స్థాయిలో సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఊబకాయం పెరగడంతో శరీరం వికారంగా కనిపిస్తుంది. ఈ ఊబకాయంతో అనేక వ్యాధులకు కూడా కారణం అవుతాయి.

అధిక బరువు పెరగడంతో అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్, మధుమేహం వంటి సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. బరువు తగ్గడం కోసం ఎన్నో వ్యాయామాలు, డైట్‌ల గురించి చెప్పినా ఒక్కోసారి పని వల్ల, మరికొన్ని సార్లు బద్ధకంతో ఎందరో బరువు తగ్గించుకోలేకపోతున్నారు. ప్రతి రాత్రి కొన్ని చిట్కాలు పాటించడం, ఆహారంలో స్వల్ప మార్పులు చేయడం ద్వారా సులభంగా బరువును తగ్గించుకోవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.

పుష్కలంగా నీరు తాగాలి

శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడానికి నీళ్లు తాగడం చాలా ముఖ్యం. బరువును నియంత్రించడంలో నీరు ప్రభావవంతంగా ఉంటుంది. బరువును అదుపులో ఉంచుకోవడానికి.. నీరు ఎక్కువగా తాగాలి. తద్వారా కడుపు నిండిన అనుభూతిని కలిగించడంతో పాటు అనవసరమైన కేలరీలను తీసుకోకుండా ఉండేందుకు సహాయపడుతుంది. నీరు ఎక్కువగా తాగడంతో శరీరంలోని టాక్సిన్స్ కూడా బయటకు వెళ్లిపోతాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు రోజుకు 8 గ్లాసుల నీళ్లు తాగడం అలవాటు చేసుకోవాలి.

పడుకునే ముందు తేలికపాటి వ్యాయామం చేయాలి

మీరు మీ పెరుగుతున్న బరువును నియంత్రించాలనుకుంటే.. క్రమం తప్పకుండా పడుకునే ముందు.. పది నుంచి పదిహేను నిమిషాల పాటు తేలికపాటి వ్యాయామం చేయాలి. బరువు తగ్గడానికి ఇది చాలా ప్రభావవంతమైన మార్గం.

# చిన్నపిల్లల్లో శ్వాసకోశ వ్యాధులు రాకుండా ఉండాలంటే ఎలాంటి ఆహారం ఇవ్వాలి..?

శిశువు జబ్బు పడినప్పుడు, పెరుగుదలలో లోపం రాకుండా జాగ్రత్తపడటం తల్లిదండ్రుల కర్తవ్యం. అంటువ్యాధులకు ఆహార లోపాలు తోడైతే పిల్లల శారీరక, మానసిక అభివృద్ధి కుంటుపడుతుంది. అనారోగ్య సమయంలో పసిబిడ్డల ఆకలి బాగా తగ్గిపోతుంది. వాంతులు అవుతాయి. దీనివల్ల తీసుకునే ఆహార పరిమాణమూ తగ్గిపోతుంది.

అతిసార వ్యాధి, మశూచి వచ్చినప్పుడైతే, తీసుకున్న ఆహారంలో కొంత మాత్రమే ఒంటికి పడుతుంది. ఇప్పటికీ కొందరు 'లంఖణం పరమౌషధం' అన్న మాటనే నమ్ముతారు. పిల్లలకు ఆహారం ఇవ్వకుండా కడుపు మాడ్చుతారు. నిజానికి ఆరోగ్యవంతులతో పోలిస్తే, అనారోగ్యపీడితుల ఆహార అవసరాలే ఎక్కువగా ఉంటాయి.

వ్యాధిని ఎదిరించడానికి మందులతోపాటు బలవర్ధకమైన ఆహారం అవసరం. అందువల్ల, అనారోగ్య సమయంలో పిల్లలకు పోషకాలతో కూడిన ఆహారం తినిపించడం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించాలి. అందులోనూ, కోలుకుంటున్న దశలో బాగా ఆకలి వేస్తుంది. కాబట్టి, అంతకుముందు కన్నా ఎక్కువ ఆహారాన్ని ఇవ్వడానికి ప్రయత్నించాలి.

ఇష్టమైన పదార్థాలను మెత్తగా చేసి, కొద్దికొద్దిగా ఎక్కువసార్లు పెట్టాలి. అందులోనూ తల్లిపాలు చాలా ముఖ్యం. ఈ



సమయంలో బిడ్డలు ద్రవ పదార్థాలపై ఎక్కువ ఆసక్తి చూపుతారు. బిడ్డ వ్యాధికి పూర్వం ఉన్న బరువుకు తిరిగి చేరుకోగలిగితే, అనారోగ్యం నుండి పూర్తిగా కోలుకున్నట్టే.

పిల్లలను తరచూ ఇబ్బందిపెట్టే రుగ్మతలు దగ్గు, జలుబు. వీటిని అశ్రద్ధ చేస్తే న్యుమోనియా అనే ఊపిరితిత్తుల వ్యాధికి దారితీయవచ్చు. తల్లిపాలతో న్యుమోనియాను అరికట్టవచ్చు. విటమిన్-ఎ ఎక్కువగా ఉండే పసుపుపచ్చ ఫలాలు, ఆకుకూరలు కూడా శ్వాసకోశ వ్యాధుల నుంచి రక్షిస్తాయి.

దగ్గు, జలుబు ఉన్నప్పుడు తల్లిపాలు తాగడం పిల్లలకు కష్టం కావచ్చు. అలా అని ఆపకూడదు. అమ్మ పాలు రోగనిరోధక శక్తిని ఇవ్వడమే కాదు, పోషకాహార లోపాలనూ నివారిస్తాయి. పిల్లల ముక్కును తరచూ శుభ్రం చేయడం వల్ల పాలు తాగడం సులభం అవుతుంది.

అయినా ఇబ్బందిగా ఉంటే, శుభ్రమైన కప్పులోకి పాలు పిండి చెంచాతో తాగించాలి. తరచూ ద్రవ పదార్థాలు ఇవ్వడం వల్ల శ్వాస నాళాలలోని స్రవాలు చిక్కబడవు. దగ్గినప్పుడు సులభంగా బయటికి వచ్చేస్తాయి.

# మెల్లగా ఆహారం తినండి.. శరీరం బరువు తగ్గించుకోండి..!

దృఢమైన చక్కని ఆకృతిలో శరీరాన్ని సొంతం చేసువాలంటే.. డైటింగ్, వర్కవుట్స్.. రెండూ ముఖ్యమైనవే అని భావిస్తాం. ఉపవాసం, కష్టతరమైన వ్యాయామాలు చేయాల్సిన అవసరం లేకుండానే శరీరం బరువును తగ్గించుకోవడంలో అద్భుత ఫలితాలు సాధించవచ్చు అంటున్నారు ఫిట్‌నెస్ నిపుణులు. నెమ్మదిగా తినండి అంటే చాలా మందికి కోపంగా ఉంటుంది. శరీరం బరువు తగ్గించుకోవడానికి ముందుగా ఆహారాన్ని బాగా నమిలి తినడం అలవాటు చేసుకోవాలి. ఆహారాన్ని బాగా నమలడానికి ఎక్కువ సమయం పడుతుంది. దాంతో ఆహారాన్ని మెల్లగా తింటారు. అంతేకాదు కడుపారా తిన్న సంతృప్తి కూడా కలుగుతుంది. ఫలితంగా ఎక్కువగా తినకుండా ఉంటారు. ఎంత తింటున్నారు అనేది కూడా చాలా ముఖ్యం. డైటింగ్ చేయనప్పటికీ చిన్న ప్లేట్‌లో తినడం వల్ల ఎక్కువగా తిన్నామన్న భావన కలిగి తినే మోతాదు తగ్గిపోతుంది. భోజనం చేయడానికి ముందు ఎక్కువగా నీళ్లు తాగాలి. దీంతో మీరు తక్కువ తినగానే పొట్ట నిండుగా అనిపిస్తుంది. మెల్లగా ఆహారం తీసుకోవడం వల్ల మన శరీరం బరువు తగ్గించుకోవడంతోపాటు అనేక ప్రయోజనాలు ఉంటాయి. అవేంటంటే..

మంచి పోషక శోషణ:

నెమ్మదిగా తినడం వల్ల మంచి జీర్ణక్రియ సాధించవచ్చు. శరీరం ద్వారా పోషకాలను గ్రహించడం కూడా గరిష్ఠంగా ఉంటుంది.




ఒత్తిడి స్థాయిలు తగ్గుతాయి:

నమలడం, ఆహార సంతృప్తి పెరుగడం ద్వారా ప్రశాంతమైన, సంతోషకరమైన మనసును పొందడానికి దారితీస్తుంది. ఇది తక్కువ స్థాయి ఒత్తిడిని సాధించడానికి నేరుగా దోహదం చేస్తుంది.

మెరుగైన జీర్ణక్రియ:

నెమ్మదిగా తినడం వల్ల మరింత నమలడం అవసరం అవుతుంది. ఇది జీర్ణక్రియ ప్రక్రియను మెరుగుపరచడానికి తద్వారా శరీరం బరువు తగ్గడాన్ని ప్రోత్సహిస్తుంది.

సంతృప్తి ప్రేరేపణ:

నెమ్మదిగా తినడం వల్ల ఆహారాన్ని పూర్తి స్థాయిలో ఆస్వాదించడానికి వీలుంటుంది. తినడం ఎల్లప్పుడూ సరిపోకపోవచ్చు. అయితే దాని రుచి, వాసన, ఆకృతిని గుర్తించి అభినందిస్తున్నప్పుడు తినడం మరింత సంతృప్తి చెందడానికి సహాయపడుతుంది.

నమలడాన్ని ప్రోత్సహిస్తుంది:

నెమ్మదిగా తినేటప్పుడు దంతాలతో నమలడం మెరుగుపడుతుంది. ఇది క్యాలరీల వినియోగాన్ని నియంత్రించడానికి, తగ్గించడానికి సహాయపడుతుంది. తద్వారా శరీరం బరువు తగ్గడాన్ని ప్రోత్సహిస్తుంది.

అదేవిధంగా, ఒత్తిడి, ఉద్వేగంగా ఉన్నప్పుడు ఎక్కువగా తినేస్తారు. ఒత్తిడికి లోనైన సమయాల్లో ఎక్కువగా విడుదలయ్యే కార్టిసాల్ హార్మోన్.. ఆకలిని పెంచుతుంది. బరువు పెరగడానికి నిద్రలేమి కూడా ఒక కారణంగా తేల్చారు. చాలినంత నిద్ర లేకపోవడం వల్ల హార్మోన్ల విడుదలలో అసమతౌల్యం ఏర్పడి ఊబకాయం సమస్య వస్తుంది. కాబట్టి కంటినిండా నిద్రపోవడం అలవర్చుకోవాలి.


# ఆ ఉల్లిగడ్డలను తిని జనాలు ఎందుకు జబ్బుపడుతున్నారు? వాటిలో ఏముంది?

ఉల్లిగడ్డలను తినడం ఆరోగ్యానికి ఎంతో మంచిది అని పెద్దలు చెబుతుంటారు. ఉల్లి చేసే మేలు తల్లి కూడా చేయదంటారు. కానీ.. ప్రస్తుతం ఆ ఉల్లిగడ్డలను తినడం వల్లనే చాలామంది వ్యాధి బారిన పడుతున్నారు. ఇప్పటి వరకు ఉల్లిగడ్డలను తినడం వల్ల యూఎస్‌ఏలోని 37 రాష్ట్రాల్లో 652 మందికి పలు ఆరోగ్య సమస్యలు వచ్చాయి. అందులో 129 మంది ఆసుపత్రి పాలయ్యారు. దానికి కారణం వాళ్లు తిన్నది సాల్మానెల్లా అనే బ్యాక్టీరియా ఉన్న ఉల్లిగడ్డలను తినడం. ఆ ఉల్లిగడ్డలను మెక్సికో నుంచి యూఎస్‌కు ఇంపోర్ట్ చేశారు. వాటిని తిని ఇప్పటి వరకు ఎవరూ చనిపోలేదు కానీ.. ఆసుపత్రుల పాలు అవడం.. పలు ఆరోగ్య సమస్యలకు గురి కావడంతో యూఎస్‌లో ఉల్లిగడ్డలను తినాలంటే అక్కడి ప్రజలు వణికిపోతున్నారు.

అసలు సాల్మానెల్లా అంటే ఏంటి?

సాల్మానెల్లా అనేది ఓ బ్యాక్టీరియా. అది ఎక్కువగా ఆహార పదార్థాల్లో ఉంటుంది. వాటిని తినగానే ఆరోగ్య సమస్యలు వస్తాయి. ఈ బ్యాక్టీరియా ఉన్న ఫుడ్‌ను తీసుకోగానే పేగుల్లో సమస్యలు వస్తాయి. తద్వారా కడుపు నొప్పి వస్తుంది. ఈ బ్యాక్టీరియా ద్వారా ఆరోగ్య సమస్యలు వస్తే వాటిని సాల్మోనెల్లోసిస్ అని అంటారు.

ఈ రకం బ్యాక్టీరియా ఎక్కువగా జంతువుల్లో, మనిషి పేగుల్లో ఉంటుంది.



ఈ బ్యాక్టీరియా మల విసర్జన ద్వారా బయటికి వెళ్లి ఆహార పదార్థాల్లో, నీళ్లలో కలిసి పోయి.. తిరిగి మనుషుల్లోకి చేరుతుంది. ఈ బ్యాక్టీరియా మనుషుల్లోకి చేరిందని తెలుసుకోవడం చాలా కష్టం.


ఈ బ్యాక్టీరియాతో ఇన్‌ఫెక్ట్ అయితే వాంతులు అవడం, డయోరియా, జ్వరం, తలనొప్పి, కడుపు నొప్పి లాంటి లక్షణాలు కనిపిస్తాయి. 5 సంవత్సరాల కంటే తక్కువ వయసు ఉన్న పిల్లలు.. 65 సంవత్సరాల కంటే ఎక్కువ వయసు ఉన్న పెద్దలకు ఈ బ్యాక్టీరియా సోకే ప్రమాదం ఎక్కువ.

ఈ బ్యాక్టీరియా రక్త ప్రవాహంలో కలిస్తే మాత్రం చాలా ప్రమాదం. అది మెదడులోని కణజాలాన్ని, వెన్నుముకను డ్యామేజ్ చేస్తుంది. రక్తనాళాలపై కూడా ప్రభావం చూపిస్తుంది. పైన చెప్పిన లక్షణాలు ఉంటే వెంటనే ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలి.

# ఈ పండుతో ఆరోగ్య ప్రయోజనాలు మెండు!

సీజనల్ పండ్లు ఆరోగ్యానికి చేకూర్చే ప్రయోజనాలు మెండు అని నిపుణులు చెబుతున్నారు. శీతాకాలంలో లభించే శీతాఫలాల్లో విటమిన్లు, మినరల్స్, యాంటీఆక్సిడెంట్లు, ఇతర పోషకాలు మనకు శక్తితో పాటు ఆరోగ్యాన్ని అందిస్తాయని చెబుతున్నారు. ఈ పండులో ఉండే విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు మెదడును ఉత్తేజితం చేస్తాయి. శీతాఫలంలో పుష్కలంగా లభించే ఫైబర్‌తో జీర్ణప్రక్రియ సాఫీగా సాగుతూ ప్రేగుల ఆరోగ్యాన్ని కాపాడుతుంది. ఈ పండులో ఉండే యాంటీఆక్సిడెంట్ లుటెన్ కంటి ఆరోగ్యాన్ని కాపాడుతూ కంటి సమస్యలు రాకుండా నివారిస్తుంది.

ఇక సీతాఫలంలో పుష్కలంగా ఉండే మాగ్నీషియం, పొటాషియం ఇతర పోషకాలు రక్తపోటు స్థాయిని మెరుగ్గా నియంత్రిస్తాయి. ఇందులో ఉండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఆరోగ్యకరమైన మధుమేహ లెవెల్స్ ఉండేలా చేస్తాయి. వాపు



వల్ల వచ్చే వ్యాధులను నియంత్రించడంతో పాటు ఇవి గుండె ఆరోగ్యాన్నీ సంరక్షిస్తాయని నిపుణులు చెబుతారు. ఈ పండులో ఉండే విటమిన్ సీ ద్వారా రోగనిరోధక వ్యవస్థ బలపడుతుందని, ఇది లో గ్లైసివెుక్ ఇండెక్స్‌ను కలిగి ఉండటంతో మధుమేహ రోగులూ శీతాఫలం తినవచ్చని పోషకాహార నిపుణులు పేర్కొంటున్నారు.

# కూల్‌డ్రింక్స్ అధికంగా తాగితే డేంజరే..!

ఎండాకాలం వచ్చిందంటే చాలు.. చాలా మంది కూల్‌డ్రింక్స్‌ను ఎడా పెడా తాగేస్తుంటారు. ఇంకా కొంత మందైతే కాలాలతో సంబంధం లేకుండా కూల్ డ్రింక్స్‌ను తాగుతుంటారు. అయితే నిజానికి ఇవి మన ఆరోగ్యానికి చేటు చేస్తాయి. కూల్ డ్రింక్స్‌ను ఎక్కువగా తాగడం వల్ల ఎన్నో అనారోగ్య సమస్యలు వస్తాయి. వ్యాధులు

కూల్‌డ్రింక్స్‌ను అధికంగా తాగితే బరువు త్వరగా పెరుగుతారు. వాటిలో ఉండే చక్కెర శరీరంలో కొవ్వును పెంచుతుంది. దీంతో అధిక బరువు పెరుగుతారు. ఫలితంగా డయాబెటిస్, గుండె జబ్బులు వచ్చేందుకు అవకాశం ఉంటుంది. కనుక బరువు తగ్గాలనుకునే వారు కూల్ డ్రింక్స్‌కు దూరంగా ఉండాలి. అలాగే



ఇతరులు కూడా కూల్ డ్రింక్స్‌ను ఎంత తక్కువగా తాగితే అంత మంచిది. కూల్ డ్రింక్స్ తాగాలనిపించినప్పుడు సహజసిద్ధమైన పానీయాలు తాగండి. కొబ్బరి నీళ్లు, పుచ్చకాయ రసం, చెరుకు రసం తదితర పానీయాలు తాగడం వల్ల మనకు ఆరోగ్యకర ప్రయోజనాలు కలుగుతాయి..!

# చిన్న బూటు.. చిరిగిన దుస్తులు.. దిల్లీ విషాదానికి ఆనవాళ్లు!



ఓ చిన్న బూటు.. భుజానికేసుకునే బ్యాగు.. చిరిగిన దుస్తులు.. సగం తిన్న ఆహారం.. ఇలా ఎన్నో వస్తువులు దిల్లీలో పేలుడు జరిగిన ప్రాంతంలో విషాద ఘటనకు సాక్ష్యాలుగా పడి ఉన్నాయి. అవి చనిపోయిన వారి గుర్తులే కావచ్చు.. లేదా ప్రాణభయంతో పరిగెత్తిన ప్రజల ఆనవాళ్లే అయిఉండొచ్చు. చెల్లాచెదురైన ఒక్కో వస్తువు వెనుక ఒక్కో కథ. కేసు దర్యాప్తు నేపథ్యంలో వాటిని ఎవరూ తాకకుండా అధికారులు ఇప్పటికే ఘటనాస్థలాన్ని సీజ్ చేశారు. పెద్ద సంఖ్యలో సందర్శకులతో సందడిగా ఉండే ఆ ప్రదేశం ఇప్పుడు పోలీసు బారికేడ్ల వెనుక మౌనంగా నిల్చుంది. నిత్యం జనసందోహంతో కళకళలాడే ఈ ప్రదేశం.. విధ్వంసానికి వేదికగా మారడం చూసి తామంతా షాక్‌కు గురయ్యామని ఘటనాస్థలానికి వచ్చిన అనేక మంది తెలిపారు. ఆ రోజు పేలుడు తీవ్రత చాలా ఎక్కువగా ఉందని సమీపంలోని ఓ వస్త్రాల దుకాణం నిర్వాహకుడు గుర్తుచేసుకున్నారు. “ఏం జరిగిందో ఎవరికీ తెలియదు. చాలామంది సిలిండర్ పేలిందేమో అనుకున్నారు. 10 నిమిషాల్లోనే దుకాణాలు మూసేయాలని అధికారులు ఆదేశించారు. అప్పటికే బయట ప్రజలు భయాందోళనతో పరుగులు పెడుతున్నారు. వెంటనే మేం దుకాణం సర్దేసి ఇంటిబాట పట్టాం” అని ‘పీటీఐ’ వార్తాసంస్థకు తెలిపారు. పేలుడు జరిగిన ప్రదేశానికి సమీపంలోని చాలావరకు దుకాణాలు బుధవారం తెరచుకున్నాయి. అయితే.. వ్యాపారం అంతంతమాత్రంగానే సాగిందని నిర్వాహకులు తెలిపారు. “జనం వస్తున్నారు. కానీ.. ఇంతకుముందులా లేదు. ఇప్పుడు పెళ్లిళ్ల సీజన్. సాధారణంగా ఈ సమయంలో పెద్దఎత్తున గిరాకీ ఉంటుంది. కానీ, పేలుడు నేపథ్యంలో విక్రయాలు పడిపోయాయి” అని ఓ దుకాణదారు చెప్పారు. “మంగళవారం మార్కెట్ దాదాపు ఖాళీగా ఉంది. చాలా దుకాణాలు మూసి ఉన్నాయి. ఇంకా భయం భయంగానే ఉంది. ఇంట్లోవాళ్లు కూడా బయటకు పంపడం లేదు” అని మరొకరు వెల్లడించారు.

*** ట్రాన్స్‌ఫార్మర్ పేలిందనుకుని.. యథావిధిగా వేడుక**

కారు పేలుడు జరిగిన రోజు ఘటనాస్థలానికి సమీపంలో చాందినీ చౌక్‌లోని జైన్ స్పోర్ట్స్ క్లబ్‌లో ఓ నిశ్చితార్థ వేడుక జరుగుతోంది. ఆ సమయంలో ఒక్కసారిగా పేలుడు శబ్దం విని.. అక్కడున్న వారంతా ఏ ట్రాన్స్‌ఫార్మరో, సిలిండరో పేలిందనుకున్నారట. కొన్ని క్షణాల పాటు డీజే పాటలు ఆపి.. ఏం జరిగిందా? అని అటూఇటూ చూసి మళ్లీ వేడుకల్లో మునిగిపోయారని క్లబ్ కాపలాదారుతోపాటు అక్కడే దుకాణం నడుపుతున్న ఓ వ్యక్తి తెలిపారు. దిల్లీలోని ఎర్రకోట సమీపంలో సోమవారం సాయంత్రం జరిగిన కారు పేలుడులో ఇప్పటివరకు 12 మంది మృతి చెందిన విషయం తెలిసిందే.



## వీధి వ్యాపారి కుమారుడు.. సీఏ పాసయ్యాడు

ఆసన్‌సోల్: రేకుల ఇల్లు.. వర్షం పడితే ఇంట్లో నీళ్లు.. వీధి వీధి తిరుగుతూ దుస్తుల విక్రయం.. చాలీచాలనీ ఆదాయం.. ఇదీ పశ్చిమ బెంగాల్ సీతారామ్‌పుర్‌కు చెందిన దుర్గేశ్ ప్రసాద్ దుస్థితి. పేదరికం వెక్కిరిస్తున్నా.. అతడి ముగ్గురు పిల్లలు మాత్రం రత్నాలు! తండ్రి కష్టాలను కళ్లారా చూసిన పెద్ద కుమారుడు ఆదర్శ్ ప్రసాద్.. చదువుల్లో రాణించి ఇటీవల సీఏ పాస్ కావడం విశేషం. దీంతో తమ కష్టాలు గట్టెక్కినట్లేనని దుర్గేశ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదర్శ్ మొదటి నుంచి చురుకైన విద్యార్థి. అతడి ప్రతిభను గమనించి ఉపాధ్యాయులు ఉచితంగానే ట్యూషన్ చెప్పేవారు. తన కుమారుడి చదువులకు ఏ లోటూ లేకుండా దుర్గేశ్ కష్టపడ్డారు. సీఏ ప్రిపరేషన్ సమయంలో దాతలూ అండగా నిలిచారు. వారిని ఆదర్శ్ నిరాశపర్చలేదు. ఎన్ని ఇక్కట్లు ఎదురైనప్పటికీ.. నాన్న తన వెన్నంటే ఉన్నారని గుర్తుచేసుకున్నాడు. దుర్గేశ్ మిగతా ఇద్దరు పిల్లలూ కోల్‌కతాలో అకౌంటెన్సీ చదువుతుండటం గమనార్హం.

## దిల్లీ పేలుడు ఘటన.. కిరాతక ఉగ్ర ఘాతుకం

**: కేంద్ర కేబినెట్**

దిల్లీ కారు పేలుడు ఘటన నేపథ్యంలో ప్రధాని మోదీ నేతృత్వంలో కేంద్ర కేబినెట్ ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించింది. దర్యాప్తు కొనసాగుతున్న తీరు, భద్రతా చర్యలు, ఆయా సంస్థల మధ్య సమన్వయంపై దృష్టి సారించినట్లు సమాచారం. ఈ సందర్భంగా ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపంగా రెండు నిమిషాల పాటు కేంద్ర కేబినెట్ మౌనం పాటించింది. ప్రధాని నివాసంలో జరిగిన ఈ సమీక్షా సమావేశంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, తదితరులు పాల్గొన్నారు.

*** ఉగ్రవాదంపై పోరు కొనసాగుతుంది..**

దిల్లీ పేలుడు ఘటనను ఖండించిన కేంద్ర కేబినెట్.. ఇది కిరాతక ఉగ్ర ఘాతుకంగా పేర్కొంది. ఉగ్రవాదంపై పోరు కొనసాగించాలని నిర్ణయించింది. ఈ ఘటనకు కారకులైన వారిని చట్టం ముందు నిలబెడతామని ఉద్ఘాటించింది. ఇందుకు సంబంధించిన తీర్మానాన్ని కేంద్ర కేబినెట్ ఆమోదించినట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు.

*** ఎగుమతి ప్రోత్సాహకం కోసం..**

ఎగుమతి ప్రోత్సాహక మిషన్‌కు



కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ భేటీలో దీనికి ఆమోద ముద్ర వేసింది. దీని ద్వారా ఆరేళ్లపాటు రూ.25,060 కోట్లు కేటాయించనున్నారు. ఎగుమతుల ఎకో సిస్టమ్ బలోపేతానికే ఈ మిషన్‌ను తీసుకొచ్చారు. ఎగుమతిదారుల కోసం క్రెడిట్ గ్యారంటీ పథకం విస్తరణకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది.





## దిల్లీ పేలుడు ఘటన..
# మరో కారు స్వాధీనం

దిల్లీ పేలుడు ఘటన దర్యాప్తులో కొత్త విషయాలు వెలుగు చూస్తున్నాయి. ఎర్రకోట పార్కింగ్ సమీపంలో పేలిపోయిన ఐ20 కారు నడిపిన నిందితుడి పేరుతో మరో కారు ఉన్నట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఎరుపు రంగు ఫోర్డ్ ఎకోస్పోర్ట్ కారు (DL 10CK0458) కోసం ముమ్మర గాలింపు చేపట్టిన పోలీసులు.. చివరకు హరియాణాలోని ఓ గ్రామంలో స్వాధీనం చేసుకున్నారు. ఉమర్ నబీ పేరుతో మరో కారు ఉన్నట్లు గుర్తించిన పోలీసులు.. అది ఎక్కడుందో కనిపెట్టేందుకు ముమ్మర గాలింపు చేపట్టారు. హరియాణా, ఉత్తర్ ప్రదేశ్ పోలీసులను అప్రమత్తం చేశారు. అన్ని పోలీస్ స్టేషన్లు, సరిహద్దు చెక్‌పోస్టులను అప్రమత్తం చేశారు. ఈ ఎరుపు రంగు కారును గుర్తించేందుకు ఐదు బృందాలను రంగంలోకి దించి సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. వాహన నంబరు, ఇతర వివరాలను కూడా విస్తృతంగా ప్రచారం చేశారు. చివరకు హరియాణా ఫరీదాబాద్ జిల్లాలోని ఖాండవాలీ గ్రామంలో గుర్తించిన పోలీసులు దాన్ని స్వాధీనం చేసుకున్నారు.

## ఇండిగో విమానాలకు
# బాంబు బెదిరింపు..ఆ ఎయిర్‌పోర్ట్‌లలో భద్రత పెంపు


దేశవ్యాప్తంగా పలు ఇండిగో విమానాలకు బాంబు బెదిరింపులు కలకలం సృష్టించాయి. బుధవారం గురుగ్రామ్‌లోని ఇండిగో ప్రధాన కార్యాలయానికి దుండగులు బాంబు బెదిరింపు మెయిళ్లు పంపారు. అందులో దిల్లీ, కోల్‌కతా, తిరువనంతపురం నుంచి నడుస్తున్న పలు విమానాల్లో బాంబు అమర్చినట్లు బెదిరింపులు వచ్చాయి. వెంటనే అప్రమత్తమైన ఎయిర్‌లైన్స్ అధికారులు ఆయా విమానాశ్రయాల అధికారులను అలర్ట్ చేశారు. 186 మంది ప్రయాణికులతో కోల్‌కతా నుంచి ముంబయికి వెళ్లనున్న ఇండిగో విమానంలో బాంబు పెట్టినట్లు బెదిరింపు రావడంతో ప్రయాణికులను కిందకు దించేసి, విమానాన్ని ఐసోలేషన్ బేకు




తరలించినట్లు అధికారులు పేర్కొన్నారు. దిల్లీ, తిరువనంతపురం విమానాశ్రయాల్లో భద్రతా చర్యలను కట్టుదిట్టం చేసినట్లు తెలుస్తోంది. బాంబు స్క్వాడ్ బృందాలతో ఇండిగో విమానాల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టామన్నారు. తాజాగా దేశరాజధానిలో పేలుడు సంభవించడంతో దిల్లీ విమానాశ్రయంలో భారీ భద్రతను ఏర్పాటు చేసినట్లు ఎయిర్‌పోర్టు అధికారులు పేర్కొన్నారు. బెదిరింపు మెయిళ్లు పంపిన వారిని గుర్తించడానికి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

## ఎర్రకోట పేలుడు ఘటన..
# అల్‌ఫలాహ్‌లో వైద్యుడు మిస్సింగ్..?

ఎర్రకోట పేలుడు ఘటన తర్వాత హరియాణాలో ఫరీదాబాద్‌లోని అల్ ఫలాహ్ యూనివర్సిటీ వార్తల్లో నిలిచింది. ఇప్పుడు ఆ విద్యాసంస్థకు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ నిసార్ ఉల్ హసన్ కనిపించకుండాపోయాడు. గతంలో అతడిపై ఉగ్ర ఆరోపణలు ఉండటం గమనార్హం. జాతీయ మీడియా కథనాల ప్రకారం.. దిల్లీ పేలుడు తర్వాత అల్‌ఫలాహ్ యూనివర్సిటీలో దర్యాప్తు అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. పలువురిని ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ విద్యాసంస్థలో నిసార్ పనిచేస్తున్నట్లు గుర్తించారని తెలుస్తోంది. 2023లో అతడిని లెఫ్టినెంట్ గవర్నర్ ఉద్యోగం నుంచి తొలగించారు. అప్పుడు అతడు కశ్మీర్‌లోని ఎస్‌ఎంహెచ్‌ఎస్ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసేవాడు. ఉగ్రమురాలతో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలతో ఆర్టికల్ 311(2)(C) కింద




ఉద్యోగం నుంచి తీసేశారు. భద్రతకు సంబంధించిన కేసుల్లో శాఖాపరమైన విచారణ లేకుండానే సదరు ఉద్యోగిని విధుల నుంచి తప్పించేందుకు ప్రభుత్వానికి వీలు ఉంటుంది. ఆ తర్వాత అతడికి యూనివర్సిటీలో మెడిసిన్ విభాగంలో ప్రొఫెసర్‌గా ఉద్యోగం లభించినట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇక నవంబర్ 10 పేలుడు తర్వాత అతడు కనిపించకుండా పోయాడని అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం అతడి జాడ కోసం గాలిస్తున్నారు.

## ఆ కథనాలు బాధించాయి.. పేలుడు నిందితులతో సంబంధం లేదు

**: అల్ ఫలాహ్ విశ్వవిద్యాలయం**

దిల్లీ పేలుడు ఘటనతో హరియాణాలో ఫరీదాబాద్‌లోని అల్ ఫలాహ్ యూనివర్సిటీ పేరు మారుమోగింది. అక్కడ పని చేస్తోన్న వైద్యులు కీలక అనుమానితులుగా మారారు. దీనిపై యూనివర్సిటీ యాజమాన్యం స్పందించింది. ఈ దురదృష్టకర పరిణామాలు తమను బాధించాయని, తమ సంస్థ గురించి వస్తోన్న కథనాలను ఖండిస్తున్నామని ప్రకటన విడుదల చేసింది. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ భూపిందర్ కౌర్ ఆనంద్ పేరిట ఇది విడుదలైంది. ఆ వైద్యులకు తమతో వృత్తిపరమైన సంబంధం మాత్రమే ఉందని స్పష్టం చేసింది. “అల్‌ఫలాహ్ గ్రూప్ 1997 నుంచి వివిధ విద్యాసంస్థలను నిర్వహిస్తోంది. తర్వాత యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ దీనిని గుర్తించింది. 2019 నుంచి ఇక్కడ ఎంబీబీఎస్ కోర్సును నిర్వహిస్తున్నాం. మా సంస్థలో విద్యనభ్యసించి, పట్టభద్రులైన వారు భారత్, విదేశాల్లో ప్రముఖ ఆసుపత్రులు, సంస్థల్లో బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నారు. ప్రస్తుతం జరుగుతోన్న దురదృష్టకర పరిణామాలు మమ్మల్ని బాధించాయి . వాటిని మేం ఖండిస్తున్నాం. ఈ బాధాకర ఘటనలతో ప్రభావితమైన వారి గురించే మా ఆలోచనంతా. దర్యాప్తులో భాగంగా మా వద్ద పనిచేస్తోన్న ఇద్దరు వైద్యులను అదుపులోకి తీసుకున్నారని తెలిసింది. వృత్తిపరంగా తప్ప, వారికి విశ్వవిద్యాలయంతో ఎలాంటి సంబంధం లేదు. యూనివర్సిటీ ప్రతిష్ఠను దెబ్బతీసేలా కొన్ని ఆన్‌లైన్ సంస్థలు నిరాధార కథనాలు వ్యాప్తి చేయడంపై ఆందోళన చెందుతున్నాం.

## భాజపాలో జోష్.. 501 కిలోల లడ్డూల ఆర్డర్



హోరాహోరీగా సాగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఈ నెల 14న విడుదల కానున్నాయి. చాలావరకు ఎగ్జిట్ పోల్స్ ఎన్డీయే కూటమికే పట్టం కట్టాయి. దీంతో భాజపా శ్రేణుల్లో జోష్ నెలకొంది. ఫలితాల రోజు భారీఎత్తున వేడుకలు చేసుకునేందుకుగానూ ఇప్పటినుంచే సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే కాషాయ పార్టీ రాష్ట్ర రాజధాని పట్నాలో 501 కిలోల లడ్డూలను ఆర్డర్ చేసినట్లు సమాచారం. “ఫలితాల రోజు మేమంతా హోలీ, దసరా, దీపావళి, ఈద్ పండగలు చేసుకుంటాం. ఎందుకంటే.. ఓటర్లు ఎన్డీయే కూటమి అభివృద్ధికి జైకొట్టారు” అని ఓ భాజపా నేత ‘పీటీఐ’ వార్తాసంస్థకు తెలిపారు. గెలుపు సంబరాల్లో భాగంగా ప్రజలకు పంచేందుకుగానూ తమ పార్టీ ఇప్పటికే 501 కిలోల లడ్డూలను ఆర్డర్ చేసినట్లు వెల్లడించారు. పట్నాలోని ఓ లడ్డూ తయారీదారు ఈ విషయాన్ని ధ్రువీకరించారు. నవంబర్ 14 ఉదయానికి డెలివరీ చేస్తామని చెప్పారు. బిహార్‌లో ఈ నెల 6, 11వ తేదీల్లో రెండు దశల్లో పోలింగ్ నిర్వహించారు. 1951 తర్వాత రాష్ట్ర చరిత్రలోనే అత్యధికంగా దాదాపు 66.91 శాతం పోలింగ్ నమోదైంది. మంగళవారం పోలింగ్ ముగిసిన అనంతరం వివిధ సర్వే సంస్థల ఎగ్జిట్ పోల్స్ అన్నీ కూడా మళ్లీ ఎన్డీయేనే అధికారాన్ని చేజిక్కించుకోబోతోందన్న అంచనాలను వెల్లడించాయి. అయితే, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ వీటిని తోసిపుచ్చారు. భాజపా అధిష్ఠానం ఆదేశాల మేరకు సర్వే సంస్థలు నడుచుకున్నాయని ఆరోపించారు. గెలుపు తమదేనని ధీమా వ్యక్తం చేశారు.

# బిజినెస్
## BUSINESS

## భారీ లాభాల్లో సూచీలు..
# ఏమేం ముందుకు నడిపించాయి?



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా మూడో రోజూ లాభాల్లో ముగిశాయి. భారత్ అమెరికాతో త్వరలో వాణిజ్య ఒప్పందం కుదురుతుందన్న అంచనాలు మార్కెట్‌ను ముందుకు నడిపించాయి. త్వరలో వాణిజ్య ఒప్పందం కుదరబోతోందని, భారత్‌పై సుంకాలు తగ్గించనున్నామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఊతమిచ్చాయి. దీనికితోడు అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్ త్వరలో ముగియనుందన్న వార్తలూ కలిసొచ్చాయి. దేశీయంగా చూస్తే బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి ఎన్డీయే అధికారం చేపట్టబోతోందన్న ఎగ్జిట్‌పోల్స్ అంచనాలు జతకలిశాయి. ముఖ్యంగా ఐటీ, ఆటో స్టాక్స్‌లో కొనుగోళ్లు సూచీలకు కలిసొచ్చాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ దాదాపు 600 పాయింట్లు లాభపడింది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ ఒక్క సెషన్‌లో రూ.5 లక్షల కోట్లు పెరిగి రూ.473.6 లక్షలకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 84,238.86 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 83,871.32) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 84,652.01 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 595.19 పాయింట్ల లాభంతో 84,466.51 వద్ద ముగిసింది. నిఫ్టీ 180.85 పాయింట్ల లాభంతో 25,875.80 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 88.64గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఏషియన్ పెయింట్స్, టెక్ మహీంద్రా, టీసీఎస్, బజాజ్ ఫిన్‌సర్వ్, అదానీ పోర్ట్స్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. టాటా స్టీల్, టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్, టాటా మోటార్స్ కమర్షియల్ వెహికల్స్, బీఈఎల్, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 64.60 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4123 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.



## ఐపీఎల్ వేలం..
# ఆటగాళ్ల ట్రేడ్ రూల్స్ తెలుసా?

ఐపీఎల్ 2026 మినీ వేలం సందడి మొదలైంది. ఈ సారి కూడా విదేశాల్లో ఆక్షన్ ఉంటుందని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. అబుదాబిలో డిసెంబర్ 15 లేదా 16న వేలం ప్రక్రియ ఉండొచ్చు. 2023లో దుబాయ్‌లో, 2024లో జెడ్డాలో వేలం జరిగిన సంగతి తెలిసిందే. కొన్ని రోజుల నుంచి ప్రచారం జరుగుతున్నట్లుగానే రాజస్థాన్ రాయల్స్ నుంచి కెప్టెన్ సంజు శాంసన్ వీడటం ఖాయమైంది. రాజస్థాన్ అతడిని సీఎస్కేకు ట్రేడ్ చేస్తోంది. బదులుగా ఆల్‌రౌండర్లు రవీంద్ర జడేజా, సామ్ కరన్‌లను రాజస్థాన్ పొందనుంది. ఈ నేపథ్యంలో ఐపీఎల్‌లో ఆటగాళ్ల ట్రేడ్ రూల్స్ ఎలా ఉన్నాయి, ఈ ప్రక్రియ ఎలా సాగుతుంది అనే విషయాలను తెలుసుకుందాం.

>> ఒక సీజన్ ముగిసిన నెలరోజుల తర్వాత ఐపీఎల్ ట్రేడ్ విండో (ఆటగాళ్లను మార్చుకునేందుకు వీలు) మొదలవుతుంది. ఇది తదుపరి వేలం వారం ముందు వరకు కొనసాగుతుంది.

>> ట్రేడ్ విండో రెండు ఆప్షన్లు ఉంటాయి. ఒకటి (ప్లేయర్ ఫర్ క్యాష్) ఆటగాడిని ఇచ్చి డబ్బు పొందడం. మరోటి ప్లేయర్ టూ ప్లేయర్ (ఒక ఆటగాడిని మరొక ప్లేయర్‌ని తీసుకోవడం).

>> జట్టు వారు పొందాలనుకునే ఆటగాడి కోసం బీసీసీఐకి ఆసక్తి వ్యక్తీకరణ (EOI)ని పంపాలి. ఆటగాడిని అమ్మే టీమ్ ప్రతిస్పందించడానికి 48 గంటల సమయం ఉంది.

>> ఆటగాడు కొత్త జట్టులో చేరడానికి సుముఖతను వ్యక్తం చేస్తూ సమ్మతి పత్రంపై సంతకం చేసిన తర్వాతే ప్లేయర్ ట్రేడ్ ప్రక్రియ మొదలవుతుంది.

>> ఆటగాడి కోసం కొత్త ఫ్రాంఛైజీ ప్రస్తుతం ఉన్న ధర కంటే ఎక్కువ చెల్లించడానికి ముందుకు వస్తే ఆ మొత్తాన్ని ప్లేయర్, అమ్మే టీమ్ పంచుకుంటాయి.

>> ఎంతమంది ఆటగాళ్లనైనా ఫ్రాంఛైజీలు ట్రేడ్ చేసుకోవచ్చు. ఇందుకు ఎలాంటి పరిమితి లేదు.

>> ఫ్రాంఛైజీలు ట్రేడ్ చేసే ప్లేయర్లు కచ్చితంగా ఫిట్‌గా ఉండటంతో పాటు మ్యాచ్ ఆడేందుకు రెడీగా ఉండాలి.


>> ఆటగాళ్ల ట్రేడ్‌లో ఏవైనా అవకతవకలు జరిగినట్లు బీసీసీఐ గుర్తిస్తే ఆ ట్రేడ్‌ని రద్దు చేసే అధికారం బోర్డుకు ఉంది.



## 28% ప్రీమియంతో
# టాటా మోటార్స్ కమర్షియల్ వెహికల్స్ ఎంట్రీ

దిల్లీ: టాటా మోటార్స్ కమర్షియల్ వెహికల్స్ షేర్లు బుధవారం శుభారంభం చేశాయి. టాటా మోటార్స్ తన పాసింజర్, కమర్షియల్ వాహన విభాగాలను విభజించిన నేపథ్యంలో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీలో 28 శాతం ప్రీమియంతో కమర్షియల్ వాహన విభాగం ఎంట్రీ ఇచ్చింది. డిస్కవర్ ప్రైస్‌తో పోలిస్తే 28.48 శాతం ప్రీమియంతో రూ.335 వద్ద షేర్లు లిస్టయ్యాయి. బీఎస్ఈలో 26.09 శాతం ప్రీమియంతో రూ.330.25 వద్ద లిస్ట్ అయ్యాయి. ఎన్ఎస్ఈలో కంపెనీ మార్కెట్ విలువ రూ.1.22 లక్షల కోట్లుగా తేలింది. టాటా మోటార్స్ 2024లోనే తన ఆటోమొబైల్ విభాగాన్ని రెండు వేర్వేరు సంస్థలుగా డీమెర్జ్ చేస్తున్నట్లు ప్రకటించింది. కమర్షియల్ వాహన వ్యాపారం, దానికి సంబంధించిన పెట్టుబడులు ఒక కంపెనీగా; ప్రయాణికుల వాహనాలు, ఎలక్ట్రిక్ వాహనాలు, జాగ్వార్ ల్యాండ్‌రోవర్, వీటికి సంబంధించిన పెట్టుబడులను ఇంకో కంపెనీగా ఏర్పాటుచేసింది. ఈ డీమెర్జర్ ఈ ఏడాది అక్టోబర్ 1న అమల్లోకి వచ్చింది. అక్టోబర్ 14 నుంచి టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ విభాగం వేరేగా ట్రేడవుతోంది. షేర్ల విభజన తర్వాత అదేరోజు వాణిజ్య విభాగం స్టాక్ ప్రైస్ విలువను కనుగొనేందుకు ప్రత్యేక సెషన్‌ను నిర్వహించారు. అప్పట్లో కనుగొన్న ధరతో పోలిస్తే మంచి లాభంతో తాజాగా స్టాక్ ఎక్స్ఛేంజీల్లోకి ఎంట్రీ ఇచ్చింది. బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి ఎన్ఎస్ఈలో టీఎంసీవీ షేర్లు రూ.321 వద్ద ట్రేడవుతుండగా.. టీఎంపీవీ షేర్లు 404.45 వద్ద కొనసాగుతున్నాయి.

## మోర్నీ మోర్కెల్ ఇప్పుడు మన శత్రువు
### : దక్షిణాఫ్రికా మాజీ చమత్కారం



భారత్, దక్షిణాఫ్రికా మధ్య నవంబర్ 14 నుంచి రెండు టెస్టుల సిరీస్ ప్రారంభంకానుంది. తొలి మ్యాచ్ కోల్‌కతాలో, రెండో మ్యాచ్ గువాహటిలో జరగనుంది. ప్రస్తుతం ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ విజేతగా ఉన్న సఫారీలు భారత గడ్డపై సత్తాచాటాలని చూస్తున్నారు. బ్యాటింగ్, బౌలింగ్ పరంగా ఆ జట్టు బలంగానే కనిపిస్తోంది. ముంబయిలో బుధవారం జరిగిన SA20 ఇండియా డే కార్యక్రమంలో భారత్‌తో సిరీస్ గురించి దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ గ్రేమ్ స్మిత్ మాట్లాడాడు. పేసర్లు కగిసో రబాడ, మార్కో యాన్సెన్, ఆల్‌రౌండర్ కోర్బిన్ బాష్‌లకుతోడు కేశవ్ మహరాజ్, సేనురన్ ముత్తుస్వామి స్పిన్ ద్వయం భారత బ్యాటర్లకు సవాలు విసురుతుందని పేర్కొన్నాడు. 'ఈడెన్ గార్డెన్స్ మంచి గ్రౌండ్. అక్కడ సిరీస్ ప్రారంభంకానుంది. మా జట్టులో ఉన్న ఇద్దరు ప్రధాన స్పిన్నర్లు కేశవ్ మహరాజ్, ముత్తుస్వామి ఎంతో టాలెంటెడ్.


## ఐసీసీ ర్యాంకింగ్స్..
### టాప్5లోకి విరాట్ కోహ్లీ

ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ టాప్5లోకి దూసుకొచ్చాడు. కోహ్లీ (725) రెండు స్థానాలు మెరుగై ఐదో ర్యాంక్‌కు చేరుకున్నాడు. ఇప్పటివరకు ఐదో స్థానంలో ఉన్న బాబర్ అజామ్ (709) ఏడో ర్యాంక్‌కు పడిపోయాడు. రోహిత్ శర్మ (781) అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. హిట్‌మ్యాన్ అక్టోబర్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన సిరీస్‌లో రాణించిన సంగతి తెలిసిందే. వన్డేల్లో బౌలింగ్ ర్యాంకింగ్స్ విషయానికొస్తే కుల్‌దీప్ యాదవ్ ఒక్కడే టాప్ 10లో ఉన్నాడు. అతను 634 పాయింట్లతో ఆరో స్థానంలో కొనసాగుతున్నాడు. అఫ్గాన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ అగ్రస్థానంలో ఉన్నాడు.




# బరువు తగ్గించే వెగోవీ ధరను 37%తగ్గించిన నోవో నార్డిస్క్

బరువు తగ్గించేందుకు ఉపయోగించే వెగోవీ ఔషధ ధరను దేశంలో తగ్గిస్తున్నట్లు డెన్మార్క్ ఫార్మాస్యూటికల్ దిగ్గజం నోవో నార్డిస్క్ ప్రకటించింది. దీర్ఘకాలం పాటు ఒబెసిటీతో బాధపడుతున్న అన్నివర్గాల ప్రజలకు ఈ ఔషధాన్ని అందుబాటులో ఉంచాలన్న ఉద్దేశంతో దీని ధరను తగ్గిస్తున్నట్లు కంపెనీ పేర్కొంది. వెగోవీ ధరను 37 శాతం తగ్గించింది. దీంతో వెగోవీ (0.25ఎంజీ) డోసు కోసం వారానికయ్యే ఖర్చు రూ.2712కు దిగి వచ్చింది. ప్రజల ఆరోగ్య సంరక్షణకు తమ కంపెనీ ప్రథమ ప్రాధాన్యమని ఈ సందర్భంగా కంపెనీ తెలిపింది. నోవో నార్డిస్క్ తన వెగోవీ బ్రాండు ప్రీఫిల్డ్ పెన్ ఇంజెక్షన్‌ను ఈ ఏడాది జూన్‌లో మనదేశంలో విడుదల చేసింది. 0.25 ఎంజీ, 0.5 ఎంజీ, 1 ఎంజీ, 1.7 ఎంజీ, 2.4 ఎంజీ డోసుల్లో తీసుకొచ్చింది. విడుదల సమయంలో 2.4 ఎంజీ వెగోవీ ఔషధం ధర నెలకు రూ.24,389.06 ఉండగా.. తాజా సవరణతో రూ.16,400కు దిగొచ్చింది. లో డోసేజ్ కలిగిన ప్యాక్ ధర నెల ప్యాక్ ధర రూ.16,260.94 నుంచి రూ.10,850కి తగ్గింది. మన దేశంలోనూ స్థూల కాయం ఇటీవల కాలంలో పెద్ద సమస్యగా మారుతోంది. పిల్లల




నుంచి పెద్దల వరకు.. స్థూల కాయంతో సతమతమవుతున్న వారి సంఖ్య బాగా పెరుగుతోంది. ఆహారపు అలవాట్లు, జీవనశైలి, ఒత్తిళ్లు తదితర పరిస్థితులు దీనికి కారణం. దీంతో బరువు తగ్గించే ఔషధానికి గిరాకీ ఏర్పడిందది. ఈ క్రమంలోనే దేశ పరిస్థితులను గమనించిన బహుళ జాతి ఫార్మా కంపెనీలు తమ ఉత్పత్తులను దేశీయంగా విడుదల చేశాయి. అమెరికా ఫార్మా దిగ్గజమైన ఎలీ లిల్లీ అండ్ కంపెనీ ఎంతో ఆదరణ ఉన్న తన 'మౌంజారో' బ్రాండు ఔషధాన్ని ఈ ఏడాది మార్చిలో మన దేశంలో విడుదల చేయగా..

నోవో నార్డిస్క్ ఈ ఏడాది జూన్‌లో మార్కెట్‌లోకి ప్రవేశించింది.

# సినిమా

# షార్ట్ బ్రేక్!

మెగాస్టార్ చిరంజీవి నట వారసుడిగా 'చిరుత' మూవీతో హీరోగా ఎంట్రీ ఇచ్చిన రామ్‌చరణ్ ఒక్కో మెట్టూ ఎదుగుతూ ఇప్పుడు గ్లోబల్ స్టార్ అయ్యాడు. ప్రస్తుతం ఆయన నటిస్తున్న పెద్ది సినిమా భారీ అంచనాలు సెట్ చేస్తోంది. హీరో పుట్టిన రోజు సందర్భంగా వచ్చే ఏడాది మార్చి 27న ఈ మూవీ రిలీజ్ కానుంది. దీని తర్వాత సుకుమార్ దర్శకత్వంలో చరణ్ నటించాల్సి ఉంది. దీంతో పాటు మరికొన్ని కథలు విన్నాడని, వాటన్నింటినీ లైన్‌లో పెట్టబోతున్నాడని టాక్ వినిపించింది. ముఖ్యంగా సందీప్‌రెడ్డి వంగాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడని ప్రచారం జరిగింది. అయితే తాజా సమాచారం ప్రకారం పెద్ది షూటింగ్ పూర్తి కాగానే కొద్ది నెలల పాటు సినిమాలకు ఆయన దూరంగా ఉండనున్నట్లు సమాచారం. చరణ్ భార్య ఉపాసన ప్రస్తుతం గర్భవతిగా ఉన్న సంగతి తెలిసిందే. వారికి కవల పిల్లలు పుట్టబోతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే డెలివరీ సమయంలో భార్య పక్కనే ఉంటూ పుట్టబోయే పిల్లల కోసం కొంత సమయం కేటాయించాలని చరణ్ నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. గతంలో క్లీంకార పుట్టినప్పుడు కూడా చరణ్ ఇలాగే సినిమాలకు గ్యాప్ తీసుకున్నాడు.





# వింటేజ్ లుక్

ప్రస్తుతం సౌత్ ఇండస్ట్రీలో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్స్‌లో రుక్మిణి వసంత్ ఒకరు. 'సప్త సాగరాలు దాటి' సినిమాతో భారీ హిట్ అందుకున్న ఈ బ్యూటీ.. ఆ తర్వాత వరుస అవకాశాలు అందుకుంటూ స్టార్‌డమ్ సంపాదించుకుంది. ఇటీవలే కాంతార చాప్టర్ 1 మూవీతోనూ మరో హిట్టు ఖాతాలో వేసుకున్న ఈ అందాల భామ.. ఇప్పుడు 'డ్రాగన్' చిత్రంలో నటిస్తోంది. యంగ్ టైగర్ ఎన్టీఆర్, డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబోలో వస్తున్న ఈ ప్రాజెక్ట్ పై భారీ హైప్ నెలకొంది. మరోవైపు ప్రముఖ సంగీత దర్శకుడు విద్యాసాగర్ కొడుకుతో కలిసి ఓ సినిమాలో రుక్మిణి నటించనున్నట్లు తెలుస్తోంది. ఇక సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే ఈ వయ్యారి ఎప్పటికప్పుడు సరికొత్త పిక్స్ షేర్‌చేస్తుంటుంది. తాజాగా ఈ బ్యూటీ ఓ అద్భుతమైన స్టైల్ స్టేట్‌మెంట్ ఇచ్చింది. పర్పుల్ రంగు పట్టు చీరలో వింటేజ్‌లుక్‌లో అదరగొట్టింది. డీప్ వైలెట్ రంగు ఫ్యాబ్రిక్‌పై మృదువైన బంగారు జరీ డిజైన్, క్లాసిక్ కట్ బ్లౌజ్ తో రుక్మిణి అందాన్ని మరింత ఎలివేట్‌చేశాయి. ఇన్‌స్టా వేదికగా షేర్‌చేసిన ఈ ఫొటోస్ ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయ్.



# న్యూ చాప్టర్ బిగిన్స్







అనారోగ్యం, ఇతర వ్యక్తిగత కారణాలతో కొంతకాలం సినిమాలకు బ్రేక్ ఇచ్చిన స్టార్ హీరోయిన్ సమంత.. ఇప్పుడు మళ్లీ పూర్తి స్థాయిలో ప్రొఫెషనల్ లైఫ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. వరుసగా మూవీలకు సైన్ చేస్తూ, నిర్మాతగా కూడా కొత్త అవకాశాలను అందిపుచ్చుకుంటుంది. అయితే ఈ మధ్యన సినిమాల కంటే ఇతర విషయాలతోనే ఎక్కువగా వార్తల్లో నిలుస్తోంది సామ్. ముఖ్యంగా బాలీవుడ్ దర్శకుడు రాజ్ నిడుమోరుతో ప్రేమలో ఉందని వార్తలు గుప్పుమంటున్నాయి. అయితే దీనిపై ఒక్కసారి కూడా ఈ అమ్మడు అధికారికంగా ప్రకటించలేదు. మరోవైపు ఈ ప్రచారం కొనసాగుతుండగానే సోషల్ మీడియాలో ఒక ఆసక్తికర పోస్ట్ పెట్టింది సామ్. తాజాగా 'ట్రూలీ. స్మా' అనే పేరుతో మరో క్లాథింగ్ బిజినెస్ ప్రారంభించింది. ఇందుకు సంబంధించిన ఒక వీడియోని ఇన్ స్టా గ్రామ్ లో షేర్ చేసింది. దీనికి 'న్యూ చాప్టర్ బిగిన్స్' అంటూ క్రేజీ క్యాప్షన్ ఇచ్చింది. సమంత షేర్ చేసిన ఈ పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. దీనిని చూసిన సినీ ప్రముఖులు, అభిమానులు, నెటిజన్లు ఆమెకు ఆల్ ది బెస్ట్ చెబుతున్నారు. 'సామ్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా కూడా సక్సెస్ అవ్వాలి', 'ట్రూలీ సమంత స్టైల్ ఎప్పుడూ యూనిక్‌గానే ఉంటుంది' అంటూ కామెంట్లు పెడ్తున్నారు. కాగా ఇప్పటికే 'సాకీ' పేరుతో క్లాథింగ్ బ్రాండ్ విజయవంతంగా నడుపుతున్న సమంత, ఇటీవలే పెర్ఫ్యూమ్ బిజినెస్‌లోనూ అడుగు పెట్టిన సంగతి తెలిసిందే.

# అసలు 'శివ'లో కథ ఉందా

## తనికెళ్ల భరణి కామెంట్.. ఆ కారణంతో ప్రాజెక్ట్ నుంచి ఔట్!





తెలుగు సినీ చరిత్రలో 'శివ' ఒక కల్ట్ క్లాసిక్. ఓ ట్రెండ్ సెట్టర్. రాంగోపాల్‌వర్మ దర్శకత్వంలో నాగార్జున కథానాయకుడిగా నటించిన ఈ చిత్రం అత్యాధునిక హంగులతో, 4కె విజువల్స్‌తో నవంబరు 14న ఈ మూవీ మరోసారి ప్రేక్షకులకు ముందుకు రానుంది. ఈ మూవీకి స్క్రిప్ట్ రచయితగా తనికెళ్ల భరణి పనిచేసిన సంగతి తెలిసిందే. అంతేకాదు, ఓ కీలక పాత్రలోనూ నటించారు. అయితే, సినిమా ప్రకటించిన సమయంలో తనికెళ్ల భరణి పేరు వేయలేదు. అప్పుడు ఏం జరిగింది? వర్మ ఎందుకలా చేశారు? ఈ ఆసక్తికర విషయాలు మీకోసం.. ''శివ' మూవీకి సంబంధించిన సన్నివేశాలు, సంఘటనలు చెప్పి స్క్రిప్ట్ రాయమని వర్మ చెప్పారు. అప్పుడు ఆయన దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా కృష్ణవంశీ పనిచేస్తున్నారు. నేను రాసిన స్క్రిప్ట్ చూసి పడి పడి నవ్వుకున్నారు. ఆ తర్వాత అదే స్క్రిప్ట్‌ను వర్మకు వినిపిస్తే, 'ఏంటి ఇన్ని జోకులున్నాయి' అని అడిగారు. 'కాలేజ్ కదా..! ఇలాగే ఉంటాయి' అని అన్నాను. 'సినిమాలో ఒక్క జోకు కూడా ఉండటానికి వీల్లేదు' అని కరాఖండీగా చెప్పారు. 'ఆహా..! ఇక ఇది ఆడే సినిమానే అని మనసులో అనుకుని, మొత్తం తీసేసి మామూలుగా మార్చేశా'. కెమెరామెన్ ఎస్.గోపాల్‌రెడ్డి సహా సినిమా యూనిట్ మొత్తానికి వర్మపై ఏ మాత్రం నమ్మకం కలగలేదు. కానీ, ఒకే ఒక్కడే నమ్మాడు. అది నాగార్జున''. ''ఆయన చెప్పిన మార్పులు చేసి స్క్రిప్ట్‌ను వర్మకు ఇవ్వాలి. నాకు కుదరక నా మిత్రుడు సీవీఎల్ నరసింహారావు చేతికి దాన్ని ఇచ్చి, అన్నపూర్ణ స్టూడియోస్‌లో ఇవ్వమని చెప్పా. ఆ తర్వాత మళ్లీ వర్మ నుంచి నాకు ఫోన్ రాలేదు. స్క్రిప్ట్ బాగుందేమో అనుకున్నా. ఈలోగా మూవీ ప్రకటన కూడా చేశారు. నా పేరు వేయలేదు. 'ఇదేంటి కష్టపడి రాస్తే ఇలా చేశారు' అనుకున్నా. కానీ, వర్మతో సినిమా చేసిన ఎవరూ క్రెడిట్ తీసుకోలేరు. అన్నీ అతడే చెప్పేస్తాడు. ఒకరోజు కోడైరెక్టర్ నాగేశ్వరరావు ఫోన్ చేసి, 'సినిమా మొదలవుతోంది. నువ్వు రాలేదు' అని అడిగారు. నేను జరిగింది అంతా చెప్పాను. 'ఆయన ఎందుకో నీపై అలిగారు. ఒకసారి ఫోన్ చేసి మాట్లాడు' అని నాగేశ్వరరావు సలహా చెప్పారు. నేనే స్వయంగా వర్మకు ఫోన్ చేశా. 'భరణి.. ఏంటి చాలా రోజుల తర్వాత ఫోన్ చేశావు. శివ కాస్ట్యూమ్స్ కొనడానికి మద్రాస్ వచ్చాను. మీ ఇంటికి వస్తాను ఓకేనా' అన్నారు. సాయంత్రం 5గంటలకు వర్మ ఇంటికి వచ్చారు. ''భరణి.. సినిమా నుంచి నిన్ను ఎందుకు తీసేశానో తెలుసా. ఏ మూవీకైనా స్క్రిప్ట్ అనేది గాడ్.. దాన్ని ఎవరికో ఇచ్చి పంపుతావా? అది నీ మొదటి తప్పు' అని అన్నారు. నేను సారీ చెప్పా. 'ఈ కథను నువ్వు స్రవంతి రవి కిషోర్‌కు ఎందుకు చెప్పావు' అని ప్రశ్నించారు. అది కరెక్ట్ కాదని చెప్పా. 'ఒకచోట కథ రాసి, మరొకచోట చెప్పి ఇండస్ట్రీలో బతకగలనా? అసలు మన సినిమాలో కథ ఉందా' అని అన్నాను. వెంటనే వర్మ నవ్వేశారు. నా వెనుక ఓ క్యాలెండర్‌పై శ్రీదేవి ఫొటో కనిపించింది 'ఈవిడతో సినిమా తీయాలి' అని అన్నారు. 'సరే ఆమెతో ఎప్పుడైనా తీయండి. నా పరిస్థితి ఏంటి'అని అడిగా. 'ఎల్లుండి హైదరాబాద్ వచ్చేయ్. మాట్లాడుకుందాం' అన్నారు. ఆ తర్వాత జరిగింది అంతా మీకు తెలుసు. వర్మకు ఎవరి మీదా కోపం, ప్రేమ ఏమీ ఉండవు. అసలతను ఏవీ పెద్దగా గుర్తుంచుకోరు'' అని 'శివ' అనుభవాలను తనికెళ్ల భరణి ఓ సందర్భంలో గుర్తు చేసుకున్నారు.

# గోల్డెన్ బ్లూమ్ బ్రైడ్

## : ఆషికా రంగనాథ్ పెర్ల్‌డ్రాప్డ్ మ్యాజిక్

**ఆషికా రంగనాథ్ ఎంబ్రాయిడరీ చేసిన స్ట్రాప్‌లెస్ గౌనులో సూర్యకాంతి తేనెలా మెరుస్తోంది, ఆమె డెకోలేటేజ్‌పై వికసించిన క్లిష్టమైన బంగారు పూలతో ఆమె సొగసైన అప్‌డో నుండి తెల్లటి దంతపు దుపట్టా జాలువారుతుంది, ఉదయపు మంచులా కాంతిని ఆకర్షించే ముత్యాలతో భద్రపరచబడింది. ఒక చేయి ఆమె గొంతును సున్నితంగా తాకుతుంది, వేళ్లు వెండి ఉంగరంతో అలంకరించబడ్డాయి, ఆమె మృదువైన చిరునవ్వు మరియు కోహ్ల్-లైన్డ్ కళ్ళు మ్యూట్ బ్యాక్‌డ్రాప్‌లో నిశ్శబ్ద రాజత్వాన్ని ప్రసరింపజేస్తాయి. కన్నడ మరియు తెలుగు సినిమాల్లో ఆషిక గొప్ప నటిగా స్థిరపడింది. ఆమె తదుపరి పెద్ద విడుదల గాథ వైభవ, ఇది సింపుల్ సుని దర్శకత్వం వహించిన ఒక రొమాంటిక్ డ్రామా. ఈ చిత్రం వేర్వేరు కాలాల్లో సెట్ చేయబడిన నాలుగు అనుసంధానించబడిన ప్రేమకథల ద్వారా భావోద్వేగ ప్రయాణాన్ని హామీ ఇస్తుంది.**





# నేను క్షేమంగానే ఉన్నా

## : నటుడు గోవిందా

తాను క్షేమంగానే ఉన్నానని బాలీవుడ్ ప్రముఖ నటుడు గోవిందా తెలిపారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ''నేను బాగానే ఉన్నా. వర్కౌట్లు ఎక్కువగా చేయడం వల్ల అలసిపోయా. వర్కౌట్ల కన్నా యోగా, ప్రాణాయామం లాంటివి ఆరోగ్యానికి మంచిది'' అని సూచించారు. తన జీవితంలో వాటికి ఎంత ప్రాధాన్యం ఉందో వివరించారు. ''గత నెల నుంచి గోవిందా చాలా బిజీగా ఉంటున్నారు. అందువల్ల ఇలా జరిగి ఉండొచ్చు. విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు ఆయనకు సూచించారు. క్షేమంగా ఇంటికి చేరుకున్నారు'' అని గోవిందా స్నేహితుడు, లాయర్ బిందాల్ తెలిపారు. మంగళవారం అర్ధరాత్రి స్పృహ కోల్పోయిన 61 ఏళ్ల గోవిందా.. జుహూలోని ఓ ఆస్పత్రిలో చేరిన సంగతి తెలిసిందే. కొన్ని గంటల చికిత్స అనంతరం డిశ్చార్జి అయ్యారు.

# తుక్కుగూడ పురపాలక సంఘానికి వండర్ లా సంస్థ నుండి విపత్తు నిర్వహణ వాహనం బహూకరణ

తుక్కుగూడ, మహేశ్వరం నవంబర్ 10 (భారత శక్తి ప్రతినిధి): తుక్కుగూడ పురపాలక సంఘం పరిధిలోని వండర్ లా అమ్యూజ్‌మెంట్ పార్క్ వారు తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా సోమవారం పురపాలక సంఘానికి విపత్తు నిర్వహణ వాహనంను అందజేశారు. సందర్భంగా పురపాలక సంఘం కమిషనర్ శ్రీమతి ఏ. వాణి మాట్లాడుతూ, ఈ వాహనం విపత్తు నిర్వహణ, భారీ వర్షాల సమయంలో అత్యవసర చర్యలు, పారిశుద్ధ్య




కార్యకలాపాలు వంటి సందర్భాల్లో పురపాలక సంఘానికి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రజా సేవల మెరుగుదలకు విలువైన సహకారం అందించిన వండర్ లా సంస్థ ప్రతినిధులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఓ మేనేజర్ డి. సౌమిక్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ మల్లేష్, పార్క్ హెడ్ మధుసూదన్, పార్క్ హెడ్ రాంబాబు, హె. చ. హెడ్ రతీష్ మౌళి, జి.ఆర్ ఎగ్జిక్యూటివ్స్ మధు, సత్యనారాయణ చారి, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ ప్రశాంత్ పాల్గొన్నారు.





# శాంతి భద్రతల సమస్య లేదు

* **బాధితులకు భరోసా ఇచ్చేందుకే కౌన్సిలింగ్ కేంద్రం**
* **రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి**

ఎల్బీనగర్, నవంబర్ 10 (భారత శక్తి): రాష్ట్రంలో ఎలాంటి శాంతి భద్రతల సమస్య లేదని, ప్రశాంత వాతావరణం నెలకొని ఉందని డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం సరూర్‌నగర్ డివిజన్ జింకల బావి కాలనీలోని మహిళా పోలీసు స్టేషన్ ఆవరణలో కొత్తగా ఏర్పాటు చేసిన పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్, భరోసా కేంద్రాలను రాచకొండ కమిషనర్ సుధీర్ బాబుతో కలిసి ఆయన ప్రారంభించారు. లైంగిక వేధింపులు, అత్యాచారాలు, గృహ హింస, ర్యాగింగ్, దూషణ, వంటి వాటికి గురైన బాధితులు ధైర్యంగా వచ్చి ఫిర్యాదు చేయడంతో పాటు కోర్టులో కేసు నిలబడే విధంగా చేసేందుకే ఈ భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ భరోసా కేంద్రంలో న్యాయవాదులు సహా వ్యక్తిత్వ వికాస నిపుణులు, కౌన్సిలర్లు సహాయ సహకారాలు అందజేయనున్నారని



చెప్పారు. ఉమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ ఉషారాణి మాట్లాడుతూ, బాధితులు నేరుగా వచ్చి ఫిర్యాదు చేయాలని, భరోసా కేంద్రం వీరికి అన్ని విధాలుగా సహకరిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీజీపీఐసీఎస్ ఎండీ ఎం.రమేష్, ఎల్బీనగర్ డీసీపీ బి.అనురాధ, ఉమెన్ సేఫ్టీ వింగ్ ఎస్పీ షైక్ సలీమా, ఏసీపీ పి.వెంకటేశ్వర్లు, ఇన్స్పెక్టర్లు ఎం.ముని, జి.అంజయ్య తదితర రాచకొండ పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కన్నుల పండుగగా శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం

ఎల్బీనగర్, నవంబర్ 10 (భారత శక్తి): సరూర్ నగర్ డివిజన్ లోని వెంకటేశ్వర కాలనీ, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో 41వ బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం శ్రీదేవి, భూదేవి సహిత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. వేద పండితులు నల్లాన్ చక్రవర్తుల లక్ష్మణ చారి, వంశీదరా చార్యులు, రామకృష్ణమా చార్యులు, ఎస్.శ్యాంసుందర్ ల వేదోచ్చరణల మధ్య స్వామి వారి కళ్యాణం కన్నుల పండుగగా జరిగింది. ఈ కార్యక్రమంలో హంపి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతి స్వామి విచ్చేసి అనుగ్రహ భాషణతో అనుగ్రహించారు. స్వామి వారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి విచ్చేశారు. దేవాలయ ప్రాంగణం మొత్తం భగవన్నామ స్మరణతో మారుమ్రోగింది. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులు ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ కమిటీ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకున్నారు. అంతకుముందు కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వామి వారికి పట్టు



వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కోరుపొలు భాస్కర్ రెడ్డి, కాలనీ అధ్యక్షుడు, ఆలయ మాజీ చైర్మన్ గండు ధనం రెడ్డి, ఆలయ ప్రధాన కార్యదర్శి మడకశిర శాంతిప్రసాద్, కోశాధికారి మురళీ కౌండిన్య, కమిటీ సభ్యులు విజయ్ కుమార్, శ్రీమన్నారాయణ, భోగేశ్వర్ రావు, సుబ్బారావు, సత్యనారాయణ మూర్తి, శ్రీనివాస్ రావు, ప్రతాప్ రెడ్డి, ఆలయ సభ్యులు రవీందర్ రావు, వీరేందర్ రెడ్డి, సుధాకర చారి, నరేష్ , యాదగిరి రెడ్డి, ఎం.ఎన్.రావు, పివిఎస్ ప్రసాద్, సాయి కృష్ణ, కాలనీ ప్రధాన కార్యదర్శి కనకరావు, ఉపాధ్యక్షుడు మారోజు శ్రీనివాస చారి, కోశాధికారి సాయికిరణ్, కృష్ణ మూర్తి, భక్తులు పాల్గొన్నారు.

# పార్కుల నామరూపాలు మార్చేస్తున్నారు

* **ఫెన్సింగ్ వేసి కాపాడాలంటూ విన్నపాలు**
* **హైడ్రా ప్రజావాణికి 47 ఫిర్యాదులు**

హైదరాబాద్, నవంబర్ 10, భారత శక్తి : పార్కుల నామరూపాలు లేకుండా చేస్తున్నారు. పార్కుల్లో ఆలయాలు నిర్మించేసి.. ఆ పక్కనే చిన్న మళ్లీలు ఏర్పాటు చేసి వ్యాపారాలు చేసుకుంటున్నారు. లే ఔట్‌లలో పార్కులకోసం కేటాయించిన స్థలాలన్నిటికీ ఫెన్సింగ్‌లు వేసి కాపాడాలంటూ పలువురు సోమవారం హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అలాగే ప్రభుత్వ స్థలాలకు కూడా కాపాడాలని కోరారు. అమీన్‌పూర్ పెద్దచెరువు, రావిర్యాల చెరువుల విస్తీర్ణం ఏటా పెరుగుతూ.. ఎగువ భాగంలో ఉన్న నివాసాలను ముంచెత్తుతున్నాయని ఆయా ప్రాంతాల వారు ఫిర్యాదు చేశారు. మూసేసిన తూములు తెరిపించడంతో పాటు.. అలుగు ఎత్తును కూడా తగ్గించాలని పలువురు కోరుతున్నారు. గతంలో వ్యవసాయ వినియోగం వల్ల నీటి నిలువలు తగ్గేవని.. ఇప్పుడు మురుగు నీటితో నిండి ఎగువున ఉన్న ప్రాంతాలు మునుగుతున్నాయని వాపోయారు. ఓల్డ్ అల్వాల్ సర్వే నంబరు 576లో క్వారీకోసం తవ్విన గుంతల్లో మురుగు నీరు చేరి పరిసరాలన్నీ దుర్గంధభరితంగా మారాయని గంగ అవెన్యూ రెసిడెంట్స్ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. ఈ గుంతలను మట్టితో పూడ్చి పార్కులుగా అభివృద్ధి చేయాలని కోరారు. ఇలా సోమవారం హైడ్రా ప్రజావాణికి మొత్తం 47 ఫిర్యాదులందాయి. వీటిని హైడ్రా అదనపు కమిషనర్ శ్రీ ఎన్ అశోక్ కుమార్‌గారు పరిశీలించి పరిష్కార బాధ్యతలను సంబంధిత అధికారులకు అప్పగించారు.



* **ఫిర్యాదులు ఇలా..**

>>మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అల్వాల్ మండలం మచ్చబొల్లారం గ్రామం సర్వే నంబరు 188లో 30 గుంటల ప్రభుత్వ భూమి కబ్జాకు గురౌతోందని బాలాజీ ఎన్‌క్లేవ్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. 60 కాలనీలలో 60 వేలకు పైగా ఇళ్లున్న ఈ ప్రాంతంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నిర్మించేందుకు ఈ భూమిని కేటాయించేలా సిఫారసు చేయాలని కోరారు. ప్రభుత్వ భూమి కబ్జా కాకుండా చూడాలని కోరారు.

>>సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పెద్ద చెరువు విస్తీర్ణం ఏటా పెరిగిపోయి ఎగువున ఉన్న తమ ప్లాట్లు మునిగిపోయాయని పలువురు ఫిర్యాదు చేశారు. గతంలో తూముల ద్వారా కిందకు నీరు వెళ్లేదని.. ఇప్పుడు వాటిని పూర్తిగా బంద్ చేయడంతో మురుగు, వర్షం నీరంతా చెరువులోకి చేరుతోందని పేర్కొన్నారు. అలుగు ఎత్తును కూడా పెంచేయడంతో మరింత ఇబ్బంది తలెత్తిందని వాపోయారు. అలుగు ఎత్తు తగ్గించినా తమకు ప్రయోజనం కలుగుతుందని చెరువు పైభాగంలో ఉన్న పలు లే ఔట్‌లలోని ప్లాట్ యజమానులు తెలిపారు. గతంలో వేసిన రహదారులు, విద్యుత్ స్తంభాలు నీట మునిగినట్టు స్పష్టంగా కనబడుతున్నాయని ఈ విషయంలో ప్రభుత్వం సరైన విధానాన్ని పాటించి చెరువు వాస్తవ విస్తీర్ణం నిర్ణయించాలని 7 కోరారు. ఇదే పరిస్థితి రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలోని రావిర్యాల విలేజ్‌లో కూడా ఉందని అక్కడ నివాసితులు ఫిర్యాదు చేశారు.

>>రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం రావిర్యాల విలేజ్‌లో తెలంగాణ హౌసింగ్ బోర్డు కాలనీలో ఖాళీ స్థలాలు మాయమౌతున్నాయని అక్కడి నివాసితులు ఫిర్యాదు చేశారు. 545 ప్లాట్లతో ఉన్న ఈ లే ఔట్‌లో ఉన్న ఖాళీ స్థలాలు కబ్జాలకు గురి అవుతున్నాయి. పార్కుల్లో మందిరాలు కడుతున్నారు. షెడ్డులు వేసి అద్దెలకు ఇస్తున్నారు. రోడ్లు బ్లాక్ చేసి ఇష్టానుసారం ఖాళీ స్థలాలు కాజేస్తున్నారని ఫిర్యాదు చేశారు.

>>ముషీరాబాద్ నియోజకవర్గం పరిధిలోని బాగ్‌లింగంపల్లి డివిజన్ హౌసింగ్ బోర్డు కాలనీలో పిల్లల పార్కు కబ్జాకు గురైంది. 1300ల గజాల స్థలంలో స్టీల్, ఐరన్ దుకాణాలు, సర్వీసింగ్ సెంటర్లు పెట్టి వ్యాపారం చేసుకుంటున్నారని.. ఈ కబ్జాలను తొలగించాలని హౌసింగ్ బోర్డు, జీహెచ్ ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని అక్కడి నివాసితులు వాపోయారు. వ్యాపార దందాలు ఆపి.. పార్కును కాపాడాలని హైడ్రాకు విన్నవించారు.

# చట్టం ముందు అందరూ సమానమే



* **నిరుపేదలకు కూడా న్యాయ సహాయం అందాలి**
* **జాతీయ న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా... ప్రముఖ న్యాయవాది... కిక్కర గోపి శంకర్ యాదవ్ .**

ఎల్బీనగర్, నవంబర్ 10 (భారత శక్తి): ప్రతీ సంవత్సరం నవంబర్ 9 వ తేదీ నాడు జాతీయ లీగల్ ఎయిడ్ డే జరుపుకుంటారని. దీని ద్వారా సమాజంలో మారు మూల ప్రాంతాలలో జీవిస్తున్న బడుగు, బలహీన వర్గాలకు న్యాయం సమానంగా అందేలా చూడటం వారి హక్కులు ఎలా వినియోగించుకోవాలి, ఎవరికి సంప్రదించాలి, సలహాలు ఏ విధంగా తీసుకోవాలి అనే అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారని ప్రముఖ న్యాయవాది, కౌన్సిలింగ్ సైకాలజిస్ట్, హయత్ నగర్ కోర్ట్ బార్ అసోసియేషన్ సభ్యుడు కిక్కర గోపీ శంకర్ యాదవ్ తెలిపారు. అనేక సంవత్సరాలు నుండి న్యాయ స్థానాల్లో మగ్గి పోతున్న ఎన్నో కేసులు లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకునే.. ఉత్తమమైన మార్గం ఉందని, రాజీ పడటం ద్వారా ఇరువర్గాలు గెలిచినట్లే అని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్రం అన్ని జిల్లాలో 400 కు పై చిలుకు ఉచిత న్యాయ అవగాహన సదస్సులు నిర్వహించినట్లు చెప్పారు.

# గణేష్ మహారాజ్ దర్శనం కోసం పాదయాత్ర

ఎల్బీనగర్, నవంబర్ 10 (భారత శక్తి): దైవ దర్శనం కోసమే కుమారుడితో కలిసి 140 కిలోమీటర్లు పాదయాత్ర చేసి దేవుడిని దర్శించుకున్న భక్తులు. సరూర్ నగర్ డివిజన్ జింకల బావి కాలనీ నివాసి ప్రైవేట్ ఉద్యోగి సంతోష్ భాల్కి తన కుమారుడు లక్కీతో కలిసి దైవ దర్శనం కోసం జహీరాబాద్ దగ్గర ఉన్న రేజింతల్ గ్రామంలోని గణేష్ మహారాజ్ దేవాలయానికి సుమారు 140 కిలోమీటర్లు 3 రోజులు, 2 రాత్రులు నడుచుకుంటూ వెళ్లి దైవ దర్శనం చేసుకున్నారు. అనంతరం నిన్నరాత్రి నగరానికి చేరుకున్న వారికి కుటుంబ సభ్యులు, కాలనీ వాసులు ఘనంగా స్వాగతం పలికారు.



# అనాథ గృహ విద్యార్థులకు రూ.55 వేల రేషన్ విరాళం

ఎల్బీనగర్, నవంబర్ 10 (భారత శక్తి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమరావతి అసెంబ్లీలో జాయింట్ సెక్రటరిగా పనిచేస్తున్న పివి సుబ్బారెడ్డి సోమవారం ఎల్బీనగర్ లోని అనాథ గృహ విద్యార్థులకు నవంబర్ నెల రేషన్ కు రూ.55 వేల రేషన్ ను విరాళంగా అందచేశారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ, గత రెండు దశాబ్దాలుగా ప్రతి నెలా కొంత



డబ్బును, అనాథ విద్యార్థి గృహానికి ఒక నెల రేషన్ కోసం రూ. 50 వేల ఇస్తున్నానని, గృహ విద్యార్థులు చాలా కష్టపడి చదువుతూ ఉన్నతస్థాయిలకు చేరుకోవాలని, ఈ సంవత్సరం కూడా గృహ కమిటీకి సహకరించాలని రూ. 55 వేల రేషన్ బియ్యం, పప్పులు, ఆయిల్స్, షుగర్, శానిటరీ ఐటమ్స్ ఇంకా అవసరమైన సరుకులను నవంబర్ నెల కోసం పంపించామని తెలిపారు. గృహ విద్యార్థుల అత్యవసరమైన రేషన్ కొరకు రూ.55 వేల రూపాయల రేషన్ ను విరాళంగా ఇచ్చిన పివి సుబ్బారెడ్డికి, గృహ అధ్యక్షులు మార్గం రాజేష్, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

# భూటాన్ నుంచి నేరుగా ఆసుపత్రికి ప్రధాని మోదీ... ఎర్రకోట పేలుడు బాధితులకు పరామర్శ

ఢిల్లీ, నవంబర్ 12 (భారత శక్తి): భూటాన్ పర్యటన ముగించుకుని నేడు దేశానికి తిరిగి వచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, విమానాశ్రయం నుంచి నేరుగా ఢిల్లీలోని లోక్‌నాయక్ జై ప్రకాశ్ నారాయణ్ ఆసుపత్రికి వెళ్లారు. ఎర్రకోట వద్ద జరిగిన కారు బాంబు పేలుడులో గాయపడి అక్కడ చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. రెండు రోజుల భూటాన్ పర్యటన అనంతరం మధ్యాహ్నం ఢిల్లీకి చేరుకున్న ప్రధాని, ఆసుపత్రిలో బాధితులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఘటనకు సంబంధించిన వివరాలను, బాధితులకు అందుతున్న వైద్యాన్ని గురించి వైద్యులు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు భూటాన్ పర్యటనలో ఉండగానే ప్రధాని మోదీ ఢిల్లీ పేలుడు ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిపై అత్యంత కఠినమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. "ఢిల్లీలో ఒక విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఆప్తులను కోల్పోయిన కుటుంబాల బాధను నేను అర్థం చేసుకోగలను. ఎంతో భారమైన హృదయంతో ఇక్కడికి వచ్చాను. ఈ దుఃఖ సమయంలో దేశం మొత్తం బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తుంది. మన ఏజెన్సీలు ఈ ఘటనపై సమగ్రంగా దర్యాప్తు చేస్తాయి. బాధ్యులైన వారందరినీ చట్టం ముందు నిలబెడతాం" అని భూటాన్ రాజధాని థింపులో ప్రధాని వ్యాఖ్యానించారు.

**దర్యాప్తు ముమ్మరం చేసిన ఎన్ఐఏ**

మరోవైపు, ఎర్రకోట మెట్రో స్టేషన్ సమీపంలో జరిగిన ఈ పేలుడు ఘటన దర్యాప్తును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ముమ్మరం చేసింది. కేసు విచారణ కోసం 10 మంది అధికారులతో కూడిన ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. ఎన్ఐఏ ఏడీజీ విజయ్ సఖారే నేతృత్వంలోని ఈ బృందంలో ఒక ఐజీ, ఇద్దరు డీఐజీలు, ముగ్గురు ఎస్పీలు, మిగిలిన వారు డీఎస్పీ స్థాయి అధికారులు ఉన్నారని అధికార వర్గాలు బుధవారం తెలిపాయి. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ మంగళవారం ఈ కేసు దర్యాప్తు బాధ్యతలను ఎన్ఐఏకి అప్పగించిన విషయం తెలిసిందే. కేంద్ర హోంమంత్రి అమిత్ షా మంగళవారం ఉన్నతస్థాయి భద్రతాధికారులతో సమావేశమై దర్యాప్తు పురోగతిని సమీక్షించారు. కుట్ర వెనుక ఉన్న సూత్రధారులను వీలైనంత త్వరగా పట్టుకోవాలని కఠిన ఆదేశాలు జారీ చేశారు. "దోషులను పట్టుకోవడంలో ఏ ఒక్క అంశాన్నీ విడిచిపెట్టం" అని ఆయన స్పష్టం చేశారు. ఎన్ఐఏ, ఐబీ, ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ కలిసికట్టుగా పనిచేయాలని ఆదేశించారు. ఇది గరిష్ఠ నష్టం కలిగించే లక్ష్యంతో జరిపిన ఆత్మాహుతి దాడి అయి ఉండవచ్చని దర్యాప్తు సంస్థలు అనుమానిస్తున్నాయి. వెయ్యికి పైగా సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నామని, సోషల్ మీడియా కార్యకలాపాలను కూడా పర్యవేక్షిస్తున్నామని ఢిల్లీ పోలీసు వర్గాలు తెలిపాయి. పేలుడు జరిగిన ప్రాంతంలోని మొబైల్ ఫోన్ డంప్ డేటాను సేకరించి విశ్లేషిస్తున్నారు. ఈ ఘటన నేపథ్యంలో ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, బీహార్, ముంబై నగరాల్లో హై అలర్ట్ ప్రకటించారు. రద్దీగా ఉండే ప్రాంతాలు, ప్రార్థనా స్థలాల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు.

## తెలంగాణ కేబినెట్ సమావేశం వాయిదా..

హైదరాబాద్, నవంబర్ 12 (భారత శక్తి): తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం మరోసారి వాయిదా పడింది. ఈరోజు జరగాల్సి ఉన్న ఈ భేటీని ఈ నెల 15వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ఈ కేబినెట్ భేటీలో ప్రధానంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, బీసీ రిజర్వేషన్ల ఖరారు వంటి అంశాలపై ప్రభుత్వం ఒక స్పష్టమైన నిర్ణయానికి రానుంది. ఈ సమావేశానికి మంత్రులతో పాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు కూడా హాజరుకానున్నారు. వాస్తవానికి ఈ కేబినెట్ సమావేశం తొలుత నవంబర్ 7వ తేదీన జరగాల్సి ఉండగా, దానిని 12వ తేదీకి మార్చారు. ఇప్పుడు తాజాగా మరోసారి వాయిదా వేసి 15వ తేదీన నిర్వహించాలని నిర్ణయించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితం వెలువడిన మరుసటి రోజే మంత్రివర్గ సమావేశం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే భేటీ తేదీని మార్చినట్లు సమాచారం.

## ఢిల్లీలో కారు బాంబు పేలుడు..
## హైదరాబాద్‌లో కొనసాగుతున్న తనిఖీలు

హైదరాబాద్, నవంబర్ 12 (భారత శక్తి): దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో రెండు రోజుల క్రితం కారు బాంబు పేలుడు సంభవించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో హైఅలర్ట్ కొనసాగుతోంది. నగరంలోని మూడు కమిషనరేట్ల (హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ) పరిధిలో డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్ బృందాలు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నాయి. దేశంలో ఎక్కడ దాడులు జరిగినా, ఏ రాష్ట్రంలో ఉగ్రకుట్రలు భగ్నమైనా వాటి మూలాలు హైదరాబాద్‌లో వెలుగుచూస్తున్నాయి. రాజధానిలో విధ్వంస చర్యలు తగ్గినప్పటికీ, ఎన్ఐఏ, ఇతర రాష్ట్రాల పోలీసుల సోదాల్లో నగరానికి చెందిన వ్యక్తులు పట్టుబడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. తాజాగా గుజరాత్ ఏటీఎస్ పోలీసులు ముగ్గురిని అరెస్టు చేశారు. వారిలో రాజేంద్రనగర్‌కు చెందిన డాక్టర్ అహ్మద్ మోహియుద్దీన్ సయ్యద్ కూడా ఉన్నాడు.

## డీజీపీకి కేటీఆర్ క్షమాపణ చెప్పాలి

హైదరాబాద్, నవంబర్ 12 (భారత శక్తి): తెలంగాణ రాష్ట్ర డీజీపీని ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం ఖండించింది. డీజీపీ శివధర్ రెడ్డిపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు సరికాదని సంఘం పేర్కొంది. గతంలో ఎన్నడూ లేనంత అప్రమత్తతతో పోలీసు వ్యవస్థ పనిచేస్తోందని తెలిపింది. రాష్ట్ర పోలీసు విభాగం చట్టానికి, ప్రజలకు ప్రాధాన్యతనిస్తోందని స్పష్టం చేసింది. పోలీసు శాఖ నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తిస్తోందని సంఘం పేర్కొంది. కేటీఆర్ ప్రస్తావించిన అన్ని ఘటనల్లో చట్ట ప్రకారం, నిష్పక్షపాతంగానే కేసులు నమోదు చేసినట్లు పోలీసు అధికారుల సంఘం తెలిపింది. డీజీపీని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలను కేటీఆర్ ఉపసంహరించుకుని, పత్రికా ముఖంగా క్షమాపణ కోరాలని డిమాండ్ చేసింది. సంస్కారయుతంగా, సభ్యతతో ప్రశ్నించాలని గుర్తు చేస్తున్నట్లు పేర్కొంది. పోలీసు శాఖకు పింక్, రెడ్ బుక్ అంటూ ఏమీ లేవని, తమకు ఉన్నదల్లా పోలీసు బుక్ మాత్రమేనని, చట్ట ప్రకారం నడుచుకోవడమే తమ విధి అని డీజీపీ శివధర్ రెడ్డి ఇటీవల అన్నారు. డీజీపీ చేసిన వ్యాఖ్యలను విమర్శిస్తూ, కేటీఆర్ ఉపయోగించిన భాషపై రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం అభ్యంతరం వ్యక్తం చేసింది.

## అలాంటి వాహనాలపై
## భారీగా పెనాల్టీ వేయండి

హైదరాబాద్, నవంబర్ 12 (భారత శక్తి): రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనాలపై భారీగా పెనాల్టీ విధించాలని స్పష్టం చేశారు. ఓవర్ లోడింగ్ వాహనాలు సీజ్ అయ్యేలా కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. బుధవారం ఆయన రవాణా శాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రవాణా శాఖలో ఎన్‌ఫోర్స్‌మెంట్ నిరంతరం ఉండేలా ప్రణాళికను రూపొందించుకుని, దానిని నిక్కచ్చిగా అమలు చేయాలని అన్నారు. రాష్ట్రస్థాయిలో 3 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రోడ్ సేఫ్టీ మంత్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. మహిళా ఆటోలకు అనుమతులు ఇచ్చేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఆయన అన్నారు.

## నల్గొండ జిల్లాలో అటవీ అధికారులపై గ్రామస్థుల దాడి..
## ఆరుగురికి గాయాలు

హైదరాబాద్, నవంబర్ 12 (భారత శక్తి): దేవరకొండ: నల్గొండ జిల్లా చందంపేట మండలం గువ్వలగుట్ట వద్ద ఫారెస్ట్ అధికారులపై గ్రామస్థులు దాడి చేశారు. గువ్వలగుట్ట వద్ద అటవీశాఖకు చెందిన భూములను గ్రామస్థులు దున్నుకుంటున్నారనే సమాచారంతో అధికారులు బుధవారం సాయంత్రం అక్కడికి వెళ్లారు. పట్టా కాగితాలు చూపించి దున్నుకోవాలని స్పష్టం చేశారు. దీంతో ఆగ్రహించిన గ్రామస్థులు.. అటవీ అధికారులు, సిబ్బందిపై రాళ్లు, కర్రలతో దాడికి పాల్పడ్డారు.



గ్రామస్థుల దాడిలో ఆరుగురు అటవీ సిబ్బందికి తీవ్ర గాయాలు కావడంతో దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## గృహ నిర్మాణ రంగాన్ని
# కుక్కలు చింపిన విస్తరిలా తయారు చేశారు

అమరావతి, నవంబర్ 12 (భారత శక్తి): రాష్ట్రంలో 2029 నాటికి ఇల్లు లేని నిరుపేద అనేవారే ఉండకూడదని, ప్రతి ఒక్కరికీ సొంతిల్లు నిర్మించి ఇవ్వడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఇల్లు అంటే కేవలం నాలుగు గోడలు కాదని, అదొక గౌరవం, భద్రత, భవిష్యత్తుకు చిరునామా అని ఆయన అభివర్ణించారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో బుధవారం జరిగిన ప్రజావేదిక సభలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయించిన అనంతరం ఏర్పాటు చేసిన ఈ సభలో ఆయన కీలక ప్రకటనలు చేశారు.

**గత పాలనపై తీవ్ర విమర్శలు**

గత ఐదేళ్ల పాలనలో గృహ నిర్మాణ రంగాన్ని కుక్కలు చింపిన విస్తరిలా తయారు చేశారని చంద్రబాబు తీవ్రస్థాయిలో విమర్శించారు. పేదలకు ఇళ్లు కట్టిస్తామని చెప్పి మాట నిలబెట్టుకోలేకపోగా, కనీసం మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేదని ఆరోపించారు. "తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం వరకు దేశంలో ఏ ప్రభుత్వం కూడా పేదలకు పక్కా ఇళ్లు కట్టించలేదు. గుడిసెలు గాలొస్తే కొట్టుకుపోయేవి. కానీ పేదవాడికి పక్కా ఇల్లు ఉండాలని ఆలోచించిన మహానుభావుడు ఎన్టీఆర్. కూడు, గూడు, గుడ్డ నినాదంతోనే టీడీపీ పుట్టింది. మేం 201419 మధ్య 8 లక్షల ఇళ్లు కట్టిస్తే, గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 4.73 లక్షల ఇళ్లను రద్దు చేసింది. సొంతంగా ఇల్లు కట్టుకున్న 2.73 లక్షల మందికి ఇవ్వాల్సిన రూ.900 కోట్లు ఎగ్గొట్టారు. ఆ బకాయిలను మా ప్రభుత్వం చెల్లిస్తుంది" అని హామీ ఇచ్చారు. పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు తాము ఇస్తే, గత పాలకులు పట్టణాల్లో సెంటు, గ్రామాల్లో సెంటున్నర స్థలం ఇచ్చి చేతులు దులుపుకున్నారని, అవి కూడా ఊరికి దూరంగా కొండలు, గుట్టల్లో ఇచ్చి చదును పేరుతో కోట్లు దోచుకున్నారని ధ్వజమెత్తారు. పేదలకు ఉచితంగా ఇవ్వాల్సిన ఇసుకను కూడా పందికొక్కుల్లా తిన్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

**ప్రతి ఇంటి నుంచి పారిశ్రామికవేత్త రావాలి**

ప్రజలు ఉద్యోగాలు చేసే స్థాయి నుంచి ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. "ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త తయారు కావాలి. నిన్న కనిగిరిలో ఎంఎస్ఎంఈ పార్కులు ప్రారంభించాం. ప్రతి నియోజకవర్గంలోనూ వీటిని ఏర్పాటు చేసి మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతాం. రాష్ట్రంలో డ్వాక్రా మహిళలు రూ.50 వేల కోట్లు రుణాలు తీసుకుని బాధ్యతగా చెల్లిస్తున్నారు. దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్నారు. వారికి అన్ని విధాలా శిక్షణ ఇప్పించి వ్యాపారవేత్తలుగా మారుస్తాం" అని భరోసా ఇచ్చారు.

*** ముస్లింలకు అదనపు సాయం.. కీలక ప్రకటనలు**

గృహ నిర్మాణ లబ్ధిదారులకు చంద్రబాబు పలు వరాలు ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం పట్టణాల్లో రూ.2.5 లక్షలు, గ్రామాల్లో రూ.2 లక్షలు ఇస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం తరఫున బీసీ, ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు అదనంగా ఇస్తున్నామని గుర్తుచేశారు. ఇకపై బీసీలు, ఎస్సీలతో సమానంగా ముస్లిం మైనారిటీలకు కూడా గృహ నిర్మాణానికి రూ.50 వేలు అదనంగా అందిస్తామని ప్రకటించారు. దీనివల్ల ఆర్థిక స్తోమత లేక ఇళ్ల నిర్మాణాలు నిలిపివేసిన దాదాపు 6 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని, ప్రభుత్వానికి రూ.3,220 కోట్ల భారం పడుతుందని వివరించారు.

*** ఆధునిక సౌకర్యాలతో ఇళ్లు.. భవిష్యత్ ప్రణాళిక**

భవిష్యత్తులో నిర్మించే ఇళ్లను ఆధునిక సౌకర్యాలతో అందిస్తామని చంద్రబాబు తెలిపారు. "ప్రతి ఇంటికీ సోలార్ విద్యుత్ ఏర్పాటు చేస్తాం. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా, బీసీలకు సబ్సిడీపై సోలార్ ప్యానెళ్లు అందిస్తాం. దీనివల్ల విద్యుత్ వినియోగదారులే ఉత్పత్తిదారులుగా మారతారు. ప్రతి ఇంటికీ ఇంటర్నెట్ సౌకర్యం కల్పిస్తాం. నా తల్లి పడ్డ కష్టాలు చూసే దీపం పథకం పెట్టాను. ఇప్పుడు 'దీపం 2.0' కింద ఏటా మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం" అని పేర్కొన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ కుళాయి నీరు అందిస్తామని, పులివెందులతో సహా రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ తాగునీరు ఇచ్చే బాధ్యత తమదని స్పష్టం చేశారు. ఉగాది నాటికి మరో 5.9 లక్షల గృహప్రవేశాలు చేయిస్తామని, ఇల్లు లేని అర్హులందరినీ గుర్తించి స్థలాలు కేటాయిస్తామని తెలిపారు. ఉమ్మడి కుటుంబాలను ప్రోత్సహిస్తామని, పట్టణాల్లో అపార్ట్‌మెంట్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


## ఢిల్లీ పేలుడు ఘటన... కేంద్రంపై నిప్పులు చెరిగిన ఖర్గే

హైదరాబాద్, నవంబర్ 12 (భారత శక్తి): ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు పేలుడు ఘటనపై కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఇది ప్రభుత్వ భద్రతా వైఫల్యమేనని, జాతీయ రాజధానిలో పాలన పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు. ఈ ఘటనపై తక్షణమే సమగ్ర దర్యాప్తు జరిపి, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సోమవారం జరిగిన ఈ దుర్ఘటనపై ఖర్గే మీడియాతో మాట్లాడుతూ, "బాంబు పేలుడుపై పూర్తిస్థాయి విచారణ జరగాలి. నేరం చేసిన వారికి భయం పుట్టేలా శిక్షలు ఉండాలి. ఎవరికీ మినహాయింపు ఇవ్వకూడదు" అని స్పష్టం చేశారు. జాతీయ రాజధానిలో ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ), సీబీఐ వంటి ఎన్నో కీలక ఏజెన్సీలు ఉన్నప్పటికీ ఇలాంటి ఘటన జరగడం దురదృష్టకరమని, ఇది ప్రభుత్వ వైఫల్యాన్ని స్పష్టం చేస్తోందని విమర్శించారు. సోమవారం సాయంత్రం ఎర్రకోట మెట్రో స్టేషన్ గేట్ నంబర్ 1 వద్ద సిగ్నల్ దగ్గర ఆగి ఉన్న ఓ హ్యుందాయ్ ఐ20 కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగి పేలిపోయింది. ఈ దుర్ఘటనలో కనీసం 12 మంది మరణించగా, అనేక మంది తీవ్రంగా గాయపడ్డారు. పేలుడు తీవ్రతకు చుట్టుపక్కల ప్రాంతాలు దద్దరిల్లాయి. ఈ పేలుడుతో ఢిల్లీ వ్యాప్తంగా హై అలర్ట్ ప్రకటించారు. జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ), నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (ఎన్ఎస్జీ) వంటి ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి దర్యాప్తు ముమ్మరం చేశాయి. ప్రాథమికంగా ఇది 'ఫిదాయీ' (ఆత్మాహుతి) దాడి అయి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. కారు ఎక్కడి నుంచి వచ్చింది, పేలుడు పదార్థాలను ఎలా తరలించారు అనే కోణాల్లో విచారణ కొనసాగుతోంది. ఈ ఘటనపై పూర్తిస్థాయి నివేదిక వచ్చాక మరింత మాట్లాడతామని ఖర్గే తెలిపారు. డిసెంబర్ 1 నుంచి జరగనున్న పార్లమెంటు సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తి, ప్రభుత్వాన్ని నిలదీస్తామని ఆయన స్పష్టం చేశారు.

# కాళేశ్వరం పునరుద్ధరణకు కసరత్తు

**: మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి**

హైదరాబాద్, నవంబర్ 12 (భారత శక్తి): మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టల పునరుద్ధరణకు శాస్త్రీయ, సాంకేతిక విధానంలో కసరత్తు జరుగుతోందని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఆనకట్టల పునరుద్ధరణ సహా నీటిపారుదలశాఖకు సంబంధించిన వివిధ అంశాలపై ఉన్నతాధికారులు, ఇంజనీర్లతో మంత్రి సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. భారత రాష్ట్ర సమితి హయాంలో భారీ వ్యయంతో నిర్మించిన ఆనకట్టల పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. మేడిగడ్డ ఆనకట్ట దెబ్బతినడానికి.. అన్నారం, సుందిళ్ల ఆనకట్టలో లీకేజీలకు గల కారణాలు, వైఫల్యాలను విజిలెన్స్, ఎన్డీఎస్ఏ, జ్యుడీషియల్ కమిషన్ నివేదికలు పేర్కొన్నాయని తెలిపారు. డిజైన్లు నిర్మాణం నిర్వహణలో లోపాలు, సరైన నమూనా అధ్యయనాలు లేకపోవడాన్ని ఎన్డీఎస్ఏ నివేదిక ప్రధానంగా ప్రస్తావించిందని.. ఆర్థికపరమైన అవకతవకలు, ప్రణాళికాలోపాలను జ్యుడీషియల్ కమిషన్ పేర్కొందని తెలిపారు.



అవకతవకలు, నిర్లక్ష్యం వహించినందుకు కొందరు అధికారులు, ఏజెన్సీలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ సిఫారసు చేసిందని మంత్రి పేర్కొన్నారు. రాజకీయ పరంగా, ఇంజనీర్ల స్థాయిలోనూ లోపాలు ఉన్నాయన్న మంత్రి.. ఆనకట్టలను సాంకేతిక విధానంలో సరిచేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. సీడీఓ లోపాలను కూడా విచారణ సంస్థలు ఎత్తిచూపినందున నైపుణ్యం కలిగిన సాంకేతిక సంస్థలు, కన్సల్టెంట్ల సేవలు వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కన్సల్టెన్సీ సేవల కోసం పలు సంస్థలు ముందుకొచ్చాయని, 3 తుదిదశకు అర్హత సాధించాయన్న మంత్రి.. ఐఐటీ లాంటి సంస్థలతో కలిసి పనిచేసే వాటికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ సీడబ్ల్యూపీఆర్ఎస్ అవసరమైన పరీక్షలు చేస్తోందని, వరద ఉద్ధృతి తగ్గిన వెంటనే మరో 15, 20 రోజుల్లో జియోఫిజికల్, హైడ్రాలిక్ పరీక్షలు ప్రారంభమవుతాయని తెలిపారు.



# చైతన్యపురి పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ మోసాలపై అవగాహన

ఎల్బీనగర్, నవంబర్ 11 (భారత శక్తి): చైతన్యపురి పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆధ్వర్యంలో ఎల్బీనగర్ ఏసీపీ ఏ. కృష్ణయ్య ఇన్‌స్పెక్టర్ కె. సైదులు నిర్వహించిన సైబర్ క్రైమ్ అవగాహన సమావేశంలో ప్రజలకు సైబర్ మోసాలు, ఫేక్ ఖాతాలు, ఆన్‌లైన్ భద్రతపై జాగ్రత్తలు తీసుకోవడాన్ని వివరించారు.సందేహాస్పద లింకులు, మెసేజిలను క్లిక్ చేయకూడదని, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికి వివరించరాదని, పాస్ వర్డలను సురక్షితంగా ఉంచాలని, సోషల్ మీడియా అకౌంట్లను గోప్యతా సెట్టింగ్స్‌తో వాడాలని సూచించారు.ఏదైనా అనుమానాస్పద చర్యలు కనబడితే తన పరిధిలోని వెంటనే పోలీస్ స్టేషన్‌కు తెలియ జేయాలని కోరారు. అలాగే, పోలీస్ 100 అంక్షల సేవలను విలీనం చేసి అన్ని అత్యవసర సేవలకి 112 నంబర్‌ను నిర్వహిస్తున్నట్లు, ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో 112కి కాల్ చేయాలని అందరికీ తెలియజేశారు. సైబర్ నేరాల పెరుగుదల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉన్నట్లు ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య సూచించారు.

# సంధ్యా శ్రీధర్ రావుకు హైకోర్టులో చుక్కెదురు

- ఎఫ్‌సీఐ లే ఔట్‌లో రహదారుల పునరుద్ధరణకు ఆదేశం
- బాధితులకు అండగా ఉంటామని చెప్పిన హైకోర్టు
- హైడ్రాకు పలు సూచనలు చేసిన న్యాయమూర్తి



హైదరాబాద్, నవంబర్ 11(భారత శక్తి): గచ్చిబౌలిలోని ఫెర్టిలైజర్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎంప్లాయీస్ కోపరేటివ్ హౌసింగ్ సొసైటీ లే ఔట్‌లో సంధ్యా కన్వెన్షన్ యజమాని శ్రీధర్ రావు ఆక్రమణలను హైకోర్టు మంగళవారం తప్పు పట్టింది. రహదారులు ఆక్రమించి పలు నిర్మాణాలు చేపట్టడాన్ని సీరియస్‌గా పరిగణించింది. మొత్తం 20 ఎకరాల పరిధిలో వేసిన లేఔట్‌లో 162 వరకూ ప్లాట్లుండగా.. అందులోని మెజార్టీ ప్లాట్లు నావనే ఉద్దేశంతో రహదారులు, పార్కులు ఆక్రమిస్తే వ్యవస్థలు చూస్తూ ఊరుకోవని హెచ్చరించింది. హైడ్రా అందుకే ఆక్రమణలను తొలగించిందని పేర్కొంది. ఒకసారి లేఔట్ వేస్తే.. అదే కొనసాగుతుందని స్పష్టం చేసింది.సంధ్యా శ్రీధర్ రావు రహదారుల ఆక్రమణలను ఇటీవల హైడ్రా తొలగించిన విషయం విధితమే.ఈ విషయమై సంధ్యా శ్రీధర్ రావు హైకోర్టును ఆశ్రయించారు.మంగళవారం ఈ కేసు విచారణలో భాగంగా జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డిపై వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా బాధిత ప్లాట్ యజమానులు కూడా వారి గోడును హైకోర్టుకు విన్నవించుకున్నారు. లే ఔట్‌లో సరిహద్దులన్నీ చెరిపేసి ఇష్టానుసారం నిర్మాణాలు చేపడుతున్నారని సంధ్యా శ్రీధర్ రావుపై ఫిర్యాదు చేశారు. ఎక్కువ ప్లాట్లు కొని.. తమను భయపెట్టి మిగతావి కూడా సొంతం చేసుకోవాలని సంధ్యా శ్రీధర్ రావు ప్రయత్నించారని పేర్కొన్నారు.ఎక్కువ ప్లాట్లు తనవే ఉన్నాయని, లేఔట్‌లోని రహదారులు, ఆ పక్కనే ఉన్న తమ ప్లాట్లు, పార్కులు సరిహద్దులు పట్టించుకోకుండా నిర్మాణాలు చేపట్టారని హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇదేమని అడిగితే తమపై దాడి చేసేవారని తెలిపారు.

### హైడ్రాను ఆశ్రయించాం..

ఓ ప్లాట్ యజమానురాలిపై దాడి చేయడమే కాకుండా తప్పుడు కేసులు కూడా పెట్టారని సంధ్యా శ్రీధర్ రావుపై బాధితులు ఫిర్యాదు చేశారు. ఇందుకు గాను సంధ్య శ్రీధర్ రావుకు రూ. 10 లక్షలు సుప్రీంకోర్టు జరిమానా విధించిన విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. తమ ప్లాట్లు చూడడానికి కూడా వీలు లేకుండా చేశారని వాపోయారు. నేరుగా దాడులు చేసి భయభ్రాంతులకు గురి చేసిన సమయంలో తాము హైడ్రాను ఆశ్రయించామని బాధితులు తెలిపారు. హైడ్రా అధికారులు వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలించి రహదారుల ఆక్రమణలను నిర్ధారించాక చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. మమ్ములను పెట్టిన దారుణమైన ఇబ్బందులను కోర్టుకు విన్నవించుకోవడానికే తాము ఈ కేసులో ఇంప్లీడ్ అయ్యామని చెప్పారు.బాధితుల ఫిర్యాదులన్నీ విన్నాక జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి ఇప్పటికే రహదారుల పునరుద్ధరణకు తాము హైడ్రాకు సూచించామని బాధితులకు తెలిపారు. అందులోని ప్లాట్ల యజమానులకు అండగా హైకోర్టు ఉంటుందని ధైర్యం చెప్పారు.లేఔట్‌లోని రహదారులను, పార్కులను పునరుద్ధరించాలని హైడ్రాకు హైకోర్టు మరోసారి సూచించింది. ఫైనల్ హియరింగ్ కోసం ఈనెల 18 వ తేదీకి కేసును వాయిదా వేసింది.

# మల్లన్నకు ఎలక్షన్ కమిషన్ లో చుక్కెదురు

- ఇక నుండి టీఆర్పీ (TRP)పదాన్ని ఉపయోగించం.



హైదరాబాద్, నవంబర్ 11(భారత శక్తి) : తెలంగాణ రిపబ్లికన్ పార్టీ, టిఆర్పి TRP పదంతో 2018 నుండి పార్లమెంట్ ,అసెంబ్లీ ఎలక్షన్లో పోటీ చేసి ముందుకు సాగుతుంది. తెలంగాణ రాజ్యాధికార పార్టీతో తీన్మార్ మల్లన్న టిఆర్పి పదంతో ముందుకు వెళుతున్నారు దీనిపై అభ్యంతరం తెలుపుతూ తెలంగాణ రిపబ్లికన్ పార్టీ అధ్యక్షులు యదీశ్వర్ నక్క తెలంగాణ రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ కు గత నెల ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును పరిశీలించిన ఎలక్షన్ కమిషన్ తెలంగాణ రాజ్యాధికార పార్టీకి నోటీసులు పంపింది. నోటీసులకు స్పందించిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ జనరల్ సెక్రెటరీ ఈనెల టిఆర్పి అనే పదం వాడబోమని ఎలక్షన్ కమిషన్ కు అఫిడవిట్ సమర్పించారు. ఎలక్షన్ కమిషన్ సత్వరమే పరిష్కరించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ ఈ విషయాన్ని ఈరోజు తెలంగాణ రిపబ్లికన్ పార్టీ అధ్యక్షులు, సెక్రటరీ యాదీశ్వర్ నక్క, చెన్నోజు శ్రీనివాసులు మీడియాకు తెలియజేశారు.

# ఆదివాసి యువత గ్రామస్థాయిలోనే ఆగిపోకుండా ప్రపంచాన్ని చుట్టి రావాలి

- ఆదివాసి యువత సమ్మేళనంలో మధుయాష్కీ గౌడ్



హైదరాబాద్, నవంబర్ 11 (భారత శక్తి): ఆదివాసి గ్రామాల నుంచి వచ్చిన యువత తాము ఎంచుకున్న లక్ష్యం వైపు పట్టుదలతో కృషిచేసి.. ఉన్నత స్థానాలకు ఎదగాలని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ పేర్కొన్నారు.మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ సౌజన్యంతో మేరా యువభారత్ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు జరగనున్న 17వ ట్రైబల్ యూత్ ఎక్స్చేంజ్ ప్రోగ్రాంను (ఆదివాసి యువత సమ్మేళనం) కార్యక్రమం రాజేంద్రనగర్ లోని టీజీకాబ్ సీటీఐలో ప్రారంభమైంది. చత్తీస్గడ్, ఒడిస్సా, జార్ఖండ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఆదివాసి యువత హాజరయ్యారు.ఈ కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా హాజరైె సమ్మేళనాన్ని ప్రారంభించిన మధుయాష్కి గౌడ్ మాట్లాడుతూ, యువత ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్లు, లాయర్లు కావాలన్నా లక్ష్యాలే కాకుండా రాజకీయాల్లోనూ రావాలని సూచించారు. ఆదివాసి యువతకు రాజ్యాంగం రిజర్వేషన్ కల్పించిందని, మహిళలకు 33% రిజర్వేషన్ కూడా అమలు కానున్నాయని..గ్రామ సర్పంచ్ నుంచి ఎంపీ వరకు పోటీ చేసే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఇప్పటికీ చాలా ఆదివాసి గ్రామాలలో ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలలు, బస్సు, రోడ్డు సదుపాయాలు లేకపోవడం బాధాకరమన్నారు. దేశ నిర్మాణంలో ఆదివాసీల పాత్ర ఎంతో ఉందని, వారి శ్రమకు సరిపడా సంపద దక్కటం లేదన్నారు. సామాజిక ఆర్థిక, అసమానత నక్సలిజం వైపు ఆ ప్రాంతాల యువత వెళ్తున్నారన్నారు.అందుకే చత్తీస్గడ్, ఒడిస్సా, జార్ఖండ్ రాష్ట్రాలలో ఆదివాసీలకు సంపద లో వాటా దక్కాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఆదివాసి యువత గ్రామస్థాయిలోనే ఆగిపోకుండా... ప్రపంచాన్ని చుట్టి రావాలని, తమ ఎదుగుదలతో పాటు.. తాము పుట్టి పెరిగిన ప్రాంతాలని అన్ని రంగాలలో అభివృద్ధి వైపు నడిపించాలని సూచించారు. హైదరాబాద్ నగరంలో నడుస్తున్న ట్రైబల్ యూత్ ఎక్స్చేంజ్ ప్రోగ్రాంలో తమ అభిప్రాయాలను పంచుకోవాలని, కొత్త ఆవిష్కరణలతో తమ జీవితాలకు కొత్త బాటలు వేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అజయ్ మిశ్రా, మేరా యువ భరత్ స్టేట్ డైరెక్టర్ అన్షుమాన్ ప్రసాద్, రిటైర్డ్ డైరెక్టర్ పి. వైద్యనాథ్ రావు, హైదరాబాద్ డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ కుష్బూ గుప్తా, ఎన్ఎస్ఎస్ యూత్ ఆఫీసర్ సైదా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# మూడున్నర కిలోల గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ఎల్బీనగర్, నవంబర్ 11 (భారత శక్తి): గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన ఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సిఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం...విశ్వసనీయ సమాచారం మేరకు ఈ నెల 9 రాత్రి నాగోల్ చౌరాస్తా దగ్గర ఉన్న నిమంత్రన్ ప్యాలెస్ సమీపంలో అక్రమంగా గంజాయిని రవాణా చేస్తున్న యాదాద్రి భువనగిరి జిల్లా గోల్లేపల్లి గ్రామానికి చెందిన శ్యామల అరవింద్ ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అతని వద్ద నుండి 3 కిలోల 542 గ్రాముల గంజాయిని స్వాధీనపర్చుకున్నట్లు తెలిపారు. అనంతరం అరవింద్ తమతో తన కాలనీకి చెందిన వేణు అనే వ్యక్తి తన నలుగురు స్నేహితులతో కలిసి కిడ్నాప్ చేసి హయాత్ నగర్ లో తన స్నేహితుని ఇంట్లో అక్రమంగా నిర్బంధించారని తెలుపటంతో చైతన్యపురి పోలీస్ స్టేషన్ నందు అరవింద్ పై గంజాయి సెక్షన్ల క్రింద కేసు నమోదు చేయగా వేణు అతని నలుగురు స్నేహితులపై కిడ్నాపింగ్ సెక్షన్ల క్రింద కేసు నమోదు చేసినట్లు సిఐ సైదులు తెలిపారు. కేసు నమోదు చేసిన తర్వాత మా అదుపులో ఉన్న అరవింద్ ఈ నెల 10 రాత్రి 10 గంటల సమయంలో మరికొంత గంజాయి తన ఫ్రెండ్ చంటి వద్ద ఉందని అక్కడికి తనను తీసుకెళ్తే అతడిని చూపించి గంజాయితో సహా పట్టిస్తానని తెలిపాడని పేర్కొన్నారు. అక్కడికి వెళ్ళిన తర్వాత అరవింద్ స్నేహితుడు చంటి గంజాయితో పట్టుబడ్డాడని పంచనామా చేయడానికి ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు పంచులుగా అవసరం కావడంతో ఈ నెల 10 రాత్రి 10:30 గంటలకు అందుబాటులో ఉన్న కొత్తపేట్ ఫ్రూట్ మార్కెట్ దగ్గర గల ఎలక్ట్రిక్ సబ్ స్టేషన్ కు లిఖిత పూర్వక లేఖ పంపినట్లు తెలిపారు. అక్కడ సబ్ స్టేషన్ లో ఉన్న ఇద్దరు సిబ్బందికి తాము పంపిన లెటర్ పై అవగాహన లేకపోవటంతో మా సిబ్బందితో వాగ్వాదం పెట్టుకొని ఒకరినొకరు తోసుకోవటం జరిగిందన్నారు. ఈసంఘటనపై విచారణ చేస్తున్నట్లు, తప్పు ఎవరిదైనా, వారిపై చర్యలు తీసుకుంటామని సీఐ సైదులు తెలిపారు.

# ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు బిల్స్ రిలీజ్




హైదరాబాద్, నవంబర్ 11 (భారత శక్తి) ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు ఈ వారం బిల్స్ రిలీజ్ చేసినట్లు హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వారంలో రూ.202.90 కోట్లను విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఇండ్ల నిర్మాణ పనుల దశలను బట్టి విడుదల చేయాల్సిన బిల్లు మొత్తాలను ప్రతి సోమవారం లబ్దిదారుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తున్న సంగతి తెలిసిందే. ఆ ప్రక్రియలో భాగంగా ఈనెల 11వ తేదీ నాటికి పురోగతి సాధించిన మేరకు 18,247 మంది లబ్దిదారులకు బిల్లులను విడుదల చేసినట్లు తెలిపారు. ఈ వారం లబ్దిదారులకు చేసిన చెల్లింపుల్లో బేస్‌మెంట్ లెవల్ నిర్మాణాలు 4,615, రూఫ్ లెవల్ (గోడలు పూర్తి) అయినవి 8,517, శ్లాబ్ వేసిన 5,115 ఇండ్లు ఉన్నాయని వివరించారు.

### ఇంతవరకు రూ.2,900 కోట్ల చెల్లింపు

ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇంతవరకు మొత్తం రూ.2,900.35 కోట్లను చెల్లించినట్లు ఎండీ వీపీ గౌతం తెలిపారు. వీటిలో బేస్‌మెంట్ లెవల్ దాటిన ఇండ్లకు రూ.1,610.79 కోట్లు, రూఫ్ లెవల్ (ఆర్ఎల్) రూ.716.91 కోట్లు, రూఫ్ క్యాస్టెడ్ అయిన ఇండ్లకు రూ.572.65 కోట్లను లబ్దిదారుల ఖాతాల్లో జమ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంతవరకు 2,33,069 ఇండ్ల పనులు ప్రారంభం కాగా, వాటిలో బేస్‌మెంట్ స్థాయిలో 90,613, గోడల నిర్మాణం పూర్తయిన స్థాయిలో 41,212 ఇండ్లు, శ్లాబ్ పూర్తయినవి 37,400 ఇండ్లు ఉన్నాయని పేర్కొన్నారు.

# బీఆర్ఎస్ కార్యకర్తలకు కేటీఆర్ కృతజ్ఞతలు

హైదరాబాద్, నవంబర్ 11 (భారత శక్తి) జూబ్లీహిల్స్ ఉపఎన్నిక పోలింగ్ ముగిసిన నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా ఆసక్తికర ట్వీట్ పెట్టారు. ''గత నెలరోజులుగా జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గెలుపు కోసం శక్తివంచన లేకుండా పనిచేసిన పార్టీ నేతలు, కార్యకర్తలకు పేరుపేరున కృతజ్ఞతలు.. అధికార పార్టీ ఎన్ని దౌర్జన్యాలకు పాల్పడినా, భయభ్రాంతులకు గురిచేసినా బయటకు వచ్చి ఓటు వేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు'' అని కేటీఆర్ పేర్కొన్నారు. ఇదిలా ఉంటే.. ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతితో ఉపఎన్నిక నిర్వహించిన విషయం తెలిసిందే. 58 మంది అభ్యర్థులు బరిలో ఉన్నా.. ముగ్గురి మధ్యే ప్రధాన పోటీ ఉంది. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత, బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. గెలుపుపై ఎవరికి వారు ధీమాగా ఉన్నారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.